

మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 24 | సోమవారం | 08-07-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 8+8 | కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


## నేడు విజయవాడకు సిఎం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం విజయవాడ వెళ్లనున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి సభకు హాజరుకావాలని ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల ఇటీవల రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలిసి రేపు విజయవాడ వెళ్లనున్నారు.

## గ్రూప్ 1 మెయిన్స్‌కు 31,382 మందికి అర్హత



1:50 నిష్పత్తి ప్రకారమే ఎంపిక

అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలు

ప్రిలిమినరీ ఫలితాలను వెల్లడించిన టిజిపిఎస్‌సి

అభ్యర్థులు నిరుత్సాహపడొద్దు : సిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రూప్ 1ప్రిలిమ్స్ పరీక్షలో 31,382 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. మెయిన్స్‌కు 1:50 నిష్పత్తి ప్రకారం ఎంపిక చేయనున్నారు. ప్రిలిమినరీ తుది కీతో పాటు ఫలితాలను టిజిపిఎస్‌సి ఆదివారం ప్రకటించింది. అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. పరీక్షకు వారం రోజుల ముందు నుంచే అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని స్పష్టం చేసింది. ప్రాథమిక 'కీ'పై అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత టిజిపిఎస్‌సి తుది కీ విడుదల చేసింది. ఫలితాలను టిజిపిఎస్‌సి వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలని టిజిపిఎస్‌సి కార్యదర్శి డాక్టర్ ఇ.నవీన్ నికోలాస్ సూచించారు. జూన్ 13న ప్రిలిమినరీ కీతో పాటు ప్రధాన ప్రశ్న పత్రాన్ని అభ్యర్థుల లాగిన్‌లో అందుబాటులో పెట్టింది. ప్రాథమిక కీ పై అభ్యంతరాలు స్వీకరించిన తరవాత నిపుణుల అభిప్రాయాల మేరకు తుది కీతో పాటు ఫలితాలను విడుదల చేసింది. టిజిపిఎస్‌సి నిర్వహించిన గ్రూప్1 పరీక్ష మెయిన్స్‌కు అభ్యర్థుల ఎంపిక 1:50 నిష్పత్తిలో కాకుండా 1:100 నిష్పత్తిలో చేయాలని విద్యార్థి సంఘాలు, కొందరు అభ్యర్థులు నిరసనలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. కానీ టిజిపిఎస్‌సి మాత్రం గ్రూప్1 మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలోనే ఎంపిక చేయనున్నారు. సాధారణ పరిపాలన శాఖ జారీ చేసిన జిఒ 29,55 నిబంధనల మేరకు తరువాయి 2లో




## ఇజ్రాయెల్ ఏకపక్ష దాడులతో
# పాలస్తీనా భవిష్యత్తు నేలమట్టం

వక్తల ఆందోళన : దాడులు ఖండించాలని విజ్ఞప్తి

ఇందిరాపార్క్ వద్ద ధర్నా

> భారతదేశం మొదటి నుంచి శాంతి కాముకదేశం. ఇటువంటి దేశాన్ని పరిపాలిస్తున్న పాలకులు (కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ) ఈరోజు పాలస్తీనాను విచ్ఛిన్నం చేస్తుంటే స్పందించడం లేదు. బిజెపి, ప్రధాని మోదీ హిట్లర్ మూసలో ఉన్నారు. ప్రపంచంలో ఏ మనిషి అయినా తమలాంటి వారేనని, వారిలో కూడా ప్రవహించే రక్తంలోని గ్రూపులు ఒకటే....
>
> – కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

పాలస్తీనాపై ఇజ్రాయెల్ ఏకపక్షంగా చేస్తున్న దాడులతో ఆ దేశ భవిష్యత్తు నేలమట్టమవుతోందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను అన్ని దేశాలు ఖండించాలని, అందరూ స్పందించాలని, పాలస్తీనాకు మద్దతుగా నిలబడాలని వారు కోరారు. ఇజ్రాయెల్ దేశంపై ఒత్తిడి తీసుకొచ్చి యుద్ధాన్ని ఆపేందుకు అన్ని దేశాలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ''పాలస్తీనా పై ఇజ్రాయెల్ దాడికి నిరసనగా'' అఖిల భారత శాంతి సంఘీభవ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ''పాలస్తీనాకు మద్దతుగా నిలబడదాం ప్రపంచ శాంతికి పోరాడుదాం''అని డిమాండ్ చేస్తూ హైదరాబాద్,ఇందిరాపార్కులోని ధర్నా చౌక్ వద్ద ఆదివారం ధర్నా జరిగింది. ఈ ధర్నాకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరవ్వగా, అతిథులుగా టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్యపద్మ, ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ , రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి , ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ తోపాటు ఐప్సో అధ్యక్ష వర్గం సభ్యులు రఘుపాల్ , ప్రజా కళాకారిణి విమలక్క తదితరులు వేదికపై ఆశీనులై ప్రసంగించారు. ఈ ధర్నాకు కాంగ్రెస్ మాజీ ఎంఎల్‌సి యాదవ రెడ్డి అధ్యక్షత వహించగా ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి తరువాయి 2లో

## కశ్మీర్‌లో భీకర ఎన్‌కౌంటర్లు

ఆరుగురు ఉగ్రవాదుల హతం...

ఇద్దరు జవాన్ల వీరమరణం

**శ్రీనగర్:** జమ్ము కశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఆరుగురు ఉగ్రవాదులు హతమవగా... ఇద్దరు జవాన్లు వీరమరణం చెందారు. కుల్గామ్‌లోని మోదర్‌గామ్, చినిగామ్ గ్రామాల్లో శనివారం ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య పెద్ద ఎత్తున కాల్పులు జరిగినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు జవాన్లు అమరులవగా... ఆరుగురు ఉగ్రవాదులు మృతి చెందారు. వీరిలో ఇద్దరు మోదర్గాంలో, మిగిలిన నలుగురు చినిగాంలో హతమయ్యారు. కుల్గామ్‌లోని మోదర్గామ్‌లోని ఒక తోటలో నిర్మించిన రహస్య స్థావరంలో, చినిగాం ఫ్రిసల్‌లో ఉగ్రవాదులు ఉన్నట్లు సమాచారం అందడంతో భద్రతా బలగాలు ఏరివేత ఆపరేషన్ ప్రారంభించాయి. ఉగ్రవాదులపై ఆర్మీ ఆపరేషన్ తరువాయి 8లో

## పలు జిల్లాల్లో భారీ వర్షాలు

ఐఎండి ఎల్లో అలెర్ట్ జారీ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఆదివారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. ఆదివారం మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయన్నారు. సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు తరువాయి 8లో

# ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు కళ్లు

తెలుగు రాష్ట్రాల మధ్య ఐకమత్యం అవసరం

ఎపి సిఎం, టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు

ప్రజాపక్షం/హైదరాబాద్



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు తనకు రెండు కళ్లు అని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఏపి సిఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తెలంగాణ గడ్డపై తెలుగుదేశం పార్టీకి పునర్ వైభవం వస్తుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆదివారం ఎన్‌టిఆర్ భవన్‌కు చంద్రబాబు వచ్చారు. జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసం నుంచి ఎన్‌టిఆర్ భవన్ వరకు వందలాదిమంది పార్టీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో నిర్వహించిన టిడిపి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తలు, నాయకులతో చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఏపిలో విజయానికి తెలంగాణ పార్టీ శ్రేణులు ఎంతో కృషి చేశారని అన్నారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డితో సమస్యలు పరిష్కారం దిశగా చర్చలు ఫలప్రదంగా జరిగాయని చంద్రబాబు తెలిపారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఐకమత్యం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ సిఎం రేవంత్‌కు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధే టిడిపి ధ్యేయమని, తెలుగు రాష్ట్రాల మధ్య వివాదం ఉంటే నష్టాలే ఎక్కువన్నారు. ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, ఏపిలో ఎన్‌డిఏ ప్రభుత్వాలు ఉన్నాయని, పార్టీల సిద్ధాంతాలు వేరుగా ఉన్నప్పటికీ తెలుగుజాతి ప్రయోజనాల కోసం కలిసి పని చేస్తామన్నారు.

**తెలంగాణలో యువతకు నాయకత్వం..**

తెలంగాణలో టిడిపిని బలోపేతం చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. తెలంగాణలో యువతకు, చదువుకున్న వారికి నాయకత్వం అప్పగిస్తామని వెల్లడించారు. తెలంగాణ గడ్డపైనే తెలుగు దేశం పార్టీ పుట్టిందన్నారు. తెలంగాణ గడ్డపై టిడిపికి పునర్వైభవం తరువాయి 2లో

# తొలిబోనమెత్తిన గోల్కొండ



కిక్కిరిసిన భక్తులు

ప్రజాపక్షం/హైదరాబాద్

గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాడ మాస బోనాల మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బొనం సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. బ్యాండ్ , డప్పు చప్పులు, శివసత్తులు, పోతరాజుల ఆట పాటలతో గోల్కొండ కోట దద్దర్లింది.భక్తులతో గొల్కొండ ఆలయం కిక్కిరిసి పోయింది. ఆలయ పూజారులు సాయిబాబాచారి, సర్వేశ్వరచారిల ఆధ్వర్యంలో అమ్మవారికి తరువాయి 2లో



## రైతు ఆత్మహత్య బాధాకరం

- రాజకీయాలకు స్థానం లేదు
- నిష్పాక్షికంగా విచారణ..బాధ్యులపై కఠిన చర్యలుంటాయి
- ప్రభాకర్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం
- కుటుంబ సభ్యులను పరిమర్శించిన భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/చింతకాని :** భూ వివాదంలో ప్రొద్దుటూరు రైతు బోజెడ్ల ప్రభాకర్ ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆదివారం భద్రాది జిల్లా చింతకాని మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామంలోని బాధిత రైతు ప్రభాకర్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ప్రభాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భట్టి తరువాయి 2లో

# భారీవర్షాలు... ఉప్పొంగుతున్న నదులు

అసోంను వీడని వరదలు...

29 జిల్లాల్లో ప్రభావం

వరద ముంపులో వేలాది గ్రామాలు

ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్ యాత్ర నిలిపివేత

బీహార్‌లోనూ ప్రమాద హెచ్చరికలు జారీ



**న్యూఢిల్లీ:** దేశంలోని అనేక రాష్ట్రాలను వరదలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాలకు నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. లక్షలాది మంది నిరాశ్రయులై సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఉత్తరాఖండ్ ను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ప్రధాన నదులన్నీ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. భారత వాతావరణశాఖ (ఐఎండీ) రెడ్ అలర్ట్ ప్రకటించింది. రెండ్రోజు పాటు రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. దీంతో చార్‌ధామ్ యాత్రను వాయిదా వేసినట్లు గర్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే తెలిపారు. వర్షాల తరువాయి 2లో

## నేపాల్‌లో వరద బీభత్సం

**ఖాట్మండు:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నేపాల్‌ను మెరుపు వరదలు ముంచెత్తాయి. అనేకచోట్ల కొండచరియలు విరిగిపడి ఇప్పటికే 14 మంది చనిపోయారు. వరదల్లో చిక్కుకొని తొమ్మిది మంది గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం పోలీసులు, ఇతర సహాయక సిబ్బంది శ్రమిస్తున్నట్లు నేపాల్ పోలీసు ప్రతినిధి దాన్ బహదూర్ కార్కి తెలిపారు. జూన్ నుంచి సెప్టెంబరు వరకు వర్షాలు పడతాయి కాబట్టి దక్షిణాసియాలో ఏడాది పొడవునా ప్రాణఆస్తి నష్టం సంభవిస్తుంది కానీ కొన్నేళ్లుగా మెరుపు వరదలు, కొండచరియలు విరిగిపడటం సాధారణమైపోయింది. వాతావరణంలో మార్పులకు తోడు పెరిగిన రోడ్ల నిర్మాణాలతో పరిస్థితి జఠిలమైనట్లు నిపుణులన్నారు. గురువారం నుంచి నేపాల్‌ను వర్షాలు ముంచెత్తుతున్నాయి. హిమాలయ నదులు ఉగ్రరూపం తరువాయి 2లో

## మోదీ తుగ్లక్ విధానాలతోనే నిరుద్యోగం


అనాలోచన నోట్ల రద్దు, జిఎస్‌టి

చైనా దిగుమలతో సంక్షోభం

జుమ్లాలుగా స్కిల్ ఇండియా, ముద్రా, స్వానిధి

యువతకు ఉపాధి కల్పనలో ప్రధాని విఫలం

జైరాం రమేశ్ విమర్శలు



**న్యూఢిల్లీ:** మోదీ ప్రభుత్వం అనుసరించే తుగ్లక్ విధానాలతో నిరుద్యోగం తారస్థాయికి చేరిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తీవ్రంగా విమర్శించారు. అనాలోచితంగా తీసుకున్న నిర్ణయాలతో దేశ యవతకు ఉద్యోగావకాశాలు లేకుండా చేశారని దుయ్యబట్టారు. పెద్దనోట్ల రద్దు, జిఎస్టీ అమలు, చైనా నుంచి దిగుమతులు పెంచుకోవడం, ఎంఎస్ఎంఇలు మూతపడటంతో నిరుద్యోగమన్నది తీవ్రమైన సంక్షోభంగా మారిందని విమర్శించారు. నిరుద్యోగం గరిష్ఠస్థాయికి చేరినట్లు సిటీగ్రూపు కొత్త నివేదిక గురించి జైరాం రమేశ్ ప్రస్తావించారు. సార్వత్రిక ఎన్నికలప్పుడు తమ పార్టీ నిరుద్యోగం గురించి మాట్లాడిందని గుర్తుచేశారు. 'భారత్‌లో నిరుద్యోగ సంక్షోభం కొనసాగుతుండటంపై ఐఎన్‌సీ హెచ్చరికలు చేసింది. ఐదేళ్లలో పరిస్థితి జఠిలంగా తరువాయి 8లో

ప్రపంచం



గాజా స్ట్రిప్‌లో ఒకప్పుడు సుందర నగరంగా పేరొందిన రఫా దుస్థితి ఇది. ఇజ్రాయెల్ నిరంతర దాడుల నేపథ్యంలో, ఎక్కడా చూసినా శిథిల భనాలే.. కాంక్రీట్ కుప్పలే. హమాస్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా సాగిస్తున్న పోరుగా ప్రకటించుకుంటూ, పాలస్తీనా భూభాగాలపై ఇజ్రాయెల్ విచక్షణా రహితంగా దాడులు చేస్తున్నది. బాంబుల వర్షం కురిపిస్తున్నది. చివరికి జనావాసాలను, పాఠశాలలను, ఆసుపత్రులను కూడా విడిచిపెట్టడం లేదు. బాంబుల ధాటికి కూలిన భవనాల కింద ఎన్ని మృతదేహాలున్నాయో... ఎన్ని గొంతులు ఆవేదనతో రోదిస్తున్నాయో... అంతర్జాతీయ సమాజం ఎంతగా వారిస్తున్నప్పటికీ, పాలస్తీనాను తుడిచిపెట్టడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ మారణకాండను కొనసాగించడం విషాదకరం.




గాజాస్ట్రిప్‌పై జరుపుతున్న దాడులను తక్షణమే నిలిపివేసి, కాల్పుల విరమణ పాటించాలని బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వీధుల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్న ఇజ్రాయెల్ పౌరులు. హమాస్ నిర్బంధంలో ఉన్న వారిని విడిపించుకోవడానికి వీలుగా కాల్పుల విరమణ పాటించాలని వారు కోరుతున్నారు. వివిధ దేశాలు మధ్యవర్తిత్వానికి ముందుకొచ్చిన నేపథ్యంలో, ఈ అవకాశాన్ని వినియోగించుకొని, హమాస్‌తో చర్చలు ప్రారంభించాలని కోరుతున్న వేలాది మంది ఇజ్రాయెలీయులు ఆదివారం రహదారులను దిగ్బంధం చేశారు. గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్ పౌరులను హమాస్ బందీలుగా పట్టుకొని, వారిలో 63 మందిని హతమర్చారు. ఇంకా 120 మంది వారి వద్ద బందీలుగా ఉన్నారు.



## ఫ్రెంచ్ ఎన్నికల్లో గెలుపు ఎవరిదో?

**పారిస్:** ఫ్రెంచ్ సార్వత్రిక ఎన్నికల పర్వం ఆదివారం ముగిసింది. 2020నాటి మొదటి విడత పోలింగ్‌తో పోలిస్తే ఈసారి మొదటి విడతలో 20 శాతం తక్కువ ఓట్లు పోలయ్యాయి. రెండో విడత పోలింగ్‌తో ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మాక్రాన్ నేతృత్వంలోని సెంట్రిస్ట్ కూమటి, మితిమీరిన మితవాద నేషనల్ ర్యాలీ మధ్య పోటీ తీవ్రంగా ఉంటుందని ఊహించారు. అయితే, ఎన్నికల సరళిని, అందుకు ముందు విడుదలైన పలు సర్వేలను పరిశీలిస్తే నేషనల్ ర్యాలీ విజయం ఖాయంగా కనిపిస్తున్నది. ఒకవేళ ఏ కారణం చేతైనా మెక్రాన్ కూటమి మెరుగ్గా సీట్లు సంపాదించుకున్నప్పటికీ, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఇతర పార్టీల మద్దతు తీసుకోక తప్పదు. నేషనల్ ర్యాలీకి నాయకత్వం వహిస్తున్న మెరిన్ లె పెన్ జూన్ 30న జరిగిన మొదటి విడత పోలింగ్ అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, తమ పార్టీకి మద్దతుగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపింది. అదే విధంగా రెండో దశలోనూ పార్టీకి అండగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో నేషనల్ ర్యాలీ అనుకున్న స్థాయిలో రాణించలేకపోయింది. దీనితో, ఇదే అతదనుగా భావించిన మెక్రాన్ పార్లమెంటును రద్దు చేసి, ముందస్తు ఎన్నికలు ప్రకటించారు. కానీ, ఆయన పొరపాటు నిర్ణయం తీసుకున్నాడని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడిస్తున్నాయి. నేషనల్ ర్యాలీకే ఓటర్లు పట్టం కడతారని ఎగ్జిట్ పోల్స్ పేర్కొంటున్నాయి. మెక్రాన్ సెంట్రిస్ట్ కూటమికి 20 నుంచి 23 శాతం ఓటింగ్ మాత్రమేన వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాయి.

# సోషలిస్టు పథంలో ప్రయాణమే లక్ష్యం

## బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ ప్రకటన



**లండన్:** బ్రిటన్‌ను సోషలిస్టు పథంలో ముందుకు నడిపించడమే లక్ష్యమని బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. కైర్ స్టార్మర్, లేబర్ పార్టీ గెలిచినంత మాత్రానా దేశంలోని శ్రామికులు, కార్మికులు గెలిచినట్లుగా పరిగణించరాదని పేర్కొంది. గతంలో జెరెమీ కార్బీకి వచ్చిన మెజారిటీతో పోల్చుకుంటే స్టార్మర్‌కు వచ్చినది తక్కువని వ్యాఖ్యానించింది. కార్మికోద్యమ నిర్మాణాలు మరింత బలోపేతంగా సాగించడమే కాకుండా పార్టీ పటిష్ఠతకు చర్యలు తక్షణావసరమని బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ (సీపీబీ) పేర్కొంది. తాజా ఎన్నికల్లో పార్టీ కోసం శ్రమించి ప్రతి ఒక్క కార్యకర్త, అభ్యర్థి, మద్దతుదారునకు కృతజ్ఞతలు తెలుపుతూ ఒక ప్రకటన చేసింది. బ్రిటన్ వ్యాప్తంగా ఆరు వారాల పాటు విస్తృత ప్రచారం జరిగినట్లు తెలిపింది. 'మనం 14 నియోజకవర్గాల్లో పోటీ చేశాం. 50కుపైగా నగరాలు, పట్టణాలను చేరుకున్నాం. ఎన్నికలముందు నిర్వహించిన సీపీబీ నిర్వహించిన ర్యాలీలో వెయ్యి మందికిపైగా పాల్గొన్నారు. సుమారు లక్ష కరపత్రాల పంపిణీ జరిగింది. ఇంగ్లండ్, వేల్స్, స్కాట్లాండ్‌లో ప్రచారం విస్తృతంగా సాగింది. పార్టీ సభ్యత్వ చేర్పింపునకు యువకులు, కార్మిక వర్గం నుంచి ఆదరణ లభించింది. ఇక ఎన్నికలకు వచ్చే సరికి మన లక్ష్యానికి చాలా దూరంగా ఉన్నాం. ఎన్నికల్లో కమ్యూనిస్టుల ఓట్ల వాటా అంతంత మాత్రమే. దీనిని పెంచుకోవడం మనకు అవసరమే కానీ కేవలం ఓట్లను బట్టి కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావాన్ని అంచనా వేయడం సరి కాదు. ఊహించినట్లుగానే కైర్ స్టార్మర్ గెలుపొందారు. అయితే మెరిసేది అంతా బంగారం కాదన్న చందంగానే ఆయన గెలుపును పరిగణించాలి. 2017, 2019లో కార్బీకి వచ్చిన ఓట్లతో పోల్చుకుంటే స్టార్మర్ సాధించిన మెజారిటీ చాలా తక్కువ. స్టార్మర్‌కు లేబర్ పార్టీకి శ్రామిక వర్గ ప్రజల నుంచి విస్తృత మద్దతు లభించదు. స్టార్మర్ గెలవడంతో శ్రామిక వర్గం గెలిచినట్లు కాదు. కమ్యూనిస్టు పార్టీ శ్రామిక వర్గ పోరాటాలకు ప్రతీక. పేదలు, కార్మికులు, శ్రామికుల ప్రయోజనాల కోసమే ఎన్నికల్లో పోటీ చేస్తాం. ట్రేడ్ యూనియన్ల ద్వారా కార్మికోద్యమ నిర్మాణాన్ని ఆకాంక్షిస్తాం. మార్క్సిజంలెనినిస్టు సిద్ధాంతాలాధారంగా పోరాటాలు సాగిస్తాం. రాజకీయ శక్తిగా ఎదగాలనుకుంటాం. కార్మికోద్యమాన్ని నిర్మించుకోవడం, దానిని బలపర్చుకోవడమే మన ముందున్న చర్య. ప్రగతిశీల, శాంతి ఉద్యమాలను విస్తృతం చేయడం అవసరం. కార్మికుల హక్కులు, ప్రజా సేవలు, శాంతి కోసం పోరాటాల్లో కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడు అగ్రభాగానే ఉంటుంది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో భాగంగా పార్టీ నిర్మాణం సాగుతుంది' అని . బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ వెల్లడించింది.

**రువాండా పథకం బుట్టదాఖలే...**

లేబర్ పార్టీ చారిత్రక విజయాన్ని సాధించిన తర్వాత కొత్త ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన కైర్ స్టార్మర్ బ్రిటన్ పునరుద్ధరణకు సంకల్పించారు. రువాండా స్కీమును రద్దు చేసేందుకు నడుం బిగించారు. గిమ్మిక్కులను కొనసాగించలేమంటూ ఆ పథకాన్ని ఉద్దేశించి అన్నారు. ప్రారంభానికి ముందే ఈ పథకం చచ్చిపోయిందని వ్యాఖ్యానించారు. వచ్చే వారంలో జరగనున్న నాటో సదస్సులో పాల్గొనేందుకు స్మార్టర్ వాషింగ్టన్‌కు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ వేదికకు పరిచయం కానున్నారు. ప్రభుత్వ తొలి కర్తవ్యం భద్రత, రక్షణ... అందుకోసం నాటోకూ సంపూర్ణ మద్దతిస్తామని స్టార్మర్ ప్రకటించారు. ఉక్రెయిన్‌కూ తమ మద్దతు ఉంటుందని హామీనిచ్చారు. బ్రిటన్‌లో పరిపాలన కార్యకలాపాలను స్టార్మర్ ప్రారంభించారు. దీంతో కొత్త కేబినెట్ కొలువుదీరింది.



## ఫ్లోరెన్స్‌లో కాల్పుల కలకలం

**ఫ్లోరెన్స్:** అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం రేగింది. ఫ్లోరెన్స్‌లో ఓ వ్యక్తి జరిపిన కాల్పుల్లో నలుగురు మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. నిందితుడు పోలీసుల నుంచి తప్పించుకొని పారిపోయే ప్రయత్నంలో రోడ్డు ప్రమాదానికి గురై, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కెంటకీ పోలీసుస్ చీఫ్ జెఫ్ మాలెరీ తెలిపిన వివరాల ప్రకారం, ఫోరెన్స్‌లో జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో ఈ అపశృతి చోటు చేసుకుంది. ఒక వ్యక్తి విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో, నలుగురు అక్కడిక్కడే మృతి చెందగా, గాయపడిన ముగ్గురిని పోలీసులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పార్టీ ఇచ్చిన ఇంటి యజమాని కూడా ఈ కాల్పుల్లో మృతి చెందడం గమనార్హం. ఆ పార్టీలో సుమారు 23 మంది పాల్గొన్నారని, కాల్పులకు పాల్పడిన వ్యక్తి వారికి పరిచయస్తుడై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, అతను ఏ ఉద్దేశంతో కాల్పులు జరిపాడన్నది ఇంకా స్పష్టంగా తెలియడం లేదు. 20 ఏళ్ల ఆ నిందితుడు కాల్పులు జరిపి, పోలీసుల రాకతో అక్కడి నుంచి వాహనంలో పరారయ్యేందుకు ప్రయత్నించాడు. అయితే, మితిమీరిన వేగంతో వెలుతున్న వాహనం అదుపుతప్పి, పక్కనే ఉన్న గుంతలోకి పడింది. తీవ్రంగా గాయపడిన అతనిని పోలీసులు ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆ యువకుడు మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. కేసు విచారణ జరుపుతున్నామని, త్వరలోనే వివరాలు తెలుస్తాయని పోలీస్ అధికారి మాలెరీ తెలిపాడు.

## నైజీరియాలో బ్లాకౌట్



**అబుజా:** నైజీరియా అంధకారంలో చిక్కుకుంది. దేశమంతా చీకటి కమ్మేసింది. విద్యుత్ గ్రిడ్ పని చేయకపోవడంతో ఆగ్నేయ నైజీరియా ప్రాంతాలకు కరెంటు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఈ మేరకు ఎనుగు విద్యుత్ సరఫరా కంపెనీ తెలిపినట్లు స్థానిక మీడియా పేర్కొంది. సరఫరా పనరుద్ధరణ, గ్రిడ్ వైఫల్యంపై ఓసోగ్బోలోని జాతీయ నియంత్రణ కేంద్రం (ఎన్‌సీసీ) నుంచి సమాచారం కోసం వేచివున్నట్లు కంపెనీ తెలిపింది. అయితే ఈ విధంగా అంధకారం నెలకొనడం కొత్తేమీ కాదు. గత 14 ఏళ్లలో 227 సార్లు పవర్ గ్రిడ్‌లు పనిచేయక బ్లాకౌట్‌లు సంభవించాయి.

## పశ్చిమ ఆఫ్రికా కూటమికి 'జుంటా' దూరం




**నియామే (నిగర్):** పశ్చిమ ఆఫ్రికా కూటమిలో చేరేందుకు నిగర్, మాలీ, బర్కినా ఫాసో సైనిక 'జుంటా' నేతలు నిరాకరించారు. ఎకనామిక్ కమ్యూనిటీ ఆఫ్ వెస్ట్ ఆఫ్రికన్ స్టేట్స్ (ఇసిఒడబ్ల్యుఎఎస్)లో తిరిగి చేరాలంటూ వచ్చిన ప్రతిపాదనను ఇక్కడ సమావేశమైన ఈ మూడు దేశాల జుంటా నేతలు తోసిపుచ్చారు. ఈ ఏడాది జనవరిలో ఇసిఒడబ్ల్యుఎఎస్ నుంచి వైదొలగిన తర్వాత, జుంటా నేతలు తొలిసారి ఇక్కడ సమావేశమై, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, కూటమిలో ఉన్న దేశాల మధ్య సరైన అవగాహన లేదని విమర్శించారు. పశ్చిమ ఆఫ్రికాలోని కొన్ని దేశాలు అలియన్స్ ఆఫ్ సాహెల్ స్టేట్స్ (ఎఎస్ఎస్) పేరుతో మరో కూటమిని ఏర్పాటు చేసుకున్నాయని, కానీ ఇప్పటి వరకూ దానిని బలోపేతం చేయలేకపోయాయని అన్నారు. తమ దేశాల ఆర్థిక వ్యవస్థలకు, సార్వభౌమాధికారానికి ఇసిఒడబ్ల్యుఎఎస్ ప్రమాదకరంగా మారిందని జుంటా నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే, ఆ కూటమిలో చేరబోవడం లేదని స్పష్టం చేశారు. ఎఇఎస్ పేరుతో త్వరలోనే ఒక కూటమిని ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు.

## తొలిబోనమెత్తిన గోల్కొండ

(మొదటి పేజీ తరువాయి)

పూజలు నిర్వహించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా గోల్కొండకోటలో భక్తులకు కావాల్సిన అన్నిసౌకర్యాలు కల్పించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గోల్కొండ, లంగర్ హౌస్ పరిసర ప్రాంతాల్లో 600 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యకమంలో మాజీ ఎంపీ వీహన్మంత్ రావు, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ , దేవాదయశాఖ కమిషనర్ హన్మంత్‌రావు, హైదరాబాద్ కలెక్టర్ అనుదిప్ దురశెట్టి, నగర పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్ అరవింద్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు ...**

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి కొండ సురేఖ హైదరాబాద్ ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్ ,మేయర్ గద్వాల విజయ లక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్,ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి తదితరులు ప్రభుత్వ తరపున పట్టు వస్త్రాలను సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లంగర్ హౌజ్ వద్ద అమ్మవారికి సమర్పించే తొలిబోనం (నజర్ బోనం), తొట్టెల, రథనాకి ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపు ప్రారంభించారు. లంగర్ హౌస్ చౌరస్తా నుంచి మధ్యాహ్నం 1గంటకు ప్రారంభమైన రథం, తొట్టెల ఊరేగింపు రాత్రి 7 గంటలకు కోటకు చేరుకుంది. సోనియాగాంధీ ఇచ్చిన తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న తొలి బోనాలలో పట్టువస్త్రాలను సమర్పించే అవకాశం మహిళగా తనకు రావడం అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి కొండ సురేఖ అన్నారు.

## 31,382 మంది అర్హత

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థుల ఎంపిక ఉంటుందని ప్రకటించింది.

**1: 50 నిష్పత్తి ప్రకారమే ఎంపిక....**

గ్రూప్ 1లో 1:50 నిష్పత్తి ప్రకారమే ఎంపిక చేయనున్నారు. కాగా 1:100 నిష్పత్తితో ఎంపిక చేసి ప్రతిభ గల అభ్యర్థులకు న్యాయం చేయాలని కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం, ఈసమస్యను చట్టానికి లోబడి త్వరితగతిన కమిషన్ చర్యలు తీసుకోవాలని సూచించింది. హైకోర్టు ఉత్తర్వులను పరిశీలించిన టిజిపిఎస్‌సి 1:100 పద్ధతి సాధ్యం కాదని స్పష్టం చేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న 1:50 నిష్పత్రి విధానాన్నే కొనసాగిస్తున్నామని తెలిపింది. అయితే నోటిఫికేషన్ జారీ, పరీక్షలు పూర్తయిన తర్వాత 1:100 నిష్పత్తి ప్రకారం ఎంపిక చేస్తే కొందరు న్యాయపరమైన చిక్కులు వస్తాయని, కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశాలు ఉంటాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

**అభ్యర్థులు నిరుత్సాహపడొద్దు : సిఎం**

టిజిపిఎస్‌సి గ్రూప్–1మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. తెలంగాణలో గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు సిఎం శుభాకాంక్షలు తెలిపారు. టిజిపిఎస్‌సి గ్రూప్ –1 మెయిన్స్‌కు అర్హత సాధించిన 31,382 మందికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. అక్టోబర్ 21 నుంచి 27 మధ్య జరిగే మెయిన్స్ పరీక్షలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్' వేదికగా సిఎం ఒక పోస్టు పెట్టారు. ప్రిలిమినరీ పరీక్షలో విజయం సాధించలేకపోయిన అభ్యర్థులు నిరుత్సాహపడొద్దని విజ్ఞప్తి చేశారు. జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, దాని కోసం ప్రయత్నించడం, విజయం సాధించే వరకు ప్రయత్నాన్ని విరమించకపోవడం ఒక వ్యాపకంగా పెట్టుకున్నవారు ఎప్పటికైనా విజయతీరాలకు చేరతారని ఈ సందర్భంగా సిఎం పేర్కొన్నారు. కాగా టిజిపిఎస్‌సి గ్రూప్–1 ప్రిలిమ్స్ ఫలితాలను ఆదివారం ఉదయం టిజిపిఎస్‌సి విడుదల చేసింది. తుది కీతో పాటు ఫలితాలను టిజిపిఎస్‌సి ఒకేసారి విడుదల చేసింది. గ్రూప్1 మెయిన్స్‌కు 31,382 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. టిజిపిఎస్‌సి అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను చూసుకోవచ్చని టిజిపిఎస్‌సి తెలియజేసింది.

## నేలమట్టం

(మొదటి పేజీ తరువాయి)

కెవిఎల్ స్వాగతం పలికారు.

**ప్రతిఒక్కరూ స్పందించాల్సిందే : కూనంనేని సాంబశివరావు**

ఈ ధర్నానుద్దేశించి కూనంనేని సాంబశివరావు ప్రసంగిస్తూ పాలస్తీనాపైన జరుగుతున్న దాడులపైన ప్రతి ఒక్కరూ స్పందించాలని కోరారు. అందరూ తమకెందకని అనుకుంటే ప్రపంచంలో శాంతి కూడా ఉండేది కాదన్నారు. తమ కుటుంబాన్ని తాము చూసుకుంటామని, లేదా తమ గ్రామాన్ని తాము చూసుకుంటామనుకుంటే సరిపోదని చెప్పారు. ఇప్పటికే మనం మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాన్ని చూశామన్నారు. ఇతర దే శాలకు బతుకుదెరువు కోసం వచ్చిన పాలస్తీనులను ఊళ్లు ఊళ్లు తిప్పుతున్నారని, వారికి కనీసం రేషన్ కార్డులు, మంచినీళ్లు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రోజుల్లో దలైలామా లాంటి వారిని ఇండియా ఆశీర్వదించిందని కూనంనేని గుర్తు చేశారు. భారతదేశానికి శరనార్థులుగా వచ్చిన వారిని కాపాడడంలో కృషి చేశారని, ఆనాడు బంగ్లాదేశ్ ఏర్పాటులో ఇందిరాగాంధీ లాంటి వారి సహాయ సహకారాలు ఉన్నా యన్నారు. భారతదేశం మొదటి నుంచి శాంతి కాముక దేశమని, ఇటువంటి దేశాన్ని పరిపాలిస్తున్న పాలకులు (కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం) ఈరోజు పాలస్తీనాను విచ్ఛిన్నం చేస్తుంటే స్పందించడం లేదని దుయ్యబట్టారు. బిజెపి, ప్రధాని మోదీ హిట్లర్ మూసలో ఉన్నారని విమర్శిం చారు. ప్రపంచంలో ఏ మనిషి అయినా తమలాంటి వారే నని, వారిలో కూడా ప్రవహించే రక్తంలోని గ్రూపులు ఒకటేనని గుర్తు చేశారు. ఈ బుద్ధి జ్ఞానం అమెరికా పాలకు లకు, ఇండియాలో నరేంద్రమోడీకి ఎప్పుడు వస్తుందో అర్థం కావడం లేదన్నారు. ప్రొఫెసర్ కోదండరామ్, ప్రొఫెసర్ హరగోపాల్ లాంటి వారి సూచనలను గత పాలకులు(బిఆర్ఎస్ ప్రభుత్వం) పట్టించుకోలేదని విమ ర్శించారు. కలంలోని సిరా చుక్క...లక్షల మెదళ్లకు కదలిక మాదిరిగా ఈ కార్యక్రమం అన్ని చోట్లకు పోవాలన్నారు. ఒక రాష్ట్రం నుండి ఇంకో రాష్ట్రం, అక్కడి నుంచి మరో దేశం ఇలా ప్రపంచ వ్యాప్తంగా వెళ్లాలని సూచించారు. ప్రపంచ శాంతి వర్ధిల్లాలని,దేశంలో జాతి అహంకార యుద్ధాలు జరుగుతున్న నేపథ్యంలో సామాన్యులకు స్వేచ్ఛ రావాలని కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ పాలస్తీనా గత కొన్ని దశాబ్దాలు గా తమ దేశాన్ని స్వతంత్ర్య దేశంగా ప్రకటించాలని పోరా డుతున్నదన్నారు. ఈ క్రమంలోనే ఐక్యరాజ్యసమితి మధ్యే మార్గంగా కొన్ని తీర్మానాలు చేసినప్పటికీ ఇజ్రాయిల్ వాటిని అమలు చేయకపోగా, పాలస్తీనాలోని పాఠశాలలు , దవాఖానాల మీద బాంబుల వర్షం కురిపించడం దుర్మార్గ మన్నారు. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ గాజాజట్టిలో వేలాది మంది పౌరులను చంపడం, స్థానభ్రంశం చేయడం, గృహాలు, వ్యాపారాలు, మౌలిక సదుపాయాలను ఇజ్రా యిల్ ధ్వంసం చేస్తూ మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. అంతర్జాతీయ సమాజం ,ముఖ్యంగా అమెరికా వంటి ఇజ్రాయిల్ సన్నిహిత మిత్రదేశాలు, పాలస్తీనాపై జరుగుతున్న యుద్ధాన్ని అంతం చేసేందుకు, వాటిని పరిష్కరించేందుకు ఇజ్రాయిల్‌పై ఒత్తిడి చేయాల్సిన బాధ్యత ఉన్నదని తెలిపారు. డాక్టర్ దిడ్డి సుధాకర్ మట్లాడుతూ శాంతి ఉద్యమ కారులు కూడా స్పందించి పాలస్తీనాకు సంఘీభావంగా నిలవాలని సూచించారు. ఈ ధర్నాలో ఐప్సో నేతలు రఘుపాల్, ఎంఎ మాజీద్, అప్సాబేగం , నాగేందర్ ప్రసాద్, రవి కిరణ్, ఉమా మహేశ్, ప్రేమ్ పావని, రామరాజు, యమునా గౌడ్ , గురుబచ్చన్‌సింగ్, లాక్ష్యా నాయుడు , సిపిఎం నేత జెకె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్య బాధాకరం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ పుట్టింది బతకడానికని చావడానికి కాదన్నారు. ఎంత పెద్ద సమస్య ఉన్నా ఎక్కడో ఒక చోట పరిష్కారమార్గం వెతుక్కోని బతకడానికి ప్రయత్నం చేయాలే తప్ప ఎవరూ ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. రైతును ఆత్మహత్యకు పురిగొల్పి.. దానికి దారి తీసిన పరిస్థితులను కల్పించిన వ్యక్తులు ఎవరైనా సరే ఎంత పెద్దవారైనా సరే నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధ్యులైన వారిపై చట్టపరంగా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని సంబంధించిన పోలీసు అధికారులను ఆదేశించానన్నారు. నా నియోజకవర్గంలో అందరూ నావాళ్ళేనని జరిగిన పొరపాటుకు ఎవరు కారణమైనా ఉపేక్షించేది లేదన్నారు. రైతు ప్రభాకర్ భూమికి సంబంధించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. పిల్లలు చదువుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇతత్రతా కుటుంబ సభ్యులు తెలిపిన సమస్యలను పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇది మానవత్వంతో చూడాల్సిన సంఘటన అని ఇందులో ఎలాంటి రాజకీయాలు లేవని ఏ పార్టీ వారైనా మనిషి ప్రాణం ఒకటేనన్నారు. ప్రభాకర్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. అనంతరం వివాదాస్పద భూమిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, ఖమ్మం ఆర్డీవో గణేష్, జిల్లా కాంగ్రెప్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిలాల నాయకులు రాయల నాగేశ్వరరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జున్‌రావు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీకి హిట్లర్‌కి పట్టిన గతి పడుతుంది పల్లా రాజేశ్వరరెడ్డి**

గ్లోబెల్స్ ప్రచారంతో పరిపాలన సాగించిన హిట్లర్‌కి పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి పేర్కొన్నారు.భూ వివాదంలో ఆత్మహత్య చేసుకున్న ప్రొద్దుటూరు రైతు బోజెడ్ల ప్రభాకర్ కుటుంబాన్ని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆదివారం పరామర్శించారు.ఈ సందర్భంగా ప్రభాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల్పించారు. కుటుంబసభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రభాకర్ కుటుంబానికి పార్టీ అండంగా ఉంటుందని హామీ ఇచ్చారు. బారాస పార్టీ తరుపున భాధిత కుటుంబానికి రూ. 2లక్షల ఆర్థిక సహాయం అందజేశారు.అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో పల్లా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు వందల రోజుల్లో రోజుకో రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడన్నారు.ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో రైతు ఆత్మహత్యలు జరుగుతున్నా కనీసం వారు ఎందుకు బాధితరైతులను పరామర్శించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి , ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జిల్లా పరిషత్ అధ్యక్షుడు లింగాల కమల్‌రాజు, ఎనుగుల రాకేష్ రెడ్డి ,జిల్లా నాయకులు ఆర్జేసీ క్రిష్ణ, మంకెన రమేష్,వైస్ ఎంపిపి గురిజాల హనుమంతరావు,పార్టీ మండల కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, యువజన నాయకులు పిన్నెల్లి శ్రీనివాస్ బారాస నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉప్పొంగుతున్న నదులు

(మొదటి పేజీ తరువాయి)

కారణంగా చమోలీ జిల్లాలోని బద్రీనాథ్ నేషనల్ హైవేపై కొన్ని చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఫలితంగా వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అసోంలో వరద పరిస్థితి భయంకరంగా ఉంది. మతుల సంఖ్య 70కి చేరుకుంది. బ్రహ్మపుత్ర ప్రమాదస్థాయికి మించి ప్రవహిస్తోంది, ప్రస్తుతం 577 సహాయ శిబిరాల్లో 53,000 మందికి పైగా ప్రజలు ఆశ్రయం పొందుతున్నారు. జోర్హాట్ నుండి ధుబ్రి వరకు బ్రహ్మపుత్ర వంటి ప్రధాన నదులు అనేక ప్రాంతాల్లో పొంగిపొర్లుతున్నాయి. దాదాపు 24 లక్షల మంది ప్రజలు వరదలకు ప్రభావితమయ్యారని పీటీఐ నివేదించింది. ఈ ఏడాది వరదలు, కొండచరియలు విరిగిపడటం, తుపాన్ల కారణంగా మరణించిన వారి సంఖ్య 70కి చేరుకుంది. ఇప్పటి వరకు 29 జిల్లాలు వరదలతో ప్రభావితం కాగా... ధుబ్రీ తీవ్రంగా దెబ్బతింది. ఇక్కడ 7.95 లక్షల మంది ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

**బీహార్‌లో...** గత 24 గంటల్లో బీహార్‌లోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో కోసి, మహానంద, భాగమతి, గండక్, కమలా బాలన్, కమ్లా సహా ప్రధాన నదులు చాలా చోట్ల ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. సీతామర్హి, ముజఫర్‌పూర్, షెయోహర్, ఔరాయ్ , సుప్పి పరిసర ప్రాంతాల్లో భాగమతి నది నీటి మట్టం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఆదివారం ఉదయం 8 గంటలకు సీతామర్హి, సుప్పిలో భాగమతి నది నీటి మట్టం 71.16 మీటర్లకు చేరిందని... ఇది ప్రమాద స్థాయి కంటే 0.16 మీటర్ల ఎత్తులో ఉందని, ముజఫర్‌పూర్, షెయోహర్, ఔరాయ్, పిప్రాహిలలో ప్రమాద స్థాయిని దాటినట్లు జలవనరులశాఖ వెల్లడించింది. ఇక గోపాల్‌గంజ్, సిధ్వాలియాలో గండక్ నది 62.22 మీటర్ల (ఆదివారం ఉదయం 8 గంటల వరకు) ప్రమాదకర స్థాయికి మించి ప్రవహిస్తోంది. అదేవిధంగా కమల బాలన్ నది మధుబని, లఖ్‌నౌర్, ఝంఝర్‌పూర్‌లో ప్రమాదకర స్థాయిని తాకింది.

**థానే పర్యాటకులను కాపాడిన సహాయబృందాలు**

మహారాష్ట్రలోని థానే జిల్లాలో కురిసిన భారీ వర్షాలు జనజీవనాన్ని స్తంభింపజేశాయి. అనేక భవనాలు వరదనీటిలో చిక్కుకోగా.. రైల్వే ట్రాక్‌లపై మట్టిచేరడంతో లోకల్ రైల్ సర్వీసుల్ని తాత్కాలికంగా రద్దు చేశారు. ఆదివారం ఉదయాన్నే గాలులతో కూడిన వాన బీభత్సం సష్టించింది. ఈ వర్షం ధాటికి పలుచోట్ల లోకల్ రైళ్లు తాత్కాలికంగా రద్దు కాగా.. కొన్ని భవనాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. థానేలోని షాపూర్ ప్రాంతంలో ఓ రిసార్టును వరదనీరు చుట్టుముట్టగా.. అందులో చిక్కుకున్న 49 మందికి పైగా పర్యాటకులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చినట్లు ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు వెల్లడించారు. వర్షాకాలం నేపథ్యలో ముంద స్తు సన్నద్ధతలో భాగంగా ముంబయి, థానే, పాల్ఘర్ జిల్లాల్లో పలుచోట్ల 13 ఎన్డీఆర్ఎఫ్ బందాలను మోహరించినట్లు పేర్కొన్నారు. మరోవైపు, భారీ వర్షం నేపథ్యంలో కసర టిట్వాలా స్టేషన్ల మధ్య పలు లోకల్ రైళ్ల సర్వీసుల్ని రద్దు చేసినట్లు సెంట్రల్ రైల్వే అధికారులు వెల్లడించారు.

**యూపీలో...**రుతుపవనాలు ప్రభావంతో ఉత్తరప్రదేశ్‌లో భారీవర్షాలు కురుస్తున్నాయి. దీంతో అనేక నదులు పొంగి పొర్లుతున్నాయి. శ్రావస్తి జిల్లాలోని ఓ గ్రామంలో పొలంలో పనిచేస్తూ వరదలో చిక్కుకున్న 12మంది మహిళలు, వారి పిల్లలను సహాయక బృందాలు రక్షించా యి. భారీవర్షాలకు ఖుషీనగర్, బల్రాంపూర్, శ్రావస్తి జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో అనేక నదుల నీటి మట్టం పెరగడంతో సమీప గ్రామాల్లోకి వరద నీరుచేరింది. ఖుషీనగర్‌లోని గండక్ నది నీటిమట్టం ప్రమాద స్థాయిని దాటింది. దీంతో ఖడ్డా తహసీల్‌లోని 13గ్రామాలను వద ముంచెత్తింది. జిల్లాలోని నారాయణపూర్ ప్రాంతంలోని ఓ ద్వీపంలో 66 మంది వరదనీటిలో చిక్కుకుపోగా వారిలో 62 మందిని రక్షించారు. మిగిలిన నలుగురిని సురక్షితంగా తీసుకురావడానికి ఆపరేషన్ కొనసాగుతోంది. శ్రావస్తిలో రప్తి నది ప్రమాద స్థాయిని దాటి 18 గ్రామాలను ప్రభావితం చేసింది. సహాయక బృందాలు వరద ప్రభావిత ప్రాంతాల్లో మోహరించాయి. జిల్లాలో 19 వరద పోస్టులను ఏర్పాటు చేశామని, రప్తి బ్యారేజీలో నీటిమట్టాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, 32 వైద్య బందాలను కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. రాగల మూడురోజుల్లో గోరఖ్‌పూర్, బహ్రైచ్, గోండా, బస్తీ, సంత్ కబీర్ నగర్, మహరాజ్‌గంజ్, బల్రాంపూర్, శ్రావస్తీ, లఖింపూర్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

## రెండుకళ్లు

(మొదటి పేజీ తరువాయి)

వస్తుందని చంద్రబాబు ఆశభావం వ్యక్తం చేశారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఒకస్థాయికి వచ్చేసిందని, తలసారి ఆదాయంలో తెలంగాణ, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర కంటే ముందుందన్నారు. తెలంగాణను తర్వాత స్థాయికి తీసుకెళ్ళటానికి ఇక్కడ నాయకులకు అవకాశముందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఇబ్బందుల నుంచి గట్టెకించే బాధ్యత తనదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నందమూరి సుహాసిని, బక్కిన నరసింహులు, అరవింద్ కుమార్‌గౌడ్, నన్నూరి నర్సిరెడ్డి, కట్రగడ్డ ప్రసూన, గడ్డి పద్మావతి, సికింద్రాబాద్ లోక్‌సభ అధ్యక్షుడు పి.సాయిబాబా, నల్లెల్ల కిషోర్, పి.బాల్‌రాజ్ గౌడ్, విజయశ్రీ, రాజా చౌదరి, నాగు నగేశ్, కట్ట రాములు పాల్గొన్నారు.

## వరద బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

దాల్చాయి. ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో నది పరివాహక ప్రాంతాలన్నీ ముంపునకు గురయ్యారు. పక్కనే ఉన్న భారత్, బంగ్లాదేశ్‌లోనూ ఇదే తరహా పరిస్థితి ఉండటంతో నష్టం మరింత పెరిగిందన్న అంచనాఉంది. గతనెల నేపాల్‌ను తుపాను కుదిపివేసింది. కొండచరియలు విరిగిపడటం, పిడుగుపాట్లు, వరదలు సంభవించడంతో 14మంది ప్రాణాలు కోల్పోయారు.

# వైభవంగా పూరీ జగన్నాథుడి రథయాత్ర..



**పూరీ :** ఒడిశాలోని పూరీ జగన్నాథుని విశ్వప్రసిద్ధ రథయాత్ర భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ఆదివారం సాయంత్రం వైభవంగా ప్రారంభమైంది. ఒడిశాతో పాటు దేశం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు రథయాత్రను వీక్షించేందుకు తరలిరావడంతో పూరీ పట్టణం జనసంద్రంగా మారింది. జగన్నాథ, బలభద్ర, సుభద్రలు శ్రీక్షేత్రంలోని రత్నసింహాసనం వీడి యాత్రగా... పెంచిన తల్లి గుండిచా దేవి మందిరానికి చేరుకోనున్నారు.

గర్భగుడిలోని దివ్య(దారు) విగ్రహాలు భక్త జనఘోష మధ్య రథాలపై మూడు కిలోమీటర్లు ప్రయాణించి అమ్మ సన్నిధికి చేరుకుంటాయి. ఈసారి రథయాత్రకు ప్రత్యేకత ఉంది. 1971 తర్వాత ఒకేరోజు జగన్నాథుని నవయవ్వన దర్శనం, నేత్రోత్సవం, రథయాత్ర నిర్వహిస్తున్నారు. మూడు వేడుకలు ఆదివారమే ఉండడంతో జగన్నాథుని నందిఘోష్, బలభద్రుని తాళధ్వజ, సుభద్ర దర్పదళన్ రథాలు ఆదివారం సాయంత్రానికి అమ్మ ఆలయానికి చేరుకొనే పరిస్థితి లేదు. స్వామిసేవలు పూర్తయ్యే వరకు రథాలను మార్గమధ్యలో నిలిపివేస్తారు. మళ్లీ సోమవారం భక్తులు రథాలనులాగుతారు.

**రథయాత్రకు హాజరైన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము..**

పూరీ రథయాత్రకు గతంలో రాష్ట్రపతులెవరూ రాలేదు. తొలిసారి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. గవర్నర్ రఘుబర్‌దాస్‌తో కలిసి రాష్ట్రపతి.. సుభద్రమ్మ రథం లాగారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్రమంత్రులు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. రెండురోజుల రథయాత్రలో 15 లక్షల మంది భక్తులు పాల్గొంటారని అంచనా. దీన్ని దృష్టిలో ఉంచుకొని పూరీ పట్టణానికి మూడంచెల భద్రత కల్పించారు.

**కిక్కిరిసిన పూరీ వీధులు**

ఒడిశాతో పాటు దేశం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు జగన్నాథుని తరలివచ్చారు. దీంతో పూరీ కిక్కిరిసిపోయింది. జై జగన్నాథ్, హరిబోల్ నామస్మరణతో అక్కడి వీధులన్నీ మార్మోగుతున్నాయి.

రథయాత్ర సందర్భంగా ఆదివారం తెల్లవారుజాము 4 గంటలకు రత్నసింహాసనంపై చతుర్ధా మూర్తులు కొలువు దీరారు. అనంతరం జగన్నాథుని నవయవ్వన రూపాలంకరణ జరిగింది. మంగళహారతి, మైలం, అబకాశ, తిలకధారణ, గోపాలవల్లభ సేవల తర్వాత 10 గంటలకు నేత్రోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు పూరీ రాజు గజపతి దివ్యసింగ్‌దేవ్ రథాలపై చెరాపహారా (చీపురుతో రథాల ముందు ఊడ్చడం) చేశారు. సాయంత్రం 4 గంటలకు రథాలకు సారథులు, అశ్వాలు అమర్చి తాళ్లు కట్టారు. అనంతరం.. తొలుత బలభద్రుని తాళధ్వజ రథం లాగడంతో లాంఛనంగా రథయాత్ర ప్రారంభమైంది.



## హైదరాబాద్‌లో రథయాత్రను ప్రారంభించిన సిఎం రేవంత్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఇస్కాన్ టెంపుల్ అబిడ్స్, హైదరాబాద్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించింది. ఆదివారం ఇందిరాపార్కు ఎన్‌టిఆర్ స్టేడియం నుండి ఆరంభమైన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీని లాంఛనంగా ప్రారంభించారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్ నుండి ఆర్‌టిసి క్రాస్ రోడ్, నారాయణగూడ, హిమాయత్ నగర్ లిబర్టీ మీదుగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు కొనసాగిన రథయాత్రనుద్దేశించి సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఇస్కాన్ సంస్థ ఒక మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ఇలాంటి మంచి కార్యక్రమాలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ ప్రభుత్వం అందరిదని.. సర్వమతాలకు స్వేచ్ఛ, అవకాశాలను ఇస్తుందన్నారు. తమ ప్రభుత్వం మత సామరస్యాన్ని పాటిస్తుందన్నారు. ఇస్కాన్ సంస్థ ప్రార్థనలతో రాష్ట్రం సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకుంటున్నానన్నారు. మానవ సేవే మాధవ సేవ అనే సందేశం అందరికీ చేరేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

## కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు : మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని కెసిఆర్ అప్పులకుప్పగా మార్చారని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం సిఎల్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జూపల్లి మాట్లాడుతూ..పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ నాయకులకు లేదన్నారు.అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆరోపించారు.దీంతో అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించారన్నారు.తెలంగాణ వస్తే చాలు మరే పదవి వద్దన్నాడు.. జాతీయ పార్టీగా బిఆర్ఎస్ ను విస్తరించి.. ప్రధాని కావాలని కలలు కన్నాడు, సార్.. కారు.. పదహారు అన్నారు... పార్లమెంటు ఎన్నికల్లో ఉన్న సీట్లు పోయాయి. డిపాజిట్లు కూడా రాలేదని తెలిపారు. పూర్తి మెజార్టీ ఉండి కూడా.. ఇతర పార్టీ ఎమ్మెల్యేలను కెసిఆర్ ఆనాడు తన పార్టీలో చేర్చుకున్నాడన్నారు.విలువలు ఉండి ఉంటే ఆనాడు.. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకుని విలీనం చేసే వాడు కాదన్నారు. బిజెపి తో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేశారు,ప్రజా తీర్పును అపహాస్యం చేసిన బిఆర్ఎస్ పార్టీ ని.. ఆ ఎమ్మెల్యేలు వీడుతున్నారన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి పదవిని వదులుకున్నారు వారిని విమర్శించే స్థాయి మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి లేదన్నారు.

ఇచ్చిన తెలంగాణను ఆగమాగం చేశారని ఆరోపించారు. అనంతరం షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలువల గురించి మాట్లాడటం... దయ్యాలు... వేదాలు వల్లించినట్లు ఉందని అన్నారు. మీరు చేస్తే సంసారం... అదే మేము చేస్తే వ్యభిచారమా? అని ప్రశ్నించారు.

## డిఆర్ఐ దాడిలో బంగారం పట్టివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు గుట్టు చప్పుడు కాకుండా నడుస్తున్న బంగారం స్మగ్లింగ్‌కు డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) బ్రేక్ వేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు కోల్‌కత్తా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న బస్సును డిఆర్ఐ అధికారులు సోదా చేయగా సుమారు నాలుగు కిలోల బంగారం బిస్కెట్లు లభించాయి. వీటిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరు తరచు కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న డిఆర్ఐ అదనపు డిజి హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు బస్సుపై దాడి చేయడంతో స్మగ్లింగ్ దందా బట్టబయలైంది. ఈ బంగారం తరలింపు వెనుక ఎవరెవరు ఉన్నారు, హైదరాబాద్‌లో ఈ బంగారాన్ని ఎవరు తీసుకుంటున్నారు అనే విషయాలపై నిందితులను విచారిస్తున్నారు.



## ఎగుమతుల్లో 5 శాతానికి పైగా వాటా ఇ-ఫార్మా రంగానిదే

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ ఎగుమతుల్లో 5 శాతానికి పైగా వాటా ఈ ఫార్మా రంగానిదే కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు.హైదరాబాద్ ను ఫార్మసీ హబ్ గా మార్చిన ఫార్మా ఇండస్ట్రీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం హైటెక్స్‌లో జరిగిన ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ 73వ సమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూఫార్మ పరిశ్రమకు చెందిన రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్, క్వాలిటీ కంట్రోల్, అష్యూరెన్స్, మార్కెటింగ్ రెగ్యులేటరీ లాంటి వివిధ విభాగాలకు ప్రాతినిధ్యం వహించే 50 వేల మంది ఫార్మసీ ప్రొఫెషనల్ పాల్గొన్న ఈ సమావేశంలో మాట్లాడటం నాకు చాలా సంతోషంగా ఉందన్నారు. మనదేశ ఎగుమతుల్లో ఫార్మా ఉత్పత్తులే ఐదో అతి పెద్ద వాటా కల్గి ఉందని, గత ఏడాది మన దేశం రూ. 1. 83 లక్షల విలువైన ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులను ఎగుమతి చేసిందన్నారు. ఇందులో 35 శాతం, అంటే రూ. 67 వేల కోట్ల విలువైన ఉత్పత్తులను ఒక్క అమెరికాకే ఎగుమతి చేశామని, భారతీయ ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులు నాణ్యతలో, అన్ని విధాల బెస్ట్ అని ఆధార రుజువైందని తెలిపారు. కరోనా కష్టకాలంలో భారత దేశం యుద్ధ ప్రాతిపదికన వ్యాక్సిన్ తయారు చేసి యావత్ ప్రపంచానికి అందజేసిందని. భారత దేశం దాదాపు 75 మిలియన్ డోసుల వ్యాక్సిన్ ను 94 దేశాలకు, ఐక్య రాజ్య సమితికి చెందిన రెండు ఎంటిటీలకు అందజేయడంతో భారత్ విశ్వబంధు గా ప్రపంచంలో కీర్తి పొందిందన్నారు. ఆయన ఈ 73 వ సమావేశంలో ప్రపంచంలో భారతీయ ఫార్మా రంగం యొక్క ప్రాముఖ్యతను తెలియచేస్తుందని, వికసిత్ భారత్ లక్ష్యంగా ఫార్మా పరిశ్రమ మద్దతు అవసరమని చెప్పారు.

## పాఠశాల విద్యను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకోండి

### సిఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను పట్టించుకోవడంలేదని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. అరకొర వసతులు, టీచర్ల కొరత, పాఠ్య పుస్తకాలు,యుస్తులు,శానిటేషన్ కొరత, వేతనాల చెల్లింపులో ఆలస్యం వంటి సమస్యలు తెలంగాణ విద్యావ్యవస్థను పట్టిపీడిస్తున్నాయన్నారు. తక్షణమే పాఠశాల విద్యను గాడిన పెట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు హరీశ్ రావు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి ఆదివారం బహిరంగ లేఖ రాశారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడే కోడి గుడ్ల బిల్లులను కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రెండు జతల స్కూల్ యూనిఫామ్ ఇవ్వకుండా ఒక్క జత బట్టలు మాత్రమే ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకున్నదని తెలిపారు. పాఠశాల విద్యావ్యవస్థను అనేక సమస్యలు చుట్టు ముట్టినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద విధులు నిర్వర్తిస్తున్న 54,201 మంది కుక్ కమ్ హెల్పర్లకు ఏడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న భోజన బిల్లులు, కోడిగుడ్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌జిటిల బదిలీల నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పడిన సుమారు 9 వేల ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు.

## బోనాల ఉత్సవాలకు చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బోనాల ఉత్సవాల సందర్భంగా సబ్జిమండిలోని శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ మహంకాళి దేవాలయ కమిటి సభ్యులకు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, హైదరాబాద్ కలెక్టర్ దేవాదాయ శాఖ కమిషనర్ పాల్గొన్నారు. దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కుడుముల రాకేష్ కోశాధికారి కట్ట శ్రీనివాస్ సలహాదారులు జలగరి వేణు, కట్ట నర్సింగ్ రావు, ఆవిశెట్టి శ్యాంసుందర్, గాండ్ల నిరంజన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయాల్లో అజాతశత్రువు డిఎస్

### విలువలకు ప్రాముఖ్యతను ఇచ్చారని రాజకీయ నేతలు, ప్రముఖుల ప్రశంస

**ప్రజాపక్షం / హైదరాబాద్:** రాజకీయాల్లో అజాతశత్రువు ధర్మపురి శ్రీనివాస్ అని, ఆయన రాజకీయాల్లో విలువలకు ప్రాముఖ్యతను ఇచ్చేవారని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల మరణించిన ఉమ్మడి ఎపి మాజీ మంత్రి, పిసిసి మాజీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ సంస్మరణ సభ ఆదివారం గచ్చిబౌలిలో జరిగింది.

వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని ధర్మపురి శ్రీనివాస్ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులు అర్పించారు. ఉమ్మడి ఎపి, కాంగ్రెస్ ప్రభుత్వంలో, తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ధర్మపురి శ్రీనివాస్ ప్రముఖపాత్ర పోషించారని వక్తలు గుర్తు చేసుకున్నారు. డిఎస్ మరణం రాష్ట్ర రాజకీయాలకు తీరనిలోటు అని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో హార్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు (సిపిఐ), కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ, వివిధ పార్టీల నాయకులు డాక్టర్ కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్ (బిజెపి), వి.హనుమంతరావు, కెవిపి.రామచంద్రరావు (కాంగ్రెస్), ప్రముఖులు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ డి.శ్రీనివాస్ యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడి స్థాయి నుండి పిసిసి అధ్యక్షుడి స్థాయి వరకు అంచలంచలుగా ఎదిగారని, బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడిగా సక్సెస్ అయ్యారని కొనియాడారు. ఆనాటి సిఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, పిసిసి అధ్యక్షులు డి.శ్రీనివాస్ జోడీగా ఉండి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు దేశంలో యుపిఎ ప్రభుత్వం ఏర్పాటులో కీలకంగా ఉన్నారని సాంబశివరావు గుర్తు చేశారు. పాతకాలం విలువలు కాపాడిన వారిలో డిఎస్ ఒకరని అన్నారు. ఈ సందర్భంగా డి.శ్రీనివాస్ కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలిపారు.

## విశ్వవిద్యాలయాలకు పూర్తి స్థాయి విసిలను నియమించాలి

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విశ్వవిద్యాలయాలకు పూర్తి స్థాయి వైస్‌ఛాన్సలర్లను నియమాకం జరపాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలు ఇన్‌చార్జ్ విసిల పాలనలో కొనసాగుతన్నందున విద్యాప్రమాణాలు పడిపోతున్నాయని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. గత మే నెలలో రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారులకు రాష్ట్రంలోని వర్సిటీలకు అదనపు బాధ్యతలు ఇస్తూ ఇన్‌చార్జ్ విసిలుగా నియమించిందన్నారు. దాదాపు రెండు నెలల కిందటే వర్సిటీ విసి పోస్టుల కోసం దరఖాస్తులు స్వీకరించారని, కేవలం 15 రోజులు మాత్రమే ఇన్‌చార్జ్ విసిలు ఉంటారని, ఈలోపు సెర్చ్ కమిటీల సమావేశాలు ఏర్పాటు చేసి పూర్తి స్థాయి విసిలను నియమిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ అనేక వర్సిటీలలో సెర్చ్ కమిటీ సమావేశాలు జరగకున్నా ఎందుకు ప్రభుత్వం సెర్చ్ కమిటీ సమావేశాలు నిర్వహించేలా, విసిల నియామకాలు జరిగేలా చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇన్‌చార్జ్ విసిలుగా ఉన్న ఐఏఎస్ అధికారులకు ఇతర శాఖల బాధ్యతలు ఉన్న నేపథ్యంలో వారు వర్సిటీలకు సమయం కేటాయించడం లేదన్నారు. ఇన్‌చార్జ్ విసిలు విద్యార్థులను కలవడం లేదని, వారికి సమస్యలు చెప్పుకునే పరిస్థితులు లేవని, వర్సిటీలో వారు నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో వర్సిటీలకు పూర్తిస్థాయి విసిలను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

# నిర్మాణరంగ కార్మిక సమస్యలపై ‘చలో హైదరాబాద్’

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దీర్ఘకాలికంగాపెండింగ్ లో ఉన్న నిర్మాణరంగా కార్మికులు ఎదుర్కుంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ‘చలో హైదరాబాద్’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ తెలిపారు.




తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా 3 వ మహాసభల ముగింపు సందర్భంగా హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ లో ఆదివారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగిన యూనియన్ హైదరాబాద్ జిల్లా మహాసభలు విజయవంతంగా ముగిశాయని, ఈ మహాసభలు నూతన కమిటీని ఎన్నుకుందని, అధ్యక్షునిగా చెట్టుకింది శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షునిగా మొహమ్మద్ అహ్మద్, ఉపాధ్యక్షులుగా కె. కాశయ్య, కె. గణేష్, ఎస్కె. మఖ్బూల్, హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా కమతం యాదగిరి, సహాయ కార్యదర్శులుగా నాగరాజు, ఎన్. నరసింహ, ఎండి. షరీఫ్, కోశాధికారిగా జి. శ్రీనివాస్ తోపాటు 35 మందిని సమితి సభ్యులుగా ఏకగ్రీవంగా మహాసభ ఎన్నికుందని మారగోని ప్రవీణ్ కుమార్ ప్రకటించారు. భావన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను గత ప్రభుత్వం కాజేసిందని, ఆ నిధులను రాబట్టి తిరిగి బోర్డు లో జమ చేసి కార్మికుల సంక్షేమానికి వినియోగించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. నిర్మాణ కార్మికులకు కొత్త గుర్తింపు కార్డులను జారీ చేయాలనీ అలాగే కార్మికుల అడ్డాల వద్ద అన్ని వసతులతో కూడిన షెల్టర్ లను నిర్మించాలని, 60 సంవత్సరాలు దాటినా ప్రతి కార్మికునికి పెన్షన్ సౌకర్యం కల్పించి, ప్రమాదంలో మరణించిన వారికి రూ. 10 లక్షలు, సహజ మరణానికి రూ. 5 లక్షలు, వివాహ కనుక 1 లక్ష కు పెంచి, పిల్లల చదువులకు స్కాలర్ షిప్ లను అందించాలని మారగోని ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.

## మళ్ళీ ఎన్నికలు పెట్టమనడం కేంద్ర మంత్రి సంజయ్ అవివేకం

### టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** దమ్ము ఉంటే మళ్ళీ ఎన్నికలు పెట్టండి మొత్తం మేమే గెలుస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ అనడం ఆయన అవివేకమని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు, నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి అన్నారు. ఎన్నికలు ఎప్పుడు పడితే అప్పుడు పెట్టాబోరని, ఇప్పటికే ఒక సారి అసెంబ్లీ, మరోసారి పార్లమెంట్ ఎన్నికలు మొత్తం రెండు సార్లు ఎన్నికలు జరిగాయని, ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దమ్ము ఏమిటో చూపించామని మల్లు రవి అన్నారు. రాజ్యాంగం ప్రకారం ఎన్నికలు జరుగుతాయని, ఎన్నికలు జరిగినపుడు దమ్ము చూపించాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలలో బిజెపి దమ్ము ఏమిటో ప్రజలు చూసారన్నారు. తెలంగాణాలో మొత్తం 119 సీట్లలో 8 సీట్లు బిజెపికి వచ్చాయని, బిజెపికి ఎంత దమ్ము ఉందో అప్పుడే అర్థమైందని, ఇంకా బిజెపి నాయకులు దమ్ము గురించి మాట్లాడడం అర్థరహితమన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ రెండు పార్టీలు చీకటి ఒప్పందం చేసుకున్నా కూడా 8 సీట్లు గెలవలేక పోయారని ఆయన అన్నారు. బిజెపి నాయకులకు అంత దమ్ము ఉంటే కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, నిధుల గురించి కోట్లాడి తెచ్చి రాష్ట్రానికి మేలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# గత ప్రభుత్వ హయాంలో విద్యారంగం పూర్తి నిర్వీర్యం

### దేశంలోనే తెలంగాణది 35వ స్థానం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ 10 ఏళ్లలో విద్యరంగం పూర్తిగా నిర్వీర్యం చేయడంతో దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తెలంగాణ 35వ స్థానానికి నెట్టివేయబడిందని పలువురు వ్యక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విద్యను మరింత పటిష్టం చేయనున్నామని ప్రకటించడం హర్షణీయమని, అయితే తెలంగాణ విద్య వ్యవస్థ ఎంత పెద్ద సంక్షోభంలో ఉందో లోతులకు పోతేనే ఇది సాధ్యమవుతుందన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర చైర్మన్ రిషికేష్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యా మిషన్ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎం. వి ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్. వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఒబిసి సెల్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, జెబియం రాష్ట్ర ఇంచార్జీ అశోక్ మరిదాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యా సంక్షోభాన్ని సర్కార్ గుర్తించి విద్యాసంస్కరణలు తీసుకురావడం ద్వారా నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ లక్ష్యం కావాలన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా విద్యావ్యవస్థపై పూర్తి సమీక్షలు నిర్వహించడంతో పాటు తగినన్ని నిధులు కేటాయించడంతో పాటు చట్టబద్ధమైన కేంద్ర విద్యా హక్కు చట్టం అమలు చేయాల్సి ఉంటుందని సూచించారు.

## ‘శభాష్ మహేష్ భగవత్’ సిఐపిఎఫ్ ఫలితాల్లో హవా..

### 312 మంది అభ్యర్థుల్లో 60 మందికి ర్యాంకులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీసు డ్యూటీ అంటేఏ కత్తిమీద సాము..నిద్రాహారాలు కూడా ఒక్కోసారి ఉండవు..అలాంటి డ్యూటీలో రానిస్తునే సమాజ సేవ చేస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు ఐపిఎస్ అధికారి, రాష్ట్ర రైల్వేస్ అండ్ రోడ్ సేఫ్టీ అదనపు డిజిపి మహేష్ భగవత్. తన విధులు నిర్వహిస్తునే నిరుద్యోగులకు కానిస్టేబుల్, ఎస్ఐ, గ్రూప్1, సివిల్స్‌తో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగాల అర్హత పరీక్షలకు తనదైన శైలీలో ఉచిత శిక్షణ ఇస్తుంటారు. ఇలా ఇతను ఇచ్చిన శిక్షణ ద్వారా వేలా ది మంది అభ్యర్థులు రాష్ట్ర, కేంద్ర పోలీసు శాఖలో చేరారు. ఇదే తరహాలో ఇతను ఇచ్చిన శిక్షణ ద్వారా తాజాగా యూపిఎస్‌సి విడుదల చేసిన సెంట్రల్ ఆర్మ్డ్ పోలీసు ప్రొటెక్షన్ (సిఎపిఎఫ్) అసిస్టెంట్ కమాండెంట్ ఫలితాల్లో 60 మందికి పైగా అభ్యర్థులకు ర్యాంకులు వచ్చాయి. వీరిలో సిఐఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్, ఐటిబిపి, ఎస్ఎస్‌బి లోని అసిస్టెంట్ కమాండెంట ఉద్యోగాల కోసం ఎంపికైన 312 మందిలో మహేశ్‌భగవత్ అతని బృందం మెంటార్‌షిప్ అందించిన 60 మందికిపైగ ఆఅభ్యర్థులు ఎంపికయ్యారు. వీరిలో తెలంగాణకు చెందిన పడమటి అన్వేష్ రెడ్డి (27వ ర్యాంక్), ఐండ్ల ప్రద్యుమ్నారెడ్డి (177) ర్యాంక్)తో పాటు మరి కొందరు ఉన్నారు.




సిఎపిఎఫ్ 312 మంది అసిస్టెంట్ కమండెట్ పోస్టులకు పరీక్షలు నిర్వహించగా 20 శాతానికి పైగా మహేష్ భగవత్ శిక్షణ ఇచ్చిన అభ్యర్థులు ఎంపిక కావడం గమనార్హం. అదనపు డిజి మహేష్ భగవత్‌తో పాటు అభ్యర్థులకు మెంటార్‌షిప్ ఇచ్చిన వారిలో మహారాష్ట్ర ఉన్నత విద్యా డైరెక్టర్ డాక్టర్ శైలేంద్ర దేవలంకర్, సిఆర్‌పిఎఫ్ డిఐజి ఎంఎ రిజ్వాన్, ఎస్ఎస్‌బి డిఐజి డీన్ భోంబే, సిఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ ప్రతాప్ పుండే, సిఐఎస్ఎఫ్ డిసి రాకేష్, ఐఆర్ఎస్ డిసి కస్టమ్స్ నితేశ్ పథోడ్ తదితరులు ఉన్నారు. వీరు సాధించిన విజయాన్ని తెలుసుకున్న దేశంలోని వివిధ రాష్ట్రా లో విధులు నిర్వహిస్తున్న ఐపిఎస్ ఉన్నతాధికారులు మహేష్ భగవత్ బృందానికి ప్రశంసలు తెలియజేశారు.

## ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మంత్రి తుమ్మల భేటీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయును వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాద్ లోని చంద్రబాబు నివాసంలో మర్యాద పూర్వక భేటీ అయిన మంత్రి తుమ్మల ఇరు రాష్ట్రాలకు మేలు జరిగేలా జాతీయ రహదారులు జలవనరులు రైల్వే లైన్ లపై చర్చించారు. పట్టిసీమ నుంచి ప్రకాశం బ్యారేజ్ కు అక్కడ నుంచి పులిచింతల నాగార్జున సాగర్ కు గోదావరి జలాలు తరలింపు భవిష్యత్ లో కీలకమని, పట్టిసీమ టూ పులిచింతల లింక్ తో శ్రీశైలం నీళ్ళు రాయలసీమ సాగు నీటి కష్టాలు తీరడంతో పాటు .తెలంగాణ కు మేలు జరుగుతుందన్నారు. అదేవిధంగా సత్తుపల్లి టూ కోవూరు రైల్వే లైన్, పెనుబల్లి టూ కొండపల్లి రైల్వే లైన్ పనులు పూర్తయితే ఇరు రాష్ట్రాలకు ఎంతో ప్రయోజనకరమని తుమ్మల సూచించారు. రైల్వే లైన్ తో బొగ్గు రవాణా, పుణ్య క్షేత్రాలు సందర్శించే భక్తులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. .కొత్తగూడెం టూ పెనుబల్లి రైల్వే లైన్ పూర్తయిందని ఎపి లో రైల్వే పై దృష్టి పెట్టాలని తుమ్మల ఎంపి సిఎం చంద్రబాబును కోరారు. జల వివాదాలు లేకుండా రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి పథంలో సాగేందుకు చంద్రబాబు అనుభవం ఎంతో దోహదం చేస్తుందన్నారు., ఇరు రాష్ట్రాలు భద్రాచలం ఐదు గ్రామాల విలీనం ఆవశ్యకత పై చంద్రబాబు కు వివరించిన మంత్రి తుమ్మల అన్నదమ్ముళ్లా విడిపోయినా అభివృద్ధిలో కలసి సాగాలనుకుంటున్నమన్నారు. చంద్రబాబు నాయుడుతో ఎంతో ఆప్యాయత భేటీ సాగిందని, తెలుగు రాష్ట్రాలు తల ఎత్తుకుని ఉండేలా అభివృద్ధి చెందాలని చంద్రబాబు తో ఆశాభావం వ్యక్తం చేసినట్లు మంత్రి తుమ్మల. చెప్పారు.


# సాహితీ విహారి

## పాలస్తీనా గుండె చప్పుడు కనఫాని



నేడు కనఫానీ వర్ధంతి

పాలస్తీనియన్ల కష్టాలు.. కన్నీళ్లు.. వేదనలు.. రోదనలు ఈనాటివి కావు. దశాబ్దాలుగా వారిపై అమానుష దాడులు కొనసాగుతునే ఉన్నాయి. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా వేలాది మంది సామ్రాజ్యవాదుల దాహానికి బలవుతునే ఉన్నారు. అక్కడ మహిళలపై అత్యాచారాలు... హత్యలు నిత్యకృత్యాలు. ఆరేడు దశాబ్దాల క్రితమే ఘసన్ ఫయీజ్ కనఫానీ ఈ దృశ్యాలను తన రచనల ద్వారా మన కళ్ల ముందు ఆవిష్కరించాడు. 1936, ఏప్రిల్ 8న జన్మించిన అతను 1972 జులై 8న భౌతికంగా దూరమయ్యాడు. కాదు... సామ్రాజ్యవాద మూకలు అతనిని హత్య చేసి, పైశాచిక ఆనందాన్ని పొందాయి. చివరి శ్వాస వరకూ పాలస్తీనా స్వేచ్ఛను, అభివృద్ధిని ఆకాంక్షించిన కనఫాని నిజమైన కమ్యూనిస్టు. కార్ల్ మార్క్స్ రచనలతో ప్రభావితమయ్యాడు. అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో ప్రజల తరఫున నిలబడ్డాడు. అరబ్ ప్రపంచంలోని ప్రముఖ పాలస్తీనా రచయితల్లో ఒకడిగా ఎదిగిన అతని రచనలు 17 భాషల్లోకి అనువాదమయ్యాయంటే, అవి ఎంతగా పాఠకులను కదిలించాయో ఊహించుకోవచ్చు. కేవలం 36 సంవత్సరాల జీవితంలో కనఫానీ అతి కొద్ది మంది మాత్రమే అందుకోగల ఉన్నత శిఖరాలను అధిరోహించాడు. రచయితగా, రాజకీయవేత్తగా ఎదిగాడు. బీరూట్ (లెబనాన్)లో అతనిని హత్య చేయడం సామ్రాజ్యవాదుల అహంకారానికి నిదర్శనం. కనఫానీ ఎదిగిన తీరుకు తార్కాణం. 1948 పాలస్తీనా యుద్ధంలో ఇజ్రాయెల్, దాని అనుకూల శక్తులు గ్రామాలమీద పడి దోచుకున్నాయి. లక్షలాది మందిని స్థానభ్రంశం చేశాయి. ఆ విధంగా కనఫాని కుటుంబం కూడా తమ గ్రామమైన ఏకర్ నుంచి వలస వెళ్లింది. కేవలం 12 ఏళ్ల వయసులోనే శరణార్థిగా మారడం, ఆయుధాలను వలసదారులకు అప్పగించి బలవంతంగా మరో ప్రాంతానికి తరలాల్సిన పరిస్థితులు నెలకొనడం అతని మనసును తీవ్రంగా గాయపరిచాయి. అవమానంతో కుంగిపోయాడు. ఆ కసి, ఆవేదన, తిరుగుబాటుతత్వం అతని రచనల్లో స్పష్టంగా కనిపిస్తుంది. అతని కుటుంబం ఏకర్ నుంచి బయటపడి, సిరియాలోని డమాస్కస్‌లో స్థిరపడింది. అక్కడే కనఫానీ ప్రాథమిక విద్య పూర్తి చేశాడు. కొంతకాలం శరణార్థి శిబిరంలో పాలస్తీనా పిల్లలకు పాఠాలు చెప్పాడు. పాలస్తీనా పరిస్థితులను వివరించడానికి చిన్న చిన్న కథలు రాయడం ప్రారంభించాడు. అర్ధాంతరంగా నిలిపివేసిన చదువును పూర్తి చేయాలని డమాస్కస్ యూనివర్శిటీలో చేరాడు. అక్కడ అరబిక్ లిటరేచర్‌లో డిగ్రీ కోర్సు తీసుకున్నాడు. కానీ, అరబ్ నేషలిస్టులతో రాజకీయ సంబంధాలు ఉన్నాయంటూ యూనివర్శిటీ అధికారులు అతనిని బహిష్కరించారు. తర్వాతి కాలంలో కనఫాని కువైట్, బీరుట్ తదితర ప్రాంతాలకు మకాం మార్చాడు. ఆ సమయంలోనే మార్క్సిజాన్ని ఒంటబట్టించుకున్నాడు. అణగారిన వర్గాలకు అండగా, అణచివేతకు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు తప్ప మరో మార్గం లేదని నిర్ధారించుకున్నాడు. ఒకవైపు రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూనే, మరోవైపు రాజకీయాల్లోనూ చురుగ్గా పాల్గొన్నాడు.





1961లో డానిష్ విద్యావేత్త, బాలల హక్కుల కార్యకర్త అన్నీ హోవర్న్‌ను వివాహం చేసుకున్న అతను వివిధ అరబ్ వార్తాపత్రికలు, మ్యాగజైన్లకు వ్యాసాలు, కథలు రాశాడు. 'మెన్ ఇన్ ది సన్' 1963లో ముద్రితమై, విశేష ప్రజాధరణ పొందింది. 'ఎ వరల్డ్ దట్ ఈజ్ నాట్ అవర్స్' నవలతో కనఫాని పేరు సాహితీ రంగంలో మారుమోగింది. పాలస్తీనియన్ల వెతలను అందులో అద్భుతంగా వర్ణించాడు. 1967లో ఆరు రోజుల యుద్ధం ముగిసిన తర్వాత, క్రియాశీల పోరాటాలకు సిద్ధమయ్యాడు. పాపులర్ ఫ్రంట్ ఫర్ ది లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా (పిఎఫ్ఎల్‌పి)లో చేరి, వివిధ కార్యక్రమాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించాడు. తీవ్రమైన అణచివేతకు గురవుతున్న పాలస్తీనా ప్రజలు ప్రతిఘటన బాట పట్టడానికి కనఫాని మార్గదర్శకుడయ్యాడు. అతని ఎదుగుదల సహజంగానే సామ్రాజ్యవాదులకు, మతవాదులకు గిట్టలేదు. 1972 జులై 8న బీరూట్‌లో తన మేనకోడలు లామీస్ను మోసాద్‌తో కలిసి కారులో వెళుతున్నప్పుడు, అంతకు ముందే అందులో అమర్చిన బాంబు పేలడంతో మృతి చెందాడు. ఇజ్రాయెల్ అతని హత్యకు కుట్ర చేసిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. వాస్తవాలు ఎలావున్నా, ఒక ప్రజాకవి, ఉద్యమ నేత అకాల మరణం పొందాడు. యావత్ పాలస్తీనా కన్నీరు కార్చింది. నేడు కనఫాని లేకపోవచ్చు.. కానీ, అతని రచనలు ఇప్పటికే పాలస్తీనియన్లకు మార్గదర్శకం చేస్తునే ఉన్నాయి. అతని ఉద్యమ స్ఫూర్తి పాలస్తీనియన్ల పోరాటాలకు నిరంతరం ఇంధనంగా మారుతునే ఉంది. పోరుబాటలో ప్రజలను నడిపిస్తునే ఉంది. ప్రతిఘటనలకు నిరసించే ధైర్యాన్ని అందిస్తునే ఉంది.

**సత్యశ్రీ**

## మనసులు తెలిసిన రారాజు రావూరి



రావూరి భరద్వాజ... విలక్షణ సాహితీ చక్రవర్తి మాత్రమేకాదు.. అసాధారణ మానసిక విశ్లేషకుడు కూడా. అందుకే, తన జీవిత అనుభవాలతో సామాన్యుల మనసులోతులు తెలుసుకున్నాడు... రచనలతో గెల్చుకున్నాడు. 'పాకుడు రాళ్లు' నవలకు భారత అత్యున్నత సాహితీ పురస్కారం 'జ్ఞానపీఠ్'ను అందుకొని, విశ్వనాథ సత్యనారాయణ (రామయణ కల్పవృక్షం), డాక్టర్ సి. నారాయణ రెడ్డి (విశ్వంభర) సరసన చోటు సంపాదించుకున్నాడు. ఈనెల 5వ తేదీన, రావూరి 97వ జయంతిని నిర్వహించుకొని, ఆయనను తలచుకొని, నివాళులర్పించిన వారు ఎందరో... ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా, మొగులూరు గ్రామంలో 1927లో ఆయన జన్మించాడు. ఆయనది నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులతు మొదటి సంతానం కావడంతో కుటుంబ భారం మోయక తప్పలేదు. విద్యాభ్యాసం కేవలం 8వ తరగతికే పరిమితంకాగా, 15 ఏళ్ల వయసు నుంచే దొరికిన పని చేస్తూ, ఎంతోకొంత సంపాదించడం అనివార్యమైంది. వ్యవసాయ కూలీగా మారాడు.. కార్మికుడిగా అవతారం ఎత్తాడు.. అనాథ శరణాలయాల్లో పని చేశాడు... పాఠశాలలో చదువుకున్నది తక్కువేగానీ, రకరకాల పనులు చేస్తూ, జీవితం నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకున్నాడు. రకరకాల మనుషులను చూశాడు. వారి మనస్తత్వాన్ని నిశితంగా గమనించాడు. విశ్లేషించాడు. ఎవరు, ఎప్పుడు, ఎందుకు, ఏం మాట్లాడుతున్నారో క్షణాల్లో అర్థమయ్యేది. వారి ప్రవర్తను ముందుగానే పసిగట్టేవాడు. ఈ లక్షణమే ఆయనను విలక్షణ రచయితగా మార్చింది. ఎన్నో ఒడిదుడులు ఎదుర్కొని, తనను తాను తీర్చిదిద్దుకొని, రయితగా ఎదగడం రావూరి వంటి అతి కొద్ది మందికే సాధ్యమవుతుంది. స్వయం కృషికి ఆయన ఓ చిరునామా. అప్పట్లో నెల్లూరు నుంచి 'జమీన్ రైతు' పత్రిక వెలువడేది. 1946లో రావూరి ఆ పత్రిక సంపాదకీ విభాగంలో చేరాడు. ఆ సమయంలోనే ఆయన రచయితగా మారాడు. చలం రచనలంటే ఎంతో ఇష్టపడేవాడు. అత్యంత కఠినమైన రోజుల్లో, డబ్బు కోసం బూతు రచనలు కూడా చేశానని రావూరి ఎన్నో సందర్భాల్లో చెప్పుకొన్నారు. ఆయన నిజాయితీకి అదే నిదర్శనం. చాలా మంది ఆయనను బూతు రచయితగానే చూశారు. ఆకలి మంటల ముందు తాత్కాలికంగా తలవంచినప్పటికీ, ఆయన ఆశయం సజీవంగా నిలిచింది. సగర్వంగా తలెత్తుకుంది. తాను గడించిన అనుభవాలను, సామాన్యుల ప్రతినిధిగా వాస్తవాలను తన రచనల ద్వారా బహిర్గతం చేయాలనే ఆశయాన్ని మరచిపోలేదు. భార్య కాంతం, ఐదుగురు పిల్లలు రవీంద్రనాథ్, గోపీచంద్, బాలాజీ, కోటేశ్వరరావు, పద్మావతి.. చక్కటి కుటుంబం ఆయనది. నెల్లూరు నుంచి మకాం తెనాలికి మార్చినప్పుడు జ్యోతి, రేరాణి, అభిసారిక, చిత్రసీమ, యువ వంటి పత్రికల్లో పని చేశాడు. ఆ తర్వాత ఆకాశవాణిలో ఉసహాయ రచయితగా చేరాడు. వ్యాఖ్యాతగా, ప్రాయోజిత కార్యక్రమాల నిర్మతగా ఎదిగారు. ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా పదవీవిరమణ చేశారు. పుస్తకంగా ముద్రించిన తొలి రచన 'రాగిణి'కి చలం తొలిపలుకులు రాయడం విశేషం. మొత్తం మీద రావూరి సుమారుగా 170 రచనలు చేశారు. వీటిలవో కథలు, నవలలు, కథానికలు, నాటకాలు, పద్యాలు, ఆత్మకథలు వంటి అనేకా సాహితీ ప్రక్రియలు ఉన్నాయి. 'పాకుడురాళ్లు' ఆయనకు దేశ అత్యున్నత సాహితీ పురస్కారాన్ని అందిస్తే, 'జీవన సమరం', 'కాదంబరి' గొప్ప పేరును సంపాదించిపెట్టాయి. వెలుగులు చిమ్మే సినీ లోకంలో చీకటి కోణాలను చూపిన 'పాకుడు రాళ్లు' ఆయనలోని మానవతావాదిని మనకు పరిచయం చేస్తుంది. సినీ సాలెగూడులో చిక్కుకొని, అల్లాడిపోయే ఎంతో మంది కష్టాలకు, కన్నీళ్లకు, వేదనకు ఆయన అక్షర రూపాన్నిచ్చాడు. రచనలతో అటు కష్టజీవులను, ఇటు పాఠకులను ఏకకాలంలో ఆకట్టుకున్న రావూరి 2023 అక్టోబర్ 18న భౌతికంగా మన నుంచి దూరమయ్యాడు. కానీ, ఆయన రచనలు ఇప్పటికీ మనల్ని పలకరిస్తునే ఉంటాయి. పాత్రల జీవితాల్లో లోతుల్ని కనుక్కోవాలంటూ ప్రహేళికలు విసురుతునే ఉంటాయి. అందుకే రావూరి అనన్య సామాన్యుడు, అజరామరుడు.



## విశిష్టభావాల విప్లవకవి పిబి షెల్లీ

ఆంగ్లభాషలో విశిష్టభావాల విప్లవకవి పి.బి. షెల్లీ అని పిలవబడే పెర్సీ బైసీ షెల్లీ. చివరి వరకూ మానవ సిద్ధాంతాలతోనే ఉత్తమకవిగా జీవించిన వాడు. మహారచయిత ఆంద్రే మోరో ఫ్రెంచి భాషలో అతని జీవిత కథను గ్రంథస్తం చేసి సాహిత్యలోకానికి మెపకారం చేశాడు. ఆ గ్రంథాన్ని ఆంగ్లంలో ఎలా డీ ఆర్సీ అనే వ్యక్తి అనువదించాడు. ఆ గ్రంథం అనేక ప్రచురణలను పొందింది. పెంగ్విన్ బుక్స్ వారు ఈ గ్రంథాన్నే ప్రప్రథమంగా లండన్‌లో ప్రచురించారు. దీనికి ''ఏరియల్ ది షెల్లీ రొమాన్స్'' అని పేరుపెట్టారు. షీల్లీ జీవితం పేరుతో ఆవంత్స సోమసుందర్ తెలుగులో దాన్ని అనువదించారు. షేక్స్పియర్ రచించిన కింగ్ లియర్ నాటకంలో ఈ ''ఏరియల్'' అనే పాత్ర అద్భుత కత్యాలను చేస్తుంది. షెల్లీ చెప్పాలంటే ఒక ఆంగ్ల శృంగార కవి. అతని కవిత్వంలోను, అతని రాజకీయ మరియు సామాజిక దక్పథాలలోను, తీవ్రవాదిగా పరిగణింపబడ్డవాడు. షెల్లీ తన జీవిత కాలంలో కీర్తిని పొందలేకపోయినప్పటికీ, అతని మరణం తరువాత కవిత్వంలో అతని గుర్తింపు క్రమ క్రమంగా పెరిగింది. అమెరికన్ సాహిత్య విమర్శకుడు హెరాల్డ్ బ్లూమ్ '' షెల్లీ ప్రత్యర్థి లేని గేయకవి, కవిత్వంలో అత్యంత అధునాతనమైన మేధావులలో ఒకడు'' అని అభివర్ణించాడు.

షెల్లీ 1792 ఆగస్టు 4న ఇంగ్లాండ్‌లోని సస్సెక్స్‌లోని వార్న్‌హామ్‌లోని ఫీల్డ్ ప్లేస్‌లో జన్మించాడు . అతను సర్ తిమోతీ షెల్లీకి పెద్ద కొడుకు. అతనికి నలుగురు చెల్లెళ్లు, ఒక తమ్ముడు ఉన్నారు. షెల్లీ యొక్క బాల్యం హాస్టల్ జీవితంతో సంతోషంగా ఉండేది. ముఖ్యంగా తన సోదరీమణులు మరియు అతని తల్లితో సన్నిహితంగా ఉండేవాడు. అతను వేటాడటం, చేపలు మరియు రైడ్ చేయడానికి ఇష్టపడేవాడు. ఆరేళ్ల వయస్సులో, అతను వార్న్‌హామ్ చర్చి యొక్క వికార్ నిర్వహించే ఒక డే స్కూల్‌కి పంపబడి, అక్కడ అతను అందరినీ ఆకట్టుకునే జ్ఞాపకశక్తిని ప్రదర్శించాడు. 1804లో, షెల్లీ ఎటన్ కాలేజీలో ప్రవేశించాడు. అక్కడ తీవ్రమైన బెదిరింపులకు గురయ్యాడు. నేరస్థులు ''షెల్లీబైట్స్'' అని పిలిచేవా రు. షెల్లీ హింసాత్మక ఆవేశాలు ''మ్యాడ్ షెల్లీ'' అనే పేరును కూడా తెచ్చిపెట్టాయి. అక్కడ క్షుద్ర శాస్త్రం మరియు విజ్ఞాన శాస్త్రంలో తన ఆసక్తిని కొనసాగించాడు. ప్లేటో మరియు ఆదర్శవాద తత్వశాస్త్రంపై కూడా ఆసక్తిని పెంచుకున్నాడు. తరువాత స్వీయఅధ్యయనం ద్వారా అనుసరించాడు. షెల్లీ నిష్క్రమించే సంవత్సరం నాటికి, ఒక శాస్త్రీయ పండితుడిగా, అసాధారణ వ్యక్తిగా ఖ్యాతిని పొందాడు. ఎటన్ కాలేజీలో అతని చివరి సంవత్సరంలో అతని మొదటి నవల జాస్ట్రోజీ రాసి, తన తోటి విద్యార్థులలో కొందమందిని శిష్యగణంగా ఏర్పరచుకున్నాడు. అక్టోబరు 1810లో యూనివర్శిటీ కాలేజ్, ఆక్స్‌ఫర్డ్‌లో చేరడానికి ముందు షెల్లీ విక్టర్ మరియు కాజీర్ అనే గ్రంథం అతని సోదరి ఎలిజబెత్‌తో కలిసి చేసిన రచన, ది వాండరింగ్ జ్యూ గోతిక్ నవల, సెయింట్ ఇర్విన్ ఒరిజినల్ పొయెట్రీని పూర్తి చేశాడు.



జూలై 8 పిబి షెల్లీ జయంతి

1810–1811 శీతాకాలంలో, షెల్లీ అనామక రాజకీయ పద్యాల కరపత్రాల శ్రేణిని ప్రచురించాడు. అతను కరపత్రాన్ని రచించాడా లేదా అనే దానిపై కళాశాల అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానమివ్వడానికి అతను నిరాకరించడంతో స్నేహితుడు హాగ్‌తో పాటు 25 మార్చి 1811న ఆక్స్‌ఫర్డ్ నుండి బహిష్కరించబడ్డాడు. తన కుమారుని బహిష్కరణ గురించి విన్న షెల్లీ తండ్రి, అతను ఇంటికి తిరిగి వచ్చి, ట్యూటర్‌ల క్రింద చదువుకోవడానికి అంగీకరించకపోతే షెల్లీతో ఉన్న అన్ని సంబంధాలను తెంచుకుంటానని బెదిరించాడు. అయితే షెల్లీ అందుకు నిరాకరించడంతో అతని తండ్రితో విభేదాలు వచ్చాయి.

అతని జీవితమంతా అస్తవ్యస్తంగా గడచినప్పటికీ, ఇంగ్లీష్ రొమాంటిక్ కవులందరిలో షెల్లీ అత్యుత్తమ గీత రచయిత. ''ఓడ్ టు ది వెస్ట్ విండ్'' షెల్లీ యొక్క కవితా ప్రతిభను అత్యుత్తమంగా వెల్లడిస్తుంది. అతను భౌతికంగా మాత్రమే కాకుండా రాజకీయ వాతావరణంలో మార్పును తీసుకొని రావడానికి చేసిన ప్రయత్నంలో ప్రతీకవాదాన్ని ఉపయోగిస్తాడు. బాహ్య ప్రపంచంలోని అందాల పట్ల అతని కవితలలో సారాంశం ముఖ్యమైనది.

అతని రచనలలో ఓజిమాండియాస్ (1818), ఓడ్ టు ది వెస్ట్ విండ్ (1819), టు ఎ స్కైలార్క్ (1820), అడోనైస్ (1821), ది నెసెసిటీ ఆఫ్ పెసిమిజం (1811) ముఖ్యమైనవి. అతని ఇతర రచనలలో పద్య నాటకాలు ది సెన్సీ (1819), ప్రోమేథియస్ అన్‌బౌండ్ (1820), హెల్లాస్ (1822), ది స్పిరిట్ ఆఫ్ సాలిట్యూడ్ (1815), జూలియన్ మరియు మద్దాలో (1819), అడోనైస్ ( 1821), ది ట్రయంఫ్ ఆఫ్ లైఫ్ (1822 అత్యంత ప్రధానమైనవి. షెల్లీకి నౌకాయానం అంటే మక్కువ. ఆయన ప్రత్యేకంగా చేయించుకొన్న బోటుకు ఏరియల్ అనే పేరే పెట్టుకున్నాడు. ఆ నౌకలోనే షెల్లీకి 1822లో దుర్మరణం కలిగింది. ఇటలీ తీరంలో అతని మిత్రులు శవాన్ని వెదికించి అంత్యక్రియలు జరిపించాల్సి రావడం విషాద సంఘటన.

**డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య**
9490400858

## పదజాలమే కీలకం

మనకు ఎన్ని పదాలు తెలుసు అనేది, సదరు భాషపై మనకు ఉన్న పట్టుకు గీటురాయి. పదజాలాన్ని విస్తరింపజేయడం వల్ల మన తెలివితేటలు పెరుగుతాయా అనేది పునరావృత చర్చనీయాంశం. మొదటి చూపులో, సమాధానం అవును అని అనిపిస్తుంది: 'కొత్త పదాలను నేర్చుకోవడం ద్వారా, మేము కొత్త భావనలను కూడా సమీకరించుకుంటాము, తద్వారా మన ఆలోచనా విధానాన్ని మెరుగుపరుస్తాము' అని చాలామంది అంటారు. అయినప్పటికీ, ఇది విలోమ ప్రశ్నను కూడా లేవనెత్తుతుంది. పరిమిత పదజాలం మ న ఆలోచనా సామర్థ్యాన్ని పరిమితం చేస్తుందా? మీరు మరింత పదజాలం నేర్చుకుంటే మీరు తెలివిగా ఉంటారా? ఆలోచనపై పదజాలం ప్రభావం ఎంత? పని నైపుణ్యానికి మనకు ఉన్న పద సంపదకు సంబంధం ఏమిటి? అని నిలదీసే వారు కూడా లేకపోలేదు. ఒకే పదానికి ఉన్న భూత, భవిష్యత్, వర్తమాన కాలాలను అనుగుణంగా మార్చుకోవడం లేదా విశేషణాలను జోడించడం పద సంపద అనిపించుకుంటుందా అని జార్జ్ ఆర్వెల్ నిలదీస్తాడు. నిజమే. పదాల సంఖ్యను లెక్కించుకొని, మేధావులమైపోయాం అనుకోవడం పొరపాటే. కానీ, విస్తారమైన జ్ఞానాన్ని సంపాదించాలన్నా, ప్రపంచం గురించి, వివిధ దేశాలు... భాషలు.. సంస్కృతులు.. సామాజిక ముఖచిత్రాలు.. జీవన పరిస్థితులు తెలుసుకోవాలన్నా పుస్తకాలపై ఆధారపడక తప్పదు. ఈ రోజుల్లో ఇంటర్నెట్ ప్రపంచం మొత్తాన్ని మన ముందు ఉంచుకున్నదని, గూగుల్ వంటి సర్చ్ ఇంజన్ల ద్వారా సమాచారాన్ని క్షణాల్లో తె లుసుకోవచ్చని వాదించేవారు ఉండవచ్చు. కా నీ, జనాంతికంగా ఇచ్చే సమాచారానికి, ఎవ్వైనా స్వయంగా చూసి లేదా అనుభవించి అందించే వివరాలకు ఎంతో తేడా ఉంటుంది. 'మంచినీరు తాగడం వల్ల ఉపయోగాలు ఏమిటి?' అని గూగుల్ సర్చ్ చేయండి. పుంఖాను పుంఖంగా ఉపయోగాలపై సమాచారం వస్తుంది. 'మంచి నీరు తాగడం వల్ల నష్టాలు ఏమిటి?' అని సర్చ్ చేయండి... అప్పుడు కూడా వందలు, వేల ఫలితాలు వస్తాయి. ఈ రెండూ చదివిన పాఠకుడికి పిచ్చి ఎక్కడం గ్యారంటీ. ప్రతి చిన్న విషయానికీ గూగులమ్మను ఆశ్రయించడం వల్ల నష్టమే తప్ప లాభం ఉండ దు. ఒకవేళ ఉపయోగపడిందని అనుకున్నా, ఆయా సమాచార పత్రాల్లో ఉన్న వివరాలు తెలియాలంటే, భాషాజ్ఞానం ఉండాలి కదా? భాషా జ్ఞానం, విస్తారమైన పదజాలం అ నేవి పరస్పర పూరకాలు. ఎక్కువ పదాలు తెలిసిన వారికి ఎక్కువ చదివే అవకాశం లభిస్తుంది. భావ వ్యక్తీకరణ తీరు మెరుగుపడుతుంది. వివిధ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు, ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా మనకు ఉన్న పదజాలం ఎంతగానో ఉపయోగపడుతుం ది.

నిర్దిష్ట పదాలు లేని భాష మాట్లాడేవారు భిన్నంగా ఆలోచిస్తారు. ఆ ప్రభావాలు తరచుగా అతిశయోక్తిగా ఉంటాయి. 'కంప్యూటర్' అనే పదం ఉనికిలో రాకముందే, అలాంటి పరికరం తయారైంది కదా! కంప్యూటర్ అనే పదం ఆ తర్వాత మెల్లిగా ప్రచారమైంది. అంత వరకూ ఎందుకు, చాలా చిన్న భావోద్వేగాలను వ్యక్తపరిచే పదాలు ఒకటి కంటే అధికంగా ఉండడం సహజం. 'ఆనందం', 'సంతోషం'.... దుఃఖం', 'బాధ'... ఇలా ఎన్నో పర్యాయ పదాలను పేర్కోవచ్చు. ఒకే పదం చాలనుకొని భీష్మించుకుంటే, మిగతా పదాలతో కూడిన వాక్యం ఏదైనా చదివితే అది అర్థం కాదు. అర్థం కానప్పుడు చదవడం ఎందుకు?

## ఈ వారం కవితలు

### 'ఉపా' రద్దు ఉద్యమం

వాళ్లేం తీవ్రవాదులు కాదు
మతోన్మాదులు కానే కాదు
దేశ ద్రోహులు అసలే కాదు

విద్వేషాలు రెచ్చగొట్టే
ప్రసంగాలు చేయలేదు
జాతి సంపద కొల్లగొట్టే
నేరాలకు పాల్పడలేదు

ప్రభుత్వాల్ని కూలగొట్టే
పాపానికి తెగపడలేదు
దేశాన్ని విచ్ఛిన్నపరిచే
కుట్రలనేమి పన్నలేదు

కేవలం ప్రజా గొంతుకై
రోడ్డెక్కి నినదిస్తున్నరు
హక్కుల ఉల్లంఘనను
నికార్డుగా ప్రశ్నిస్తున్నరు

సామాజిక న్యాయంకై
జన జాగృతి చేస్తున్నరు
అంతమాత్రానికే వారిపై

దుష్టరాజ్యం కక్షగట్టింది
జీవితకాలం నిర్బంధించ
ఉపా చట్టం సందిస్తుంది

ఇంకా మౌనం పాటిస్తే
అక్రమ కేసులు సహజమే
నిర్బంధాలు యథాతథమే

అందుకే ఇకనైనా
సంఘటితం అవుదాం
ఉపా చట్టం రద్దయేదాక
ఉద్యమం కొనసాగిద్దాం

భావ ప్రకటనా స్వేచ్ఛకు
ప్రజాస్వామ్య విలువలను
పట్టుబట్టి పరిరక్షించుదాం

(ప్రసిద్ధ రచయిత్రి అరుంధతీ రాయ్ ప్రొఫెసర్ షేక్ హుస్సేన్ పై ఉపా చట్ట ప్రయోగాన్ని ఖండిస్తూ)

**కోడిగూటి తిరుపతి**
9573929493

### ఇలలో...



నవ్వులు లేని
జీవన పయనం
మనిషి మనిషి మాట్లాడుకుని చాలా కాలమైంది

అభిప్రాయాల పంపకం
భిన్నాభిప్రాయాల చర్చా వేదికలు
జీర్ణించుకునే సంఘం లేదిప్పుడు
అబద్దాల వ్యాప్తిలో అనుక్షణం
ఆకళింపు లేదు
ఆలోచన లేదు
సత్యాన్వేషణ కి మెదడు సహకరించదు

గుప్పిట ప్రపంచాన్ని పెట్టి
ఫోన్ యే సర్వస్వమై
పక్కింటి కి కూడా గూగుల్ నే అడిగే తరంలో
మానసిక ఉల్లాసం గాయబ్

జిహ్వా చాపల్యాన్ని చంపేసి
పొట్టను ఎండబెట్టి
కూడబెడితే ఒరిగేదేమీ లేదు


ఎప్పుడు పోతామో తెలీని
రేపటి కోసం పొదుపు మంత్రం
వ్యాపార తంత్రం

కూడు గూడు గుడ్డ ప్రాథమికం
వాటికోసం జీవితం
చింతలు కోరుకునేవే
కొరుక్కుపడవులే నిజాలు

రేపటి పొద్దు పొడుస్తుంది
నీవుంటావో లేదో
ప్రకృతి ధర్మం సజావుగా..
ప్రకృతితో నడువు అంతే

**గిరి ప్రసాద్ చెలమల్లు**
9493388201

### రక్తపు మరకల రాతల చరితలు



మనుషుల మధ్య విద్వేషాలు
మొబైల్ సిగ్నల్స్ లాగా దేశ
సరిహద్దులను దాటి
మానవత్వపు ప్రకాశపు
ఆనవాళ్లను యుద్ధాలలో
సమాధి చేస్తున్నాయి..!

కరోనా మహమ్మారి మాయలో
కొన్ని ప్రాణాలు దీపావళి టపాసుల్లా
రాలిపోయిన జగతి జాగృతం
కావడం మరచి సాంకేతిక విప్లవాలతో
అధిపత్యపు భవనాలను నిర్మిస్తుంది..!

నువ్వెంత?నీదెంత?నాదెంత?
రోబోల యుగంలో కూడా
మన వాటాల సోదంతా..!
ఆరడుగుల ఆరిపోయే దీపం మనమంతా..!

ఇదే సరైన తరుణం
కలాలన్నీ కలిసి
కవనాలై కదిలి
బలమైన గళాలుగా మారి
ప్రేమ మంత్రాన్ని జపించాలి
ప్రపంచశాంతిని స్థాపించాలి
సరిగ్గా గమనించి చూడు
కాల గడియారాన్ని ప్రశ్నించి చూడు
బుద్ధుని బోధనలు మన బ్రతుకు
రాతల్ని మార్చగలవు
గాంధీజీ శాంతి స్వప్నాలు భవిష్యత్తు
కపోతాలై కదలగలవు

రెండు ప్రపంచయుద్ధాలతో ఏం సాధించాం?
రక్తపు మరకల రాతల చరితలు తప్ప..!
ఎన్నో ఉషోదయాల నీడలు
నిశీధిలో నిక్షిప్తమవడం తప్ప..!

పసిపిల్లల పసిడి నవ్వుల వికాసం సాక్షిగా
యుద్ధపు ఆలోచనలన్నీ అంతమవ్వాలి
ప్రపంచం ఓ కుగ్రామమై
విశ్వ శాంతి సౌధం నిర్మించాలి
అలాంటి అరుణోదయం కోసం
కవులంతా కరుణ హృదయంలో తేలి
గగనమంతా ఆకుపచ్చని వనమవ్వాలి

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
9394749536

## అతి ప్రాచీన తెలుగు పదాలు..

సంస్కృతం నుంచి అరువు తెచ్చుకున్న ఎన్నో పదాలు తెలుగులో కలిసిపోయాయి. ఎన్నో కారణాలతో, ఆ పదాలు సభ్యతకు, గొప్ప వ్యక్తిత్వానికి, ప్రతిభకు ప్రతీకలుగా మారాయి. ఈ ఒరవడిలో ప్రాచీన తెలుగు పదాలు మరుగున పడ్డాయి. నిజానికి తెలంగాణ పదాలను అతి ప్రాచీనమైన తెలుగు పదాలుగా పేర్కొంటారు. తెలుగు భాషకు తెలంగాణను పుట్టిల్లుగా చెప్తారు. తెలంగాణ భాష ప్రాచీనతను, గొప్పతనాన్ని వివరిస్తూ ఓగిరాల సుబ్బారావు భారతి పత్రిక (1949) లో ఓ గొప్ప వ్యాసం రాశారు. 'టేడీ, బేడీ జబాన్ తెలంగీ' (వంకరటింకర తెలుగు) అంటూ తెలంగాణ భాష ఎలా పరిహాసానికి గురైందో వివరించారు. 'ఆయా తెలుగు ప్రాం తా ల్లో ఆయా రాజుల ప్రభావాల వలన (రాజభాషా ప్రభావం) అచ్చ తెలుగు భాష తన ప్రాభవాన్ని కోల్పోయింది. కొన్ని చోట్ల ప్రాకృత భాషా ప్రభావం, మరికొన్ని చోట్ల సంస్కృత ప్రభావం, మరికొన్ని చోట్ల తమిళ, కన్నడ, ఉర్దూ భాషల ప్రభావాల వలన తెలుగు భాష తన నిజస్వరూపాన్నే కోల్పోయింది. తెలుగు ఆది కావ్యంగా గుర్తింపబడ్డ నన్నయ మహాభారతం అధికంగా సంస్కృత, ప్రాకృత పదాలతోనే నిండిపోయింది, ఆ తరువాత కూడా ఎంతోమంది ప్రాచీన రచయితల నుండి నవీన రచయితల వరకు తెలుగు పదాల పక్కన పడేసి అన్యభాషలు ప్రభావంతో ఏర్పడిన తెలుగునే వెలుగులోకి తేవడం జరిగింది. పాల్కురికి సోమనాథుని వంటివారు కొంతవరకు అచ్చ తెలుగు పాదాలకు ప్రాధాన్యత నిచ్చినా అవి ప్రామాణిక తెలుగుభాష కాలేకపోయాయి' అం టారు ఆయన. 'ప్రామాణిక భాష, మాండలిక భాష అనే రెండు పొరలను కల్పించారు. ఈ పొరల వల్ల నేడు ప్రాంతీయ భాషలు కృతకభాషలు అనే విమర్శనము బయలుదేరినది.అంతేగాక సుబ్బారావుగారు ఈ వ్యాసంలో పేర్కొన్న ప్రధానాంశం ఇక్కడ గమనించదగ్గది: 'అన్యభాషల ప్రభా వం వలన తెలంగాణ తెలు గు భాష చెడిపోయినట్టిదైనా నేటి వ్యవహారికంలోని (తెలంగాణ వారి వాడుకలోనూ) తెలంగాణ తెలుగు భాష, ప్రాచీనమైన మహాభారతాది గ్రంథాల పదాలతో కొంత ఐక్యత కలిగి దేశీయతను పొంది ఉన్న ది. అపరిమిత ప్రాకృత భూయిష్టమైన నేటి తెలుగునాటి తెలుగు (ప్రామిణికము అని మ నము అనుకుంటున్న నేటి తెలుగుభాష) ముందర అచ్చతెలుగు తెలంగాణ 'ప్రాదెలు గు'(అనగా ప్రాచీనమైన తెలంగాణ తెలు గు)కొత్తగా అగుపడుటలో వింతలేదు' అంటూ సుబ్బారావు తెలంగాణ భాష ను వివరించారు. నేటి వ్యవహారంలో తెలంగాణ పదాలను ప్రాచీన కావ్యాల భాషతో సరిపోలుస్తూ తెలంగాణభాష ఔన్నత్యాన్ని చాటా రు.

| | |
|---|---|
| అర్కతిబర్కతి | : వెలితి, లేమి |
| అలగ్‌సలగ్ | : వేరుగా ఉండడం |
| అలాయ్‌బలాయ్ | : కౌగిలింత |
| అలిమిబలిమి | : బలవంతం |
| ఆపతిసంపతి | : ఆపదసంపద |
| ఇగరాదుఅగరాదు | : ఎంతకీ రాదు |
| ఇయ్యరమయ్యర | : ఇష్టమొచ్చినట్లు |
| ఈకగాదుతోకగాదు | : లెక్కలోకిరాదు |
| ఉత్తుత్తగ | : ఊరికే |
| ఉరికురికి | : జల్దిజల్ది |
| ఉల్టపల్ట | : కిందమీద |
| ఊలేదు ఆలేదు | : ఏమీలేదు |

## ఫుట్‌బాల్ పోటీలకు నలుగురు ఎంపిక



ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం రూరల్ మండలంలోని రామన్నపేటపరిధిలో గల మలెమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం ఎంవీ, పాలెంలో జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన ఫుట్‌బాల్‌లో పోటీలలో మంచి ప్రతిభను కనబరిచినందుకు ఎంపికయ్యినట్టు పిడి బియ్యాని కృష్ణయ్య తెలిపారు. వీరు మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుంట్లలో ఈనెల 12, 13, 14 తేదీల్లో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నారు. ప్రధానోపాధ్యాయిని అలివేలు, 60వ డివిజన్ కార్పొరేటర్ నిరంజన్, 59 డివిజన్ కార్పొరేటర్ లలిత తదితరులు విద్యార్థినిలను అభినందించారు.

## వివాహిత,ముగ్గురు పిల్లల అదృశ్యం

ప్రజాపక్షం/కొత్తపల్లి: రేకుర్తిలోని హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న వివాహితతో పాటు కూతురు, ఇద్దరు కుమారులు అదృశ్యం అయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తెలిపిన కథనం ప్రకారం హనుమాన్ నగర్‌లో నివాసం ఉంటున్న వివాహిత గోదా భాగ్యలక్ష్మి (40), కూతురు ఆదిత్య లక్ష్మి (12), విశ్వక్ సేన్ (8), అశ్వత్ కార్తికేయ (3)లు ఈ నెల 3న రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయారు. భర్త గోదా కృష్ణ బంధువుల ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 5న రాత్రి ఫిర్యాదు చేశారు. వివాహిత ఐదు ఎడుగుల ఎత్తు ఉంటుంది. తెలుపు రంగు, కోల ముఖం కలిగి ఉంటుందని కుటుంభ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు.

## నూతన రేషన్ షాపులు ప్రారంభం



ప్రజాపక్షం/చండూరు: చండూరు మున్సిపాలిటీ లో నూతనంగా మంజూరైన రేషన్ షాపు నెంబర్5,6 లను ఆదివారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ యాదవ్ ప్రారంభించారు. ఈసందర్భంగా వైస్ చైర్మన్ సుజాత వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో రేషన్ లబ్ధిదారులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండ కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా రేషన్ షాపులను మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ప్రజలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రేషన్ డీలర్లు లబ్ధిదారులకు నాన్యమైన సరుకులు లతో నాన్యమైన సేవలు అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్, జిల్లా ట్రస్మా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు, కౌన్సిలర్ మంచుకొండ కీర్తి సంజయ్, కోఆప్షన్ సభ్యులు మహ్మద్ ముజ్జు, సంకోజు దుర్గమ్మ బ్రహ్మం, నల్లగంటి మల్లేశం , పల్లె వెంకన్న, కారింగు రాంమూర్తి, భూతరాజు దశరథ, భీమనపల్లి శేఖర్, భూతరాజు వేణు , పన్నాల లింగయ్య, ఐతరాజు మల్లేశం , పున్న ధర్మేందర్ , కల్లెట్ల మారయ్య, గండూరి జనార్ధన్ , ఇరిగి వెంకటేశం , హైమద్ , కారింగు యాదయ్య, పున్న భిక్షమయ్య, భూతరాజు పాండు, బొమ్మరగాని వెంకటేశం, వెంకటేశం , అంజి, గజ్జెల కృష్ణారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

## చదువు, క్రీడల్లోనూ రాణించాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గంట్ల అనంతరెడ్డి అన్నారు.ఈ నెల 12, 13, 14 తేదీలలో మహబూబ్ నగర్ జిల్లా కల్వకుర్తిలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ టోర్నమెంట్ కు పాల్గొనేందుకు జిల్లా స్థాయి క్రీడాకారులు ఎంపిక స్థానిక మేకల అభినవ్ స్టేడియంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్ఓ మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రమశిక్షణకు అలవాటు పడడానికి క్రీడలు ఎంత దోహదపడతాయని అన్నారు. ప్రతి విద్యార్థి తమకు నచ్చిన క్రీడల్లో మాకువ పెంచుకొని చదువుతోపాటు క్రీడలో కూడా తమ ప్రతిభ కనబరచాలని సూచించారు.కల్వకుర్తిలో జరిగే రాష్ట్ర ఫుట్ బాల్ టోర్నమెంట్లో జిల్లా క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచి నల్లగొండ జిల్లాకు పేరు తీసుకు వచ్చి జాతీయస్థాయికి ఎంపిక కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఓరుగంటి శ్రీనివాస్, ఎస్ కె ఉసేన్, పిఈటి మట్టయ్య, కోచ్ ప్రశాంత్, బొద్దుపల్లి సునీత, కర్నాకర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## మార్కండేయ ఆలయానికి విరాళం



ప్రజాపక్షం/చండూరు: చండూరులోని శ్రీ మార్కొండేయ దేవాలయం లోని ఆరు విగ్రహాల ముఖద్వారాలకు రక్షణగా ఐరన్ గ్రిల్స్ ఏర్పటు కొరకు టిఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఆదివారం దేవాలయ కమిటీ సభ్యులకు టిఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొబ్బల వెంకట్రామిరెడ్డి 1లక్ష20వేలు రూపాయల ఆర్ధిక సహాయం అందజేశారు. శ్రీ మార్కొండేయ దేవాలయానికి ఆర్ధిక సహాయం అందజేసిన బొబ్బల వెంకట్రామిరెడ్డికి దేవాలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉభయ దేవాలయల ట్రస్టు చైర్మన్ కోమటి వీరేశం , పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు గుర్రం బిక్షమయ్య, దేవాలయ కమిటీ అధ్యక్షుడు రావిరాల నగేష్ , పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాసులు , వస్త్ర వ్యాపారుల సంఘం నాయకులు కర్నాటి మార్కొండేయ, ఫౌండేషన్ సభ్యులు పిన్నింటి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీర్ల అయిలయ్యకు మంత్రి పదవివ్వాలి

ప్రజాపక్షం/గుండాల: అధికారం లేకపోయినా ప్రజా క్షేత్రంలో ప్రజాసేవకై సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజాభిమానాన్ని చురగొని ఆలేరు నియోజకవర్గంలో 50వేల ఓట్ల మెజార్టీతో విజయాన్ని సాధించిన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బిసి సామాజిక వర్గ ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఏఐసిసి అధ్యోలు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, భావి భారత ప్రధాని రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలు జరగబోయే మంత్రి వర్గ విస్తరణలో బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పలపల్లి సోమన్న కోరారు.

# ఇదేమి గోల..




**తెరపైకి మళ్లీ భద్రాచలం మూడు పంచాయతీలు ● భద్రాద్రి ప్రజల్లో అయోమయం**

ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచలం మేజర్ గ్రామపంచాయితీని ముక్కలు చేసేందుకు మళ్లీ రంగం సిద్ధమవుతోంది. అందుకు సంబంధించిన బిల్లుపై గవర్నర్ రాధాకృష్ణన్ శనివారం రాత్రి సంతకం చేశారు. దీంతో భద్రాచలం ప్రజల్లో మళ్లీ అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే జరిగితే భద్రాచలం మూడు ముక్కలైన భద్రాచలం, సీతారాంనగర్, శాంతినగర్ పంచాయితీలుగా విడిపోనుంది. గత ప్రభుత్వం హయాంలో పరిపాలన సౌలభ్యం దృష్ట్యా భద్రాచలం మేజర్ గ్రామపంచాయితీని విడదీసేందుకు బిల్లు పెట్టామన్నారు. అయితే అప్పటి గవర్నర్ తమిళ సై సౌందర్ రాజన్ ఆ బిల్లును తిరస్కరించారు. దీంతో గవర్నర్ వర్సెస్ కేసిఆర్ అన్నట్లుగా సాగింది. మరో సారి కూడా బిఆర్ఎస్ ప్రభుత్వం మూడు పంచాయితీలుగా విభజించే బిల్లును గవర్నర్‌కు పంపారు. ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో ఆ బిల్లు ముందుకు సాగలేదు. ఇదిలా ఉండగా గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పంపిని భద్రాచలం మేజర్ గ్రామపంచాయితీని విడదీసి మూడు పంచాయితీలుగా చేసే బిల్లును ఉన్నది ఉన్నట్లుగా ఆమోదిస్తూ సంతకం చేశారు. ఇదే విషయంలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఎన్నికల సమయంలో భద్రాచలాన్ని ఒక్క పంచాయితీగానే ఉంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడుమూడు పంచాయితీలుగా విడిపోయేలా బిల్లుపై సంతకం అవుతుంటే చూస్తు ఊరుకోవడం వెనుక ఆంతర్యమేటిటో అంతుపట్టడం లేదని అంతా అంటున్నారు. ఎన్నికల వేల ఇచ్చిన వాగ్దానాలను గద్దెనెక్కిన తర్వాత విస్మరిస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ జరిపిస్తామని చెబుతున్నారు. బిఆర్ఎస్ నుండి గెలిచి ఈ ప్రాంతాభివృద్ధికి కోసం కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్నా అంటూ చెప్పిన ఆయన మూడు పంచాయితీల విభజనపై నోరుమెదపాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీ చట్టాల కారణంగా మున్సిపాలిటీ చేయడం సాధ్యం కాదని, కోర్టులో కేసులు ఉన్నాయని చెబుతున్న ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరు, ఇల్లెందులు మున్సిపాలిటీలుగా చెలామని అవుతున్నాయిగా అంటు ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ఇదెక్కడి మతలబో

మూడు పంచాయితీలపై హడావిడిగా గవర్నర్ సం తకం చేయడం వెనుక ఎంత మతలబు ఉందో అంటూ పలువురు చర్చించుకుంటున్నారు.రాష్ట్ర విభజన సమయంలో ఏపిలో విలీనమైనగుండాల, పురుషోత్తపట్నం, ఎటపాక, పిచుకలపాడు, కన్నాయిగూడెం గ్రామపంచాయితీలను తెలంగాణలో కలపాలని శనివారం సిఎంల సమావేశంలోముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరడంతో ఏపి సిఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఇందు కోసం కమిటీలు ఏర్పాటు చేసి త్వరలో పరిష్కరామయ్యేలా కృషి చేయడంతో పాటు కేంద్రానికి లేఖలు రాస్తామని హామీలు ఇచ్చారు. దీంతో ఇక్కడి ప్రజల్లో భద్రాచలం అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న ఐదు పంచాయితీలు వచ్చే అవకాశం ఉందని సంబురపడుతున్న వేళ అదే రోజు భద్రాచలం గ్రామపంచాయితీని మూడు ముక్కలు చేసే పంచాయితీరాజ్ బిల్లుపై సంతకం చేయడంతో ఆవేదనకు గురవుతున్నారు.అనాధికారిక లెక్కల ప్రకారం భద్రాచలం పట్టణ జనాబా లక్ష దాటిందనే సాకుతో పంచాయితీలను విడదీసి పాలన చేస్తామంటే ఎలా కుదురుతుందని, పట్టణ ప్రజలు పోరాటాలు చేసేందుకు సిద్ధమవుతారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అయితే అప్పటి బిల్లులను క్లియర్ చేసే పనిలో భాగంగా అనుకోకుండా ఆ బిల్లుపై సంతకం చేశారా, లేక ప్రభుత్వ పెద్దల ఆమోదం ప్రకారం గవర్నర్ సంతకం అయిందా అనే చర్చ ఇక్కడి ప్రజల్లో సాగుతోంది.

## నేడు ఎఐకెయస్ జిల్లా మహాసభ



సిపిఐ మండల కార్యదర్శి
రావులపల్లి రవికుమార్

ప్రజాపక్షం/ దుమ్ముగూడెం: తెలంగాణ రైతు సంఘం ఎఐ కె యస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెండో మహాసభ సోమవారం మండల పరిధిలోని గంగోలు వివిఆర్ పంక్షన్ హాల్లో జరుగుతుందని రావుల పల్లి రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంభశివ రావు, జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి పి పద్మ, ఎఐకెయస్ రాష్ట్ర అద్యక్షులు బాగం హేమంత రావు, జిల్లా అద్యక్ష కార్యదర్శులు ముత్యాల విశ్వనాధం, ఏపూరి బ్రహ్మం, సంద్ర నరేంద్రకుమార్, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి నారాటి ప్రసాద్ , సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు హాజరు కానున్నారు. వివిద మండలలాలనుండి పార్టీ నాయకలు మమండల కార్యదర్శులు హాజరవుతున్నారని అన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గోని ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మెడికల్ కౌన్సిలింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : మెడికల్ కౌన్సిలింగ్ లో విద్యార్థులు గందరగోళానికి గురికాకుండా ఆప్షన్లను జాగ్రత్తగా ఎంపిక చేసుకొని నీట్ కౌన్సిలింగ్ అనుభవజ్ఞులు అబ్దుల్ రబ్ ఆరిఫ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌విఆర్ గార్డెన్స్ లో మెడికల్ కౌన్సిలింగ్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై నీట్ కౌన్సిలింగ్ గురించి వివరంగా తెలియజేసి, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి మాట్లాడారు. మెడికల్ కౌన్సిలింగ్ సందర్భంగా అభ్యర్థులు గందరగోళానికి గురైతే సీట్లు తారుమారయ్యే అవకాశం ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని కౌన్సిలింగ్ లో పాల్గొనాలని సూచించారు. కాలేజీలను ఎంపిక చేసుకునేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లేకపోతే ఆశించిన కాలేజీలో సీటు దక్కదని అన్నారు. అవగాహన కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు అందరూ కౌన్సిలింగ్ లో సీటు దక్కించుకొని వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థుల సౌలభ్యం కోసం కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. తెలంగాణ మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఏ ఏ ఖాన్ మాట్లాడుతూ విద్యార్థుల సౌలభ్యం కోసం ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎండి అలీం, డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఆదిరెడ్డి, షరీఫ్, ఇంజనీర్ జునైద్ హష్మి, మహమ్మద్ అబ్దుల్ జమీర్, ఎం.ఏ.పర్వేజ్, హనీఫ్, ఖాదర్ పాల్గొన్నారు.

# నిరుద్యోగులతోనే చర్చించాలి

ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధిః నిరుద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించాల్సింది కాంగ్రెస్ నాయకులతో కాదని, నిరుద్యోగులతో మాట్లాడాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సంధర్భంగా యుగంధర్ మాట్లాడుతూ 3 వారాలుగా నిరుద్యోగులు ఆందోళన చేస్తుంటే సిఎం రేవంత్‌రెడ్డి వారితో చర్చించకుండా కాంగ్రెస్ విద్యార్థి, యువజన నాయకులతోనే మాట్లాడడం సరికాదన్నారు. హాస్టల్ వార్డెన్ పరీక్షలు రాసిన కొద్ది రోజులకే డిఎస్సీ ఉండడం, డీఎస్సీ, గ్రూప్ 2 పరీక్షలకు సైతం తక్కువ సమయం ఉండడంతో పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అవకాశం లేనందున అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. పరీక్ష పరీక్షకు మధ్య కనీసం 45 రోజుల గడువు పొడిగించాలని వారు కోరారు. అదే విధంగా పోస్టులు పెంచిన తర్వాతనే పరీక్షలు నిర్వహించాలని డిఎస్సీ, గ్రూప్స్ అభ్యర్థులు బలంగా కోరుకుంటున్నారని తెలిపారు. దీనిపై అభ్యర్థులు భయాందోళనలకు గురవుతున్న తరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించాలన్నారు. నిరుద్యోగులు, అన్ని విధ్యార్థి యువజన సంఘాల నాయకులతో చర్చించకుండా కాంగ్రెస్ అనుబంధ విధ్యార్థి యువజన సంఘాల నాయకులతోనే మాట్లాడడం వల్ల సమస్య కొలిక్కి రాదన్నారు. బాధిత అభ్యర్థులను పిలిచి చర్చించాలని, అభ్యర్థుల భయాందోళనపై సీఎం స్పష్టతనివ్వాలని కోరారు. ఉద్యోగ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, లేని పక్షంలో ఏఐవైఎఫ్ ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తుందని యుగంధర్ హెచ్చరించారు.

## ఎస్ఐ ఆత్మహత్యపై విచారణ చేయాల్సిందే



ప్రజాపక్షం/సూర్యాపేట: చట్టాలు అమలు చేసే స్థానాల్లో ఉన్న పోలీస్ శాఖలో కుల వివక్ష వేధింపులు ఉండడంతోనే దళిత ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎంవిఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అశ్వరావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ గత 25రోజుల క్రితమే తాను ఎదుర్కొంటున్నవివక్ష, వేధింపులను జిల్లా ఎస్పికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన ఉన్నతాధికారులు స్పందించలేదన్నారు. సిఐ జితేందర్ రెడ్డి, కొందరు కానిస్టేబుల్‌లు వేధించిన తీరుతోనే మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాటని తెలిపారు. ఈ ఘటనపై సిఎం రేవంత్ రెడ్డి స్పందించి ఎస్ఐ శ్రీనివాస్ మృతిపై సిట్టింగ్‌జడ్జితో సమగ్ర విచారణ జరిపించి బాధ్యుతలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీస్ శాఖలో జరుగుతున్న కుల వివక్ష, వేధింపులపై ప్రక్షాళన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని, ఎస్సి, ఎస్టి అట్రాసిటి కేసును పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మర్రి నాగేశ్వర్ రావు, జిల్లా నాయకులు సైదులు, సుధాకర్, నాగమణి, దుర్గారావు పాల్గొన్నారు.

## కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయండి



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేసి అన్ని వర్గాలకు పిల్లలకు సమానమైన విద్య అందేలా పాలకులు చూడాలని పిడిఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నాగరాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ప్రభుత్వ విద్యాను రక్షించాలని ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను కాషాయకరించి అంగట్లో సరకుగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తూ పూర్తిగా ప్రైవేట్ పరంచేలా వ్యవహరిస్తున్నారన్నారు. విద్య, ఉద్యోగాల కోసం కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత పదేళ్ళలో పాలకులు వాటిని మరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి, ఫీజుల నియంత్రణ చట్టాలు తీసుకవస్తామని చెప్తున్నారే తప్పా అమలు చేయడం లేదన్నారు. ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలతో పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలను రద్దు చేసి వాటిని ప్రభుత్వ ఆదినంలో తీసుకోని అందరికి సమానమైన విద్య అందేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, రాజేందర్, నవీన్, నాగరాజు, అజయ్, నితిన్ పాల్గొన్నారు.

## పుస్తెలతాడు దొంగల పట్టివేత

ప్రజాపక్షం/చింతపల్లి : మండల పరిధిలోని కుర్మేడు గ్రామానికి చెందిన గోరేటి బక్కమ్మ జూన్ 26 సాయంత్రం తన వ్యవసాయ భూమికి వెళ్లి, పత్తి గింజలు మొలకెత్తినవా, లేదా అనే విషయాన్ని పరిశీలించి నాగార్జునసాగర్ జాతీయ రహదారిపై తన ఇంటికి నడుచుకుంటూ వెళుతుంది. ఒంటరిగా బక్కమ్మ వెళుతున్న విషయాన్ని గమనించిన దొంగలు ఇది ఏ ఊరు పెద్దమ్మ అని మందలిస్తూ ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల బరువు గల బంగారు పుస్తెలతాడును లాక్కొని మోటార్ సైకిల్ పైన పారిపోయిన సంఘటన ఇటీవల మండల పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దేవరకొండ డిఎస్పి గిరిబాబు పర్యవేక్షణలో నాంపల్లి సిఐనవీన్‌కుమార్,చింతపల్లి ఎస్ఐ యాదయ్య ఆధ్వర్యంలో పోలీసులునిందితుల కోసం గాలింపు చేపట్టినట్టు నవీన్‌కుమార్ ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. సిఐ మాట్లాడుతూ పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. చోరీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను సాయిబాబా గుడి ఎదురుగా పట్టుకున్నారు.చోరీకి పాల్పడిన వ్యక్తులలో కుర్ర తుల్చానాయక్ కార్ డ్రైవర్‌గా జీవనంసాగిస్తూచోరీలకుపాల్పడుతున్నారు. తుల్చానాయక్‌ది బాలెంపల్లి, అడవిదేవులపల్లి మండలం, నల్గొండజిల్లాకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం మునగనూరు, హయత్‌నగర్‌లో ఉంటునట్టు తెలిపారు. రెండో వ్యక్తి ధరావత్ బాలకృష్ణ ప్రైవేట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు.బాలకృష్ణది బాలాజీనగర్, కోదాడ మండలం అని తెలిపారు.39 గ్రాముల బంగారు పుసైలతాడును, హూండా షైన్ మోటార్‌సైకిల్‌ను, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

# చట్టానికి తూట్లు..

## యథేచ్ఛగా లింగనిర్ధారణ పరీక్షలు



ప్రజాపక్షం/ సూర్యాపేట ప్రతినిధి : స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు, ప్రైవేట్ వైద్యులు కాసులకు కక్కుర్తితో యధేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు సూర్యాపేట జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు నామ మాత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకోవడంతో కడుపులో బిడ్డను కడపులోనే చిదిమేస్తున్నారు. దీనికి సంబంధించిన చట్టాలు కఠినంగా ఉన్నా బేఖాతర్ చేస్తున్నారు. 30 ఏళ్ళ లింగనిర్ధారణ చట్టానికి నీళ్లు చల్లుతున్నారు. గత వారం రోజుల క్రితం చివ్వెంల మండలం ఎంజీనగర్ తండాకు చెందిన ఓ గిరిజన మహిళ కోదాడలో లింగనిర్ధారణ పరీక్షలు చేయించుకోగా ఆడ పిల్ల అని తెలిసి తన భర్త హుజూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి అక్కడి నుండి మఠంపల్లి ఏరియాకు తరలించి అబార్షన్ చేసేందుకు ప్రయత్నించగా ఆమె మృతి చెందారు. దీంతో లింగనిర్ధారణ పరీక్షలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో స్పష్టం అవుతుంది.వైద్య ఆరోగ్య శాఖ అధికారులులెక్కలప్రకారం సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 46 ప్రైవేట్, 4 ప్రభుత్వ స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో సూర్యాపేటలో 28, కోదాడలో 12, తిరుమలగిరిలో 2, నేరేడుచర్లలో 1, హుజూర్ నగర్‌లో 3 ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు ఉండగా సదరు వైద్యులు ప్రభుత్వ అనుమతులు తీసుకోని నిర్వహిస్తున్నారు. వీటిలో కొన్ని వైద్యులు తమ ఆసుపత్రుల్లోనే పెట్టుకోని స్కానింగ్ నిర్వహిస్తుండగా మరి కొంతమంది ప్రత్యేకంగా పెట్టుకోని నడుపుతున్నారు.స్కానింగ్‌సెంటర్ల నిర్వాహకులు, వైద్యులుగ్రామీణ వైద్యుల(ఆర్‌ఎంపి,పిఎంపి)లను ఏజెంట్లుగా పెట్టుకొని చట్టవ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఈ దందా అంత బహిరంగంగానే సాగుతుంది. లింగ నిర్ధారణకు పరీక్షలకు రూ. 25వేల, ఆబార్షన్ చేస్తే రూ. 50వేలు వసూళ్లు చేస్తున్నారు. సూర్యాపేటలోని పాత వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఉన్న ఓ స్కానింగ్‌సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. ఇతని సతీమణి కూడా జనరల్ సర్జన్ కాగా నిబంధనలకు విరుద్దంగా గైనకాలజీస్టుగా ప్రసవాలు చేస్తూ ఇటీవల వైద్యాధికారుల తనిఖీలో పట్టుబడింది. దీంతో ఆసుపత్రిని కొన్ని రోజులు అధికారులు సీజ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధుల అండదండలు ఉండడంతో అతనిపై ఎన్ని ఆరోపణలు వచ్చిన అధికారులు కన్నెత్తి చూడలేదు. మహత్మాగాంధీ రోడ్డులోకు ఇరువైపుల ఉన్న ప్రధాన స్కానింగ్ సెంటర్‌లలో, కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తునట్లు సమాచారం. పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన గర్భిణీలకు ఓపి రాయకుండా... స్కానింగ్ అనంతరం ఏలాంటి రిపోర్టులు కూడా ఇవ్వకుండా కేవలం మగ, ఆడ బిడ్డా అన్న సమాచారం మాత్రమే చెబుతూ వేలల్లో డబ్బులు గుంజుతున్నారు. ఆడ బిడ్డ అని నిర్ధారణ అయితే ఆబార్షన్ చేస్తున్నారు. గత 20 సంవత్సరాల క్రితం వైద్య సేవలు చేసేందుకు వచ్చిన ఓ వైద్యుడు తన భార్య గైనకాలజిస్టు కావడంతో పెద్ద ఎత్తున లింగనిర్ధారణ చేస్తూ అధికారులకు పట్టుబడ్డాడు. తనపై కక్షపూరితంగా అధికారులు వేధిస్తున్నారని తప్పుడు ఆరోపణ చేసి ఇక్కడి నుండి ఇటీవల బిషానా సర్దుకోని వేరేచోటకు వేళ్లాడు. ఇదిలా ఉండగా కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డు, మెయిన్ రోడ్డు ఉన్న పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా పెద్ద ఎత్తున లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్షలు నిషేధిస్తూ ప్రభుత్వం 1994లో ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చింది. లింగ నిర్ధారణ చేసినట్లు నిరూపన అయితే రూ. 1లక్షల జరిమానాతో పాటు రెండు నుండి ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు దోషి అని తెలిస్తే వారి లైసెన్స్‌ను రద్దు చేయడం జరుగుతుంది. ఇంత కఠినంగా ప్రభుత్వ చట్టాన్ని తీసుకువచ్చిన వైద్యులు మాత్రం కాసులకు కక్కుర్తి పడి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. గత వారం రోజుల క్రితం సూర్యాపేట జిల్లాలో భృణహత్యకు ప్రయత్నించగా మహిళ మృతి చెందడం సంచలనంగా మారింది. చివ్వెంల మండలంలోని ఎంజీనగర్ తండాకు చెందిన ఓ వ్యక్తి తన భార్య రెండవసారి గర్భందాల్చగా లింగనిర్ధారణ పరీక్షలు కోదాడలో చేయించాడు. మొదట సంతాన కుమార్తె కావడంతో రెండవ సంతానం కూడా ఆడ పిల్ల అని తెలిసిన ఆయన అబార్షన్ చేయించేందుకు సిద్ధపడి హుజూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాడు. చివరకు అబార్షన్ వికడించి ఆమె ప్రాణాలు కోల్పోయింది.

### నామమాత్రమే తనిఖీలు

ప్రైవేట్ వైద్యులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్న విషయం వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు తెలిసిన ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పత్రికల్లో వచ్చి వార్త కథనాలతో నాలుగు రోజులు నామమాత్రపు తనిఖీల పేరుతో హడాహుడి చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని స్కానింగ్ సెంటర్లను, ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీలు చేసిన అధికారులు లింగ నిర్ధారణ పరీక్షలు నిజమే అని తేల్చిన వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ప్రైవేట్ వైద్యులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకుల నుండి నెలవారీ మాముళ్లు తీసుకొని అటు వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడడంలేదనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టి లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తున్న డిఇఒను సస్పెండ్ చేయాలి

టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** నిబందనలు అతిక్రమిస్తున్న డిఈఓ ను సస్పెండ్ చేయాలని టిఎస్ యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.మురళీ క్రిష్ణ అద్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబందనలు అతిక్రమిస్తూ ఇటివల నిర్వహించబడిన ప్రమోషన్, బదిలీలలో ఎస్సీ మహిళలకు రావలసిన ప్రమోషన్ను పురుషులకు కేటాయించి దానిపై యూటిఎఫ్ పోరాటంతో తిరిగి మహిళకు ప్రమోషన్ ఇచ్చారని, దాని కారణంగా ప్రమోషన్ పొంది రివర్షన్ ఐన వ్యక్తి మానసికంగా కుంగిపోయారని అన్నారు. అలాగే గత మూడేళ్లుగా విద్యాచట్టానికి వ్యతిరేకంగా విద్యాబోదనకు దూరంగా డిఈఓ కార్యాలయంలో డిప్యుటేషన్ పై పని చేయడం సరికాదని గత నెలలో ప్రాతినిద్యం చేసిన టీచర్ సమ్మెట సతీష్ ను అక్కడే ఎలా కొనసాగిస్తున్నారని అన్నారు. సీరోలు మండలం మన్నెగుడెం ఉన్నత పాఠశాల ప్రధానోపాద్యాయులు గణిత ఉపాద్యాయులను అక్రమ డిప్యుటేషన్ తో పని చేయడం కారణంగా ఆ పాఠశాలలొ విద్యార్దులకు గణితం భోదించే టీచర్ లేకుంగా అయిందని విద్యార్దులకు తీరని నష్టం జరుగుతుందని ఆయన వాపోయారు. విద్యార్దులు ఎక్కువ చోట తక్కువ, తక్కువ ఉన్న చోట ఎక్కువ టీచర్ పోస్టులను వేస్తూ విద్యార్దుల భవిష్యత్తుతో ఆటలు ఆడుతున్న డిఈఓ ను వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్, జిల్లా కార్యదర్శులు నామా వేంకటేశ్వర్లు, కె బిక్షపతి, మంజుల, జిల్లా ఆడిట్ కమిటి కన్వీనర్ వివేక్, హరినాయక్, సంజీవ, శ్రీనివాస్, ప్రవీణ్, రాజశేఖర్, సుందర్ కుమార్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన పట్టణాలకు దీటుగా రూపుదిద్దుకుంటున్న గజ్వేల్

చిరు వ్యాపారులకు ప్రోత్సాహం అందిస్తాం

మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త



**ప్రజాపక్షం/గజ్వేల్:** మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా చిరు వ్యాపారులకు ప్రోత్సాహం అందిస్తామని మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త పేర్కొన్నారు. ఆదివారం శ్రీ లక్ష్మీ బాలాజీ స్వీట్, బేకరీని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాన పట్టణాలకు దీటుగా గజ్వేల్ రూపుదిద్దుకుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా గజ్వేల్ పట్టడంతో పాటు సమీప ప్రాంతాలు వ్యాపార రంగానికి అనుకూలంగా మారినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధి మార్గాలని అన్వేషించి వ్యాపారంలో రాణించాలని, అలాగే వినియోగదారుల మన్నన పొందుతూ నాణ్యమైన వస్తువులని విక్రయించి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, తలకొక్కల భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, దుంబాల లక్ష్మి కిషన్ రెడ్డి, పట్టణ బీఆరెస్ అధ్యక్షులు నవాజ్ మీరా, ఐవిఎఫ్ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు సంతోష్ గుప్త, మర్వాడీ సంఘ నాయకులు, మాణిక్ లాల్, నర్సింగ్ రామ్, చోలారామ్, లీలా భారతి, పానలాల్, ప్రేమ్ సోలంకి, కేస రామ్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి వస్తే చట్టపరమైన చర్యలు

సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** ట్రాక్టర్ కేజ్ వీల్స్‌తో బిటి, సిసి రోడ్ల పైకి వస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. ప్రభుత్వం ఏన్నో నిధులు వెచ్చించి ప్రజల సౌకర్యార్థం రోడ్లు వేయటం జరుగుతుందన్నా రు. రోడ్డు డ్యామేజీ కావటం వల్ల ప్రమాదా లు జరిగే అవకాశం ఉందన్నారు. ఆదివారం సిపి అనురాధ స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ట్రాక్టర్ కేజీ వీల్స్‌తో బిటి, సిసి రోడ్లపైకి రావటం వల్ల రోడ్డు దెబ్బతింటాయన్నారు. ప్రజలకు మెరుగైన సుఖవంతమైన ప్రయాణం కోసం రోడ్లను నిర్మిస్తే కొందరు ట్రాక్టర్ యజమానులు పోలాల్లో పనిచేయటానికి కేజీ వీల్స్‌ను రోడ్లపై ఉపయోగించటం వల్ల రోడ్లు ధ్వంసమవుతున్నాయన్నారు. ట్రాక్టర్ యజమానులు పోలాల్లో పని నిమిత్తం వెళ్లెటప్పుడు తమ ట్రాక్టర్లను కేజీ వీల్స్‌తో రోడ్లపై నడుపవద్దన్నారు. కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి వస్తే వాహనచట్ట ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాక్టర్ యజమానులు బాధ్యత యతంగా నడుచుకొని ట్రాక్టర్ ట్రాలీలతో కేజీ వీల్స్ తీసుకొని వెళ్ల వ్యవసాయ పనులు చేసుకోవాలని సూచించారు.

## మట్టి స్నానంతో.. మహా ఆరోగ్యం



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** మట్టి స్నానంతో మహా ఆరోగ్య అని యోగ ఆచార్యులు వంశీకృష్ణ అన్నారు. ఆది యోగ పరమేశ్వర పౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో వయోల గార్డెన్‌లో యోగ గురువులు బొజ్జ అశోక్, ఎలిగేటి కృష్ణమూర్తి, పెద్ది మనోహర్ ఆధ్వర్యంలో మట్టి స్నానం కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఉదయం సూక్ష్మ యోగ ఆసనాలు సాధన చేయించి వాటి ఉపయోగాలు భోధించారు. ఆనంతరం కార్యక్రమానికి హాజరైన వారితో మట్టి స్నానం చేయించారు. ఈసందర్భంగా ఆది యోగ పరమేశ్వర యోగ పౌండేషన్ ఆచార్యులు వంశీకృష్ణ మాట్లాడుతూ పురాతన కాలం నుండి మట్టి స్నానం ఆచరించేవారమన్నారు. ఆదునిక కాలంలో అనేక చర్మ సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్న వారి మట్టి స్నానం ఆచరించటంతో ఉపషమనం లభిస్తుందన్నారు. మట్టి స్నానంతో శరీర ఉష్ణోగ్రత తగ్గించ బడటంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ఆది యోగ పరమేశ్వర పౌండేషన్ వ్యవస్థాపకులు సిద్దిరాములు, తుల్జాపూర్ వినోద్ ప్రతి నెల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో యోగ గురువు మట్టి స్నానం నిపుణులు గురుజీ శ్రీనివాస్,ప్రభుదాస్, కడవేర్గు రమేశ్‌బాబు, కత్తుల బాపురెడ్డి, జూలురి రవికుమార్, దేవేందర్‌గౌడ్, సముద్రాల శ్రీనివాస్, చింతల శ్రీనివాస్,కూతురు రాజిరెడ్డి, నాయిని సంజీవరెడ్డి,శ్రీహరి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రం, రాము తదితరులు పాల్గొన్నారు. ఆనంతరం ఆది యోగిపరమేశ్వర పౌండేషన్ శిక్షకులను శాలువాతో సన్మానించారు.

# ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమం జవాబుదారి తనంతో పూర్తి

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** వన మహోత్సవం కార్యక్రమం క్రింద జిల్లాలో నాటిన ప్రతి మొక్క సంరక్షణకు ప్రణాళికబద్దంగా చర్యలు తీ సుకోవాలని మొక్కల పెంపకం, సంరక్షణలో నాణ్యత పెరగాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివా రం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అనసూయ జాకారం సో షల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ, డి ఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్‌లతో కలిసి మొక్కలు నాటి వన మహోత్సవం కార్యక్రమం జిల్లాలో ప్రారంభించారు. అనంతరం మంత్రి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. మంత్రి జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేయడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత, మొక్కల పెంపకం, పచ్చదనం ప్రాముఖ్యత విద్యార్థి దశ నుండే పిల్లలకు తెలియాలనే ఉద్దేశ్యంతో పాఠశాల వద్ద వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని అధికారులు జవాబుదారీతనంతో పూర్తి చేయాలని మంత్రి సూచించారు. మొక్కల పెంపకం చాలా మంచి ఆలోచన అని, దీనివలన అనేక లాభాలు ఉంటాయని తెలిపారు. ఆలోచన బాగా ఉన్న ఆచరణ సరిగ్గా లేకపోతే ఆశించిన ఫలితాలు దక్కవని, పటిష్ట కార్యాచరణతో వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మొక్కలను నాటడంలో పెద్ద లక్ష్యాలను ఏర్పాటు చేసుకోకుండా, తక్కువ మొక్కలు నాటినప్పటికి వాటిని వంద శాతం సంరక్షించాలని అన్నారు. ఇంటింటికి పంపిణీ చేసే మొక్కలు, రోడ్డుపై నాటే మొక్కల లెక్కలు పక్కాగా ఉండాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే ములుగు జిల్లాలో 76...77 అటవీ శాతం ఉందని దీని ద్వారానే ములుగు జిల్లాలో ఎక్కువ వర్షపాతం నమోదు అవుతుందని కురిసిన వర్షపు నీటిని నిల్వ చేయడం కోసం చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్‌ల ద్వారా నిర్మాణం జరగాలని అటవీ ప్రాంతంలో కూడా చెక్ డ్యాంల నిర్మాణాలు చేపట్టాలని దీని ద్వారా వర్షపు నీరు నిల్వ ఉండడం ద్వారా అటవీ ప్రాంతంలో ఉండే అటవీ జంతువులకు ఉండడం ద్వారా అటవీ ప్రాంతాలలో ఉండే అటవీ జంతువులకు అటవీ వృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో అడవులను నరకరాదని ప్రతి ఒక్కరు మొక్కలు పెంచుటకు కృషి చేయాలని, ములుగు ప్రాంతాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం ఫైల్ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉందని, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ఫైల్‌ను ముందుకు తీసుకెళ్ళడం జరిగిందన్నారు. సోషల్ వెల్ఫేర్ ఆర్‌సిఓ విద్యారాణి, డిఆర్‌డిఓ శ్రీనివాస్‌కుమార్, డిఎస్‌పి రవీందర్, తహసీల్దారు విజయభాస్కర్, ఎంపిడిఓ రామకృష్ణ, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ములుగు జిల్లా కేంద్రంలోని ఎంఎల్‌ఏ క్యాంప్ కార్యాలయం లో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి సీ తక్క ఆదివారం అందించారు. ఈ సందర్భంగా మం త్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల అం దదండలు ఎల్లప్పుడు ఉన్నాని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆగష్టు 15 లోపు రూ. 2లక్షల రుణమాఫీ చేయబోతున్నారని, రైతుల సం క్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా, బ్లాక్, మండల , గ్రా మ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శాకాంబరి దేవిగా ఏడుపాయల వన దుర్గమ్మ

ఆషాడ బోనాలు...


పోతరాజుల విన్యాసాలు

ఎటు చూసినా జనమే జనం





**ప్రజాపక్షం/పాపన్నపేట:** కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా వెలసిన ఏడుపాయల వన దుర్గమ్మ క్షేత్రం ఆషాడ మాసం మొదటి ఆదివారం సందర్భంగా ఏడుపాయల క్షేత్రమంతా జనంతో నిండిపోయింది. ఆషాడ మాసం పురస్కరించుకొని ఏడుపాయల వన దుర్గమ్మను వివిధ కూరగాయలతో శాఖాంబరి అవతారంలో అమ్మవారిని అలంకరించి పూజారులు దర్శన భాగ్యం కల్పించారు... పరమ పావని, జగ జనని గా జ నం కోసం వెలిసిన వన దుర్గమ్మను భక్తులు దర్శించుకుని వివిధ మొక్కులు చెల్లించుకున్నారు. వేకువ జామునే పూజారులు పార్థీవ శర్మ, రాజశేఖర్ శర్మ, రామ్ శర్మలు అమ్మవారిని ప్రత్యేకం గా వివిధ కూరగాయలతో శాకాంబరి మాతగా అలంకరించారు. పచ్చని అడవుల్లో కొండ కోనల్లో మంజీరా నది తీరాన స్వయంభుగా వెలసిన వనదుర్గమాతను తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, రాష్ట్రాల నుండి భక్తులు విచ్చేసి బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శించుకోవడానికి ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేసినప్పటికి వీఐపీ దర్శనంతో పాటు జనరల్ దర్శనం లో గంటల తరబడి భక్తులు వేచి ఉన్నారు. బోనాల సందడి పోతరాజుల విన్యాసాలతో క్షేత్రమంతా భక్తులతో నిండిపోయింది.



గ ల గల పారే మంజీరా నదిలో పుణ్య స్నా నలు ఆ చరించి ఓడిబియ్యం, తలనీలాలు, సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాల లో ఉన్న ప్రభుత్వ, ప్రవేటు సత్రాలన్నీ భక్తులతో నిండిపోయాయి. చెట్ల కింద భక్తులు సేదా తీరి వంట వార్పు చేసుకుని భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. భక్తుల జయ జయ ద్వానుల మధ్య ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రం హోరెత్తింది. ఆలయ అర్చకులు శంకర శర్మ, మురళీ శర్మ, పూజలు చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ చైర్మన్ బాలా గౌడ్, పాలక మండలి సభ్యులు చక్రపాణి, ఆలయ సిబ్బంది లక్ష్మీనారాయణ, మధుసూదన్ రెడ్డి, బ్రహ్మం, ఏర్పాట్లు చేశారు. భక్తులు ఆలయ పరిసరాల్లోని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, ఏలాంటి అ వాచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


## కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సి సెల్ చైర్మన్‌గా రాజ్‌కుమార్



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండలంలోని ఖిలా షాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీడికంటి రాజ్‌కుమార్‌ను రఘునాథపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా నియమిస్తూ ఆదివారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సింగపురం ఇందిర నియామకపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ నా మీద ఎంతో నమ్మకంతో ఈ పదవి బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జి సింగపురం ఇందిరకు, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేత కొరకు అహర్నిశలు పనిచేస్తానని ఆయన అన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకొరకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మి నరేందర్, లింగాలఘణపురం, రఘునాథపల్లి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె రమేష్, మాజీ జెడ్పీటీసీ మారుజోడు రాంబాబు, తాజా మాజీ జెడ్పీటీసీ బొల్లం మణికంఠ (అజయ్), జిల్లా నాయకుడు గాదె మహేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు గుగులోత్ కొంరెల్లికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ట్రిపుల్ ఐటి బాసరకు ఎంపికైన విద్యార్థినికి సన్మానం

ఎమ్మెల్యే గండ్ర సత్తన్న



**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండల కేంద్రంలోని ఫ్రోబెల్ మోడల్ హై స్కూల్లో పదవ తరగతి చదివి 10/10 మార్కులు సాధించిన విద్యార్థిని దుగ్యాల వైష్ణవికి ట్రిబుల్ ఐటీ బాసరలో మొదటి లిస్టులో సీటు సాధించిన సందర్భంగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఆదివారం మండల కేంద్రంలోని ఫ్రొబెల్ మోడల్ హై స్కూల్ ఆవరణంలో దుగ్యాల వైష్ణవికి మరియు పాఠశాల ఉపాధ్యాయులు ల్యాదల్ల యాదగిరి ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గరంపురం మండలం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ వెంటనే నియమించాలి

జాతీయ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంపల శివ కుమార్

**ప్రజాపక్షం/ఏటూరు నాగారం :** తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ వెంటనే నియమించాలి. తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు గంపల శివ కుమార్ డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలైన తరువాత కూడా దళితులు ఇంకా సమానత్వం కోసం పోరాడుతూనే ఉన్నారని ఈ రోజుల్లో కూడా ఉన్నత కులాల వారు దళితులకు రాజకీయాల్లో గాని ఉద్యోగాల్లో గాని, సమాజంలో కానీ, తమతో సమానమైన హోదా ఇవ్వడానికి సిద్ధంగా లేరని జాతీయ మాల మహానాడు రాష్ట్ర నాయకులు గంపల శివ కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అశ్వారావుపేట పోలీస్ స్టేషన్లో ఎస్ఐ గా పనిచేస్తున్న శ్రీరాముల శ్రీనివాస్ ను కులం పేరుతో వేధిస్తూ, అగ్రవర్ణాల అహంకారం ప్రదర్శిస్తూ నిత్యం వేధింపులకు గురిచేసి, ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన సీఐ ని, నలుగురు కానిస్టేబుళ్లను ఉద్యోగం నుండి తొలగించాలని, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు గంపల శివ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూన్ 30న ఆత్మహత్యకు పాల్పడ్డ ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతి చెందిన నేపథ్యంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర ఉప అధ్యక్షుడు గంపల శివ కుమార్ మాట్లాడుతూ అశ్వారావుపేట పోలీస్ స్టేషన్లో ఎస్సైగా పనిచేస్తున్న దళితుడైన శ్రీరాముల శ్రీనివాస్ ను సీఐ జితేందర్ రెడ్డి, కానిస్టేబుళ్లు సన్యాసినాయుడు, సుభాని, శేఖర్, శివ నాగరాజు వేధింపులకు గురి చేయడంతో గత నెల 30న ఆత్మహత్యకు పాల్పడ్డాడని, గత వారం రోజులుగా హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మరణించడం బాధాకరమని అన్నారు. అగ్రకుల అహంకారంతో రాష్ట్రవ్యాప్తంగా దళిత ఉద్యోగులపై వేధింపులు కొనసాగిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్ ఆత్మహత్యకు కారణమైన సీఐ, కానిస్టేబుల్ లను ఉద్యోగం నుండి తొలగించాలని, శ్రీనివాస్ కుటుంబానికి 5 కోట్ల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని, ఆయన భార్యకు గ్రూప్ 2 ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్ మృతికి కారణమైన సీఐ జితేందర్ రెడ్డి, నలుగురు కానిస్టేబుళ్లను సర్వీసు నుండి తొలగించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మాల మహానాడు నాయకులుపాల్గొన్నారు.

# ప్రైవేట్ దోపిడీ




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను పట్టించు కోవడం లేదు. ఇష్టారాజ్యంగా స్కూళ్లు నడుపుతూ ఒక్కో విద్యార్థి నుంచి వేల రూపాయలు దండుకుంటున్నారు. అర్హత లేని టీచర్లతో బోధన, పరోక్షంగా పుస్తకాలు, యూనిఫాంల వ్యాపారం, స్టేట్, సెంట్రల్ సిలబస్ పేరిట అధిక ఫీజులు వసూ లు, ఇలా చెప్పుకుంటే పోతే వారి ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం నుంచే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల వేట మొదలుపెట్టాయి. తమ పాఠశాలలో చేరితే పిల్లల భవిష్యత్ బాగుంటుందని ఆశలు రేపి అడ్మిషన్లు తీసుకుంటున్నాడు.. చాలామంది తల్లిదండ్రులు స్కూళ్లకు ప్రభుత్వ అను మతులు ఉన్నాయా లేదా, వసతులు, అర్హులైన టీచర్లు ఉన్నారా అని తెలుసుకోకుండానే అడ్మిషన్లు తీసుకుంటున్నారు. వసతులు లేని స్కూళ్లకు అనుమతులు జిల్లాలో 72 వరకు ప్రై వేటు స్కూళ్లు ఉన్నాయి. వీటి లో 10 శాతం స్కూళ్లు మాత్రమే నిబంధనలకు లోబడి నిర్వహిస్తున్నారు. నిబ ంధనలు పాటించని స్కూళ్లకు విద్యాశాఖ నుంచి అనుమతులు వస్తుండటం విమర్శలకు తావిస్తోంది. చాలా స్కూళ్లలో కనీస వసతులు కూడా లేవు. తరగతి గదికి కిటికీలు లేని స్కూళ్లు కూడా ఉన్నాయి. ఇలాంటి వా టికి కూడా ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. ప్రధాన రహదారులకు సమీపంలోని స్కూళ్లకు ప్రహరీలు కూడా లేవు.

> నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు
> ప్రైవేట్ విద్యాసంస్థల వ్యాపారం
> ఫీజుల దోపిడీ తప్ప..
> నిబంధనలు పట్టని దుస్థితి
> అర్హతలేని సిబ్బందితో బోధన
> అసౌకర్యాల మధ్య స్కూళ్ల నిర్వహణ
> చోద్యం చూస్తున్న విద్యాశాఖ
> ఆందోళనలో తల్లిదండ్రులు

### అంతా వ్యాపార ధోరణే

ప్రైవేట్ విద్యాసంస్థలు పూర్తిగా వ్యాపార ధోరణి అవలంభిస్తున్నాయి. విద్యార్థుల ఫీజులు మొదలుకొని, పుస్తకాలు, యూనిఫాం, రవాణా, టర్మ్ ఫీజుల పేరిట అందిన కాడికి దండుకుంటున్నారు. ఏ మాత్రం సౌకర్యాలు లేని పాఠశాలల్లో కూడా అధిక ఫీజులు వసూ లు చేస్తున్నారు. ఎల్కేజీ నుంచి పదో తరగతి వరకు సంవత్స దానికి రూ.15వేల నుంచి రూ.25వేల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో నర్సరీ, ఎల్ కేజీ పిల్లలకే ఏకంగా సంవత్సరానికి అలాంటి వాటికి పోలీసులు.. ట్రాఫిక్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. వసతులు లేని స్కూళ్లకు నోటీసులు పంపుతున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నా పైనుంచి అనుమతులు మాత్రం ఆగడం లేదు. రూ.25 వేలు తీ సుకుంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే ఐదు నుంచి పది రెట్లు ఎక్కువ వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠ్యపుస్తరాలు కాకుండా నోట్ బుక్స్, ఆ యా పాఠశా లల వర్క్ బుక్స్ పేరిట రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇవే పుస్తకాలు దుకాణాల్లో కొనుగోలు చేస్తే రూ.వెయ్యికి మించవని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వేళ బయట పుస్తకాలు కొనుగోలు చేస్తే వాటిని స్కూల్ యాజమాన్యాలు అనుమతించడం లేదు. చాలా స్కూళ్లల్లో యూని ఫాంలను వారే విక్రయిస్తున్నారు.

### కార్పొరేట్ ఫీజుల ధరల జోరు

జిల్లా కేంద్రంలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో పుస్తకాల ధరలు మండిపోతున్నాయి. నర్సరీకి రూ.2, 049, ఎల్కేజీకి రూ.3,023, యూకేజీకి రూ.3,249, ఒకటవ తరగతికి రూ.5,384, రెండో తరగతికి రూ.5574, మూడో తరగతికి రూ.6029. నాలుగో తరగతికి రూ.6631, ఐదో తరగతికి రూ.6,796 లకు పాఠ్య పుస్తకాలు, డైరీ, నోట్ పుస్త కాలు అమ్ముతున్నారు. ఎందుకు ఇంత ధరలు అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ఇష్టమైతేనే కొనండి. ఒక్క రూపా యికు కూడా తగ్గేది లేదని బదులిస్తున్నారు.

## పోడు భూములకు పట్టాలివ్వాలి



**ప్రజాపక్షం/పెంచికల్ పేట్ :** పోడు భూములకు ఆదివాసీలతో పాటు, ఎస్‌సి, బిసిలకు పట్టాలు ఇవ్వాలని నేతకాని (మహార్) సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి నర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బసర్కార్ విశ్వనాత్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎల్లూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ లోని గోదావరి పరివాహక ప్రాంతం గల అదిలాబాద్ నుండి భద్రాచలం వరకు నిరుపేదలైన ఆదివాసుల తో పాటు ఎస్‌సి, బిసిల పోడు రైతులు ఉన్నారని వారందరికి పోడు పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా నేతకాని కులస్తుల సంక్షేమానికి నేతకాని మాహార్ కార్పొరేషన్ కేటాయించాలని సంఘం పరంగా సిఎం రేవంత్ రెడ్డిని కోరగా హామీ ఇచ్చారని త్వరలోనే కార్పొరేషన్ ఏర్పాటు చెలయాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డోంగ్రే లహన్ రాజ్, ఒంద్రే ప్రేమానందమ్, కర్మే ఏమాజీ, రాజేశ్వర్, శివకుమార్, గోమాస దామోదర్, దుర్గం దాయానంద్, గోమాస చంద్రశేఖర్, శంకర్, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో వాహనాలు తనిఖీ



**ప్రజాపక్షం / జగిత్యాల ప్రతినిధి :** సరైన డాక్యుమెంట్లు లేని 25 వాహనాలను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేశామని జగిత్యాల పట్టణ సిఐ వేణుగోపాల్ తెలిపారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పట్టణంలోని న్యూ బస్టాండ్ వద్ద జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ లో బాగంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ సరిగా లేని వాహనాలు, హెల్మెట్ ధరించనీ వారికి ఫైన్ విధించామన్నారు. అదేవిధంగా వాహనదారుల డాక్యుమెంట్ సరిగా లేని వారిపై కేసు నమోదు చేసి 25 ద్వి చక్ర వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు సిఐ వేణుగోపాల్ తెలిపారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సిఐ సూచించారు.

## ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

బిసిటియు జిల్లా అధ్యక్షులు మాడవేటి వినోద్‌కుమార్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** బదిలీ అయిన ఎస్‌జిటి ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని బీసీటీయు జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీసీ ఉపాధ్యాయ సంఘం సమావేశంలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలలో ఒకే పాఠశాలలో దాదాపు 13 సంవత్సరాలు పని చేసి బదిలీ అయిన తర్వాత కూడా వారిని రిలీవ్ చేయకపోవటం బాదాకరమన్నారు. బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి ఖాళీలను విద్యావాలంటీర్లచే భర్తీ చేయాలన్నారు. ఆప్షన్లకు తగు సమయం ఇవ్వక సాంకేతిక, ఇతర కారణాలతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని స్కూల్ అసిస్టెంట్ పదోన్నతలలో పలువురు ఉపాధ్యాయులకు ఒకటి కంటే ఎక్కువ సబ్జెక్టులలో పదోన్నతి వచ్చిందని ఎంపిక చేసుకున్న సబ్జెక్టు పోగా మిగిలిన వారు పదోన్నతి తిరస్కరించిన సబ్జెక్టు ఖాళీలను తదుపరి అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవపురం గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రమణ, స్వామి, కొట్టాల రామకృష్ణ, బోగ ప్రతిభ పాల్గొన్నారు.

## గురుకుల సొసైటీ రెజ్లింగ్ క్రీడా పాఠశాలకు అక్షయ ఎంపిక



**ప్రజాపక్షం/ఎండపల్లి :** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన మంతెన అక్షయ గురుకుల రెజ్లింగ్ క్రీడా పాఠశాలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆదివారం గ్రామపంచాయతీ ఆవరణలో ఘనంగా సన్మానించడం జరిగింది. చొప్పదండి గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అక్షయ గురుకుల క్రీడా రెజ్లింగ్ క్రీడా పాఠశాలకు ఎంపిక అయింది. రెజ్లింగ్ క్రీడలో పాఠశాల సంగారెడ్డి జిల్లాలోని ఇస్నాపూర్ రెజ్లింగ్ అకాడమీకి ఎంపిక కావడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. అదేవిధంగా కొందరు పెద్దలు ఆర్థిక సాయం చేయడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో మారపల్లి రవీందర్ రెడ్డి, బూరగడ్డల శ్రీనివాస్, రజక సంఘం అధ్యక్షులు నస్పూరి మల్లేష్, బూరగడ్డల రవి, మాజీ సర్పంచ్ బుల్లెడ్ల శంకరయ్య, బైకని కొమురయ్య, బుష్నవేణి ప్రమోద్, మంతెన సురేష్, సబ్బ సంతోష్, వెల్డి హరీష్, మామిడిపల్లి తిరుపతి, మంతెన వినోద్, చొప్పదండి నరసయ్య, అక్షయ, విద్యార్థిని తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అనాథలకు చేయూత అందించాలి

ఎస్‌కెటి చైర్మన్ దోసపాటి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అనాథలకు చేయూత నందించడం ప్రతీ ఒక్కరు బాధ్యతగా స్వీకరించాలని ఎస్‌కెటి నిర్మాణాల చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడె ం జిల్లా బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యోతి అనాథ ఆశ్రమంలో ఆదివారం వృద్ధులకు చీరలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక స్తోమత ఉన్న ప్రతీ ఒక్కరూ అనాథ వృద్ధులు, పిల్లలను ఆదుకోవాలన్నారు. అనాథలమన్న భావన వారిలోరాకుండా చేయూతనందిస్తే సమాజంలో మంచి వ్యక్తులుగా నిలుస్తారని చెప్పారు. అనాథలను చేరదీసి వారికి సేవలు అందిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. రాబోయే రోజుల్లో ఆశ్రమాలకు తమ వంతు సహాయసహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు దోసపాటి క్రాంతి, పల్లపోతు ప్రేమ్, సాయి, గోపాల్, పంచారియా, ఎస్‌కెటి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ సిటీలో జరిగిన అవినీతిపై సిబిఐ విచారణ జరిపించాలి

● దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలి ● సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి :** కరీంనగర్ నగరంలో స్మార్ట్ సిటీ పనుల్లో జరిగిన కోట్ల రూపాయల అవినీతిపై కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థ సిబిఐ విచారణ జరిపితే నగరంలో జరిగిన అభివృద్ధి పనుల్లో అవినీతి పూర్తిగా బయటకు వస్తుందని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు డిమాండ్ చేశారు. దాదాపు స్మార్ట్ సిటీ కింద వెయ్యి కోట్ల రూపాయలు మంజూరు కావడం జరిగిందని, ఇందులో 700 కోట్లకు పైగాఖర్చు చేశారని, 250 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ పనుల్లో పూర్తిగా అవినీతి అక్రమాలే జరిగాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఒక్కటై కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ సిటీ నిధులను గతంలో ఉన్న 50 డివిజన్లకే వాడాలని చట్టం చెబుతున్నా ధిక్కరించి అధికారులు ప్రజాప్రతినిధులు ఇష్టారీతిన నిధులు కేటాయించారన్నారు. నగరానికి సంబంధించిన నిధులను బొమ్మకల్ జంక్షన్ సుందరీకరణకు ఎలా ఉపయోగిస్తారని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉన్న ప్రాంతాలను జంక్షన్ల పేరిట కోట్లా రూపాయలు ఉపయోగించడం చూస్తుంటే అవినీతికి అద్దం పడుతున్నట్లు అర్థమవుతోందన్నారు. మెస్సర్స్ మాధవ కన్స్‌ట్రక్షన్ కెఎస్‌సిసిఎల్ సంస్థ రెండు కోట్ల వరకే టెండర్లు పిలవాలని నిబంధన ఉన్నా అంతకుమించి ఎక్కువ టెండర్ పిలవాలంటే ప్రిన్సిపల్ కార్యదర్శితో అనుమతి తప్పనిసరి అవసరం అని తెలిసినప్పటికీ నిబంధనలు మార్చేసే కుట్రలు అధికారులు, ప్రజాప్రతినిధులు పన్నారంటే ఎంత దోపిడీ జరుగుతుందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. స్మార్ట్ సిటీ పనులపై కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని, వారి చేతిలో ప్రభుత్వం ఉండగా ఎందుకు విచారణ చేపట్టడం లేదని ప్రశ్నించారు. సిబిఐ, సిఐడి, విజిలెన్స్ నుంచి విచారణకు ఆదేశించేందుకు ఎందుకు ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు తోడు దొంగల్లా వ్యవహరిస్తున్నారే తప్ప సమస్యపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కాంట్రాక్టర్ బిల్లులు చెల్లించడం లేదని, చాలా ప్రాంతాల్లో సంవత్సరాల తరబడి పనులు మధ్యలోనే నిలిపివేశారని, చాలా కాలనీల ప్రజలు రోడ్లు నిలిపి వేయడంతో ఇబ్బందుల పాలవుతున్నారని వాపోయారు. దీనిపై ఏ ఒక్క ప్రజాప్రతినిధి పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ నేతలు విచారణ జరిపించేందుకు కృషి చేయాలన్నారు. లేని పక్షంలో మూడు పార్టీలను ప్రజలు దోషులుగా చూస్తారన్నారు. లక్షల రూపాయలతో అయ్యే జంక్షన్లను కోట్ల రూపాయల టెండర్లు పిలిచి భారీ అవినీతికి పాల్పడ్డారన్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థలో జరిగిన అవినీతి గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను వెంటనే శిక్షించాలని, లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని సురేందర్ రెడ్డి, పైడిపల్లి రాజులు హెచ్చరించారు.

## విద్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యం

ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం / వేములవాడ :** ప్రభుత్వ విద్యాలయాల్లో మెరుగైన వసతులు కల్పించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో రూ.16 లక్షల అంచనాతో ఎనిమిది టాయిలెట్ల నిర్మాణానికి ప్రభుత్వ విప్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కింద పలు ప్రభు త్వ పాఠశాలల్లో వివిధ రకాల మరమ్మతు పనులు చేయించిందని తెలిపారు. ఇప్పటికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్బుక్లు పంపిణీ చేయించామని వివరించారు. అనంతరం ప్రభుత్వ విప్, కలెక్టర్‌తో కలిసి కస్తూర్బా గాంధీ విద్యాలయ ఆవరణంలో పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూసుకోవాలని పాఠశాల విద్యాలయం బాధ్యులను ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటూ, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని పేర్కొన్నారు. అనంతరం వా రిద్దరు కలిసి వేములవాడ కోరుట్ల ప్రధాన రహదారిలో నిర్మాణంలో ఉన్న మర్రిపల్లి వంతెన పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన చేపట్టి వెంటనే అందుబాటులోకి తేవాలని అధికారులను ప్రభుత్వ విప్ ఆదేశించారు. పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇక్కడ పంచాయతీరాజ్ ఈ ఈ సూర్య ప్రకాష్, జిల్లా అధికారులు, కస్తూర్బా గాంధీ విద్యాలయం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యకు పాల్పడిన ఎస్ఐ మృతి

☞ మిన్నంటిన ఆందోళనలు, రోదనలు
☞ వేధింపులపై ఎస్ఐ వీడియో వైరల్
☞ నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు

**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** తోటి సిబ్బంది వేదింపులకు తాళలేక మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడిన అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాములు శ్రీనివాస్ హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్సలు పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందారు. గత నెల 30వ తేదిన అదృశ్యమైన ఆయన మహబూబాబాద్ సమీపంలో రాత్రి 10 గం. సమయంలో కలుపు మందు తాగి అపస్మారక స్థితిలోనికి వెళ్లాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వరంగల్ ఆస్పత్రికి హుటాహుటిన తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో హుటాహుటిన హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ఆయన ఆరోగ్య పరిస్థితి క్రమంగా క్షీణించడంతో మృత్యువుతో పోరాడి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు వేదింపులకు పాల్పడిన పోలీసులపై కేసు నమోదుచేసి శాఖా పరమైన చర్యలు తీసుకున్న విషయం విధితమే. ఎస్ఐ శ్రీరాములు శ్రీనివాస్ మృతి చెందడంతో సిబ్బందిపై ఎస్సి, ఎస్టి అట్రాసిటి కేసు కూడా నమోదైంది. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా





ఎస్ఐ మృతికి కారణమైన పోలీస్ సిబ్బందిని అరెస్టు చేసి ఆయన కుటుంబానికి న్యాయం చేయాలంటూ దళిత సంఘాలతో పాటు పలు రాజకీయ పార్టీల వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని రింగ్ రోడ్‌లో గంటపాటు ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి సిఐ కరుణాకర్‌కు వినతి పత్రాన్ని అందచేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ చట్ట బద్ధంగా న్యాయం చేయగల పోలీస్ శాఖలోనే ఇంత పెద్ద అన్యాయం జరిగిందని, ఎస్ఐ ర్యాంకు పనిచేసే శ్రీరాములు శ్రీనివాసు వేదింపులకు గురికావడం అగ్రకుల అహంకారానికి నిదర్శనం అన్నారు. వేదింపులపై డిఎస్‌పికి తెలిపినప్పటికీ పట్టించుకోలేదని స్వయంగా ఎస్ఐ తెలిపాడని, ఉన్నతాధికారులు అసలు ఏమి చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. పోలీస్ శాఖలోనే ఇలాంటి పరిస్థితులు ఉంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలని, ఎస్ఐ చెప్పిన మరణ వాగ్మూలంలో ఉన్న ప్రతీ ఒక్కరిపై చర్యలు తీసుకోవాలని, వారిని ఉద్యోగాల నుండి పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు అదే విధంగా ఎస్ఐ స్వగ్రామంలో సైతం శవంతో భార్య, కుటుంబ సభ్యులు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సయ్యద్ సలీం, గన్నెన రామకృష్ణ, దళిత సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి తగరం రాంబాబు, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు తిరువీధుల జేమ్స్, గద్దల వెంకటరమణ, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

### ఎస్ఐ శ్రీనివాస్ మృతి బాధాకరం : సాబీర్ పాషా



**ప్రజాపక్షం/కొత్తగూడెం:** అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ మృతి బాధాకరమని, ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవలు అందించాల్సిన ఆయన అకాల మరణం పొందడం దిగ్భ్రాంతికి గురిచేసిందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న ఎస్ఐ తన సేవల ద్వారా మంచిపేరు సంపాదించారన్నారు. సిపిఐ జిల్లా సమితి తరుపున ఆయన మృతికి సంతాపాన్ని తెలుపుతూ కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేస్తున్నామన్నారు. మృతికి గల కారణాలపై న్యాయ విచారణ జరిపి కుటుంబానికి న్యాయం చేయాలని, కుటుంబాన్ని పోలీస్ శాఖ అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తాం

టియుడబ్ల్యుజె (ఐజెయు) జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్



**ప్రజాపక్షం /రామగిరి :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని టియూడబ్ల్యుజె (ఐజెయు) జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్ అన్నారు. ఆదివారం కమాన్ పూర్ మండల కేంద్రంలో పెద్దపల్లి జిల్లా టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నగునూరి శేఖర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధనలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందన్నారు. వివిధ వర్గాల సమస్యలు పరిష్కారం అయినప్పటికీ, జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. 10 ఏళ్ల తర్వాత జర్నలిస్టుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇల్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం అనుకూలంగా ఉన్నట్లు కనబడుతుందన్నారు. వర్కింగ్ జర్నలిస్టులందరికీ 200 గజాల ఇండ్ల స్థలాలతో పాటు, ప్రత్యేక కోటా కింద ఇండ్లు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ పలు తీర్మానాలను చేసింది. జిల్లాలో ఉన్నటువంటి జర్నలిస్టులందరికీ 200 గజాల ఇళ్లస్థలతో పాటు, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని తీర్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలందరికీ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లుగానే, జర్నలిస్టులందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే జర్నలిస్టులు పనిచేసే వృత్తి ప్రమాదకరమైందని, ఈ నేపథ్యంలో జర్నలిస్టులందరికీ రైతు బీమా వలే 10 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్నటువంటి హెల్త్ కార్డులకు భిన్నంగా,ప్రత్యేకంగా జర్నలిస్టులందరికీ రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో అవసరమైతే జర్నలిస్టుల పరంగా చెల్లించే ప్రీమియంలో తాము భాగస్వాములు అవుతామని చెప్పారు. జిల్లా అధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని, ఎవరు కూడా ఆందోళన చెందవద్దని సూచించారు.
ప్రభుత్వ పరంగా మనకు రావాల్సిన హక్కులను సాధించి తీరుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐజేయు జాతీయ కౌన్సిల్ స భ్యులు వంశీ దయానంద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యు లు కోల లక్ష్మణ్, గాండ్ల శ్రీనివాస్, దాడుల నివారణ కమిటీ చైర్మన్ సిపెల్లి రాజేశం, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణదాసు అశోక్, పాలకుర్తి విజయ్ కుమార్, పోతరాజు సమ్మయ్య, పొన్నం శ్రీనివాస్, కోశాధికారి పెండ్యాల రామ్ కుమార్, జిల్లా ఆర్గనైజింగ్, సంయుక్త కార్యదర్శి బాలసాని రాజయ్య, కె ఎస్ వాసు, జక్కని సత్యనారాయణ, సురభి శ్రీధర్, కె చంద్రమోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త చట్టాలపై అవగాహన సదస్సు

పాల్గొన్న రిటైర్డ్ జిల్లా జడ్జి అజిత్ సింహ రావు
జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలీమ

**ప్రజాపక్షం/ మెట్‌పల్లి :** దేశంలో జూలై1 నుండి అమలులోకి వచ్చిన నూతన న్యాయ చట్టాలపై అవగాహన సదుస్సు ఆదివారం మెట్‌పల్లి పట్టణంలోని విధిత్ రెడ్డి గార్డెన్‌లో రిటైర్డ్ జిల్లా జడ్జి అజిత్ సింహ రావు, పోలీసులకు న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగిత్యల జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ, మెట్ పల్లి డిఎస్పీ ఉమామహేశ్వర్ రావు పాల్గోన్నారు, జులై 1 అమల్లోకి వచ్చిన నూతన చట్టాల వల్ల చట్టంలో వచ్చిన పలు మర్పులను రిటైర్డ్ జిల్లా జడ్జి అజిత్ సింహ రావు వివరించారు, న్యాయవాదులు నూతన చట్టాలపై అవగాహన పెంచుకొని బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ న్యాయవాదులు, పోలిస్‌లకు సూచించారు, అనంతరం పోలీస్‌సులకు న్యాయవాదులకు ఉచిత క్రిమినల్ మాన్యువల్ బుక్స్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షు లు పుప్పాల లించాద్రి, తన్నీరు శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి తునికి వే ణుగోపాల్, వద్దే పల్లి శ్రీనివాస్, ఆనంద్ గౌడ్, మగ్గిడి వెంకట నర్సయ్య, జిల్లా వెంకటేస్వర్లు, నరేందర్ రెడ్డి, ఎలుమల రాంబాబు, గడ్డం శంకర్ రెడ్డి, జగన్, భానుమూర్తి, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గోన్నారు.



## ఉద్యోగ విరమణ చేయాల్సిందే..

65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఆదేశాలు జారీ

కాగజ్‌నగర్ ఐసిడిఎస్ పరిధిలో 19 మంది ఉద్యోగులు ఇంటి దారి

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణను రాష్ట్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి 65 ఏళ్లు పూర్తి చేసుకున్న వారు తప్పకుండ పదవీ విరమణ పొందాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో కాగజ్ నగర్ ఐసిడిఎస్ పరిధిలోని కాగజ్ నగర్ అర్బన్, కాగజ్ నగర్ మండలం, దహేగాం నుండి 19 మంది ఉద్యోగులు ఇంటి దారి పట్టారు. గతంలో పదవీ విరమణ అనేది లేదు. ఉద్యోగులు మరణించే వరకు అంగన్‌వాడి కేంద్రాల్లోనే పని చేస్తూ ఉండేవారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకే కాకుండా ప్రైవేటు సెక్టార్ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ ఆప్షన్ ఉన్నప్పుడు అంగన్‌వాడి ఉద్యోగులకు ఎందుకు వర్తింప చేయకూడదని చర్చసాగింది. ఇందులో భాగంగానే 65 ఏళ్లు నిండిన ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని గత ఏడాది ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. గడిచిన 2021మార్చి31 నాటికే పదవీ విరమణ అంశాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల కోడ్, పలు కారణాలతో ఆ నిర్ణయం అమలు కాలేదు. దీంతో మూడు నెలలు పొడిగించారు. తాజాగా సోమవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఉత్తర్వులను జారీ చేయడంతో మంగళవారం పదవీ విరమణ అమలులోకి వచ్చింది. ఇదిలా ఉండగా అంగన్వాడీ కార్యకర్తలు పదవీ విరమణ చేస్తే రూ.2 లక్షలు, ఆయాలకు రూ. 1 లక్ష రిటైర్మెంట్ బెన్ఫిట్ ఇవ్వాలని గతంలోనే అసోసియేషన్ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. అలాగే పింఛన్లు ఇవ్వాలని కోరారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కాగజ్ నగర్ ఉన్నతాధికారులు వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న వయస్సు పైబడిన ఉద్యోగులను తొలగించడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. త్వరలోనే ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### ఉత్తర్వులను అమలు చేశాం : సురేఖ సిడిపిఒ, కాగజ్ నగర్

పదవీ విరమణ విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేశామని, కాగజ్ నగర్ ఐసిడిఎస్ పరిధిలో 19 మంది పదవీ విరమణ పొందారని, దీంతో ఖాళీలు ఏర్పడ్డాయని, వీటిని భర్తీ చేయడానికి త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంటుందని కాగజ్ నగర్ సిడిపిఒ సురేఖ తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్ విషయంలో ప్రభుత్వం ఏమైనా మార్పులు చేస్తే ఆ మొత్తాన్ని ఉద్యోగులకు అందిస్తామని వెల్లడించారు.

## గంజాయి అమ్ముతూ పట్టుబడిన ఐదుగురు అరెస్ట్

75వేల రూపాయలు : మూడు కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**ప్రజాపక్షం/రామగిరి :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి, రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో గల లద్నాపూర్ ఓసిపిII సెంటర్ వద్ద గంజాయి అమ్ముతూ పట్టుపడగా ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్టు మంతిని సీఐ ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు.వివరాల్లోకి వెళితే రామగిరి మండలం నాగ పల్లి గ్రామానికి చెందిన కొండవేన అనిల్ స్నేహితులు అయిన 1,మాముత్తారం మండలం వాజి నపెల్లి గ్రామానికి చెందిన చెందిన కొండపాక రవి కిరణ్ 2,మాముత్తారం మండలం స్తంభం పల్లి గ్రామానికి చెందిన జాడి రాజేష్ మరియు3, మంతిని మండలం గోపాలపూర్ గ్రామానికి చెందిన ఎరుకల భాస్కర్4 కాటారం మండలంధన్వాడ ,కిష్టం పల్లి గ్రామానికి చెందిన సుతారి శ్రీకాంత్ అను ఐదుగురు వ్యక్తులు 3కిలోలు గంజాయి, విలువ దాదాపు రూ.75000లు గల గంజాయిని రెండు మోటార్ సైకిల్స్‌పై నాగేపెల్లి ఎక్స్ రోడ్ వైపు అమ్మడానికి తీసుకొని వస్తుండగా ఈనెల 6న లద్నాపూర్ ఓసీపీ టు సెంటర్ వద్ద రామగిరి ఎస్సై సందీప్ కుమార్ వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడినారువెంటనే వీరి దగ్గర ఉన్న 3 కిలోల గంజాయిని, 2 మోటార్ సైకిల్స్ (పల్సర్, హోండా షైన్)ని, వారి యొక్క మొబైల్ ఫోన్లను సీజ్ చేసివారిపై కేసు నమోదు చేసి మంతిని కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు ఆదివారం మంతిని సీఐ ఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూఅవసరాలకు మరియు జల్సా లకు డబ్బు లు సరిపోకపోవడంతో ఎలాగైనా తొందరగా సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకుని ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో వీరు ఇదివరకే గాంజాయి తాగే అలవాటు ఉండటం వలన గంజాయి అమ్మడం వల్ల ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చు అని అట్టి డబ్బులతో వారి అవసరాలు తీర్చుకోవచ్చని ఒడిస్సా రాష్ట్రానికి చెందిన కాంతారావు అనే వ్యక్తి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి చుట్టుపక్కల గ్రామాలలో రహస్యంగా గంజాయి తాగుడుకు అలవాటు పడిన వ్యక్తులకు ఎక్కువ డబ్బులకు అమ్మడం జరుగుతుందని ఎవరైనా గంజాయి అమ్మడం కానీ త్రాగడం కానీ అనే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ మంతిని సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల సమస్యలకు శాశ్వత పరిష్కారం

## కేంద్రం విభజన హామీలు నెరవేర్చాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి వినతి






**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలకు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో ఏర్పాటు చేసిన కమిటీలు శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి కోరారు. సిపిఐ హనుమకొండ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం ఆదివారం భీమదేవరపల్లి మండలంలోని ములుకనూరులో ఊట్కూరి రాములు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి చాడ వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న తెలుగు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి ఇరురాష్ట్రాల సిఎంలు చొరవ తీసుకుని సమావేశం కావడం హర్షనీయమన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణకు రావాల్సిన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ హామీలు అమలు చేయాలన్నారు. తెలంగాణలోని బొగ్గు గనులను ప్రైవేటుపరం చేయబోమని ఎన్నికల ముందు చెప్పి నేడు టెండర్లు పిలుస్తున్నారన్నారు. తెలంగాణలోని సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే టెండర్లు పిలుస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వానికి ముకుతాడు వేసేలా గట్టి ప్రతిపక్షం ఏర్పడిందని, గతంలో మాదిరిగా మోదీ నిరంకుశ, నియంతృత్వ పాలన చెల్లదన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఇండియా కూటమిలోని ఇతర భాగస్వామ్య పక్షాలను సమన్వయం చేసుకుని దేశంలోని ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. దేశంలో మతం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్న బిజెపి, ఎన్‌డిఎ ఆగడాలను అరికట్టేందుకు వామపక్ష లౌకిక శక్తులను కాంగ్రెస్ కలుపుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, కూడు, గూడు, గుడ్డ అందేటా కృషిచేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు మాసాలు కావస్తున్నదని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాపాలన దరఖాస్తులకు పరిష్కారం చూపాలని, పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పెంచిన పింఛన్లు, పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డులను అందించాలన్నారు. రైతు భరోసాపై ముఖ్యమంత్రి అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని, కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలని సూచించారు. రైతు రుణమాఫీ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. గ్రామగ్రామాన పార్టీ ప్రతిష్టకు కృషిచేయాలని కోరారు.

### ఇండ్లు, ఇళ్లస్థలాల కోసం ఆందోళనలు

తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు

పేదలకు ఇండ్లు, ఇళ్లస్థలాలపై గత ప్రభుత్వం మోసం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు, ఇండ్ల స్థలాలు అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం సిపిఐ ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. జులై 19న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట, జులై 26న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి స్థానిక సమస్యలపై దృష్టి సారించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయ సారథి, నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, బికెఎంయు జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, నాయకులు మద్దెల ఎల్లేష్, తోట బిక్షపతి, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, బాషబోయిన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి పోరాటాలు

రాజన్న సిరిసిల్ల జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి వేణు



**ప్రజాపక్షం/వేములవాడ :** ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణు పేర్కొన్నారు. సిపిఐ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ కడారి రాములు ఆధ్వర్యంలో వేములవాడ సిపిఐ పట్టణ, రూరల్ మండలాల నూతన కమిటీలను ఆదివారం ఎన్నుకున్నారు. సమావేశానికి రాజన్న గుంటి వేణు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను నెరవేర్చాల్సిన అవసరం ఉం దన్నారు. ప్రజాపాలన దరఖాస్తులకు పరిష్కారం చూపాలని, పేదలకు ఇండ్లు, ఇండ్లస్థలాలు, పెంచిన పింఛన్లు, పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డులను అందించాలన్నారు. రైతు భరోసా కౌలు రైతులకు వర్తింపజేయాలని సూచించారు. వేములవాడ పట్టణ కార్యదర్శులుగా గాజుల పోశెట్టి, పెంట శ్రీనివాస్, రూరల్ కార్యదర్శులుగా శ్రీరాములు, నరసయ్య, సహాయకార్యదర్శి పండుగ పోషా ఎన్నికయ్యారు. సమావేశంలో కెవి అనసూర్యా, కోరేపు క్రాంతి, కోరెపు శ్రీను, పెంట గణేష్, పండుగ చంద్రయ్య, కుమార్, కొండయ్య, డప్పు శీను పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించండి

ఎస్ఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్



**ప్రజాపక్షం /వనపర్తి టౌన్ :** ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరేష్ డిమాండ్ చేశారు. మన ఊరు మన బడి పేరుతో పనులు నత్త నడకగా సాగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఎఐఎస్ఎఫ్ వనపర్తి పట్టణ కమిటీ సమావేశం ఆదివారం సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేయాల్సిన రెండు జతల యూనిఫాంలకు ఒక జత యూనిఫాంతో రోజు ఉతుక్కొని రాగలరా అని ప్రశ్నించారు. తక్షణమే మరొజత యూనిఫాం విద్యార్థులకు అందజేయాలని కోరారు. పాఠ్య పుస్తకాలు కూడా పూర్తిస్థాయిలో అందలేదని, కొంతమంది విద్యార్థులకు గత సంవత్సరం పాఠ్యపుస్తకాలను అందజేశారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక చదువు కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంపై చిత్తశుద్ధితో తక్షణమే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ స్కూల్ బస్సులను ఆర్టీఓ అధికారులు తనిఖీలు చేసి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ వనపర్తి డివిజన్ కన్వీనర్ వంశీ, నాయకులు అరవింద్ , చరణ్ , గణేష్ , సురేందర్ , బన్ని, జస్వంత్, చరణ్ , భానుప్రకాశ్ , నాని తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులను ఆదుకోవాలి : ఎంపికి వినతి



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి:** భూపాలపల్లి, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల మీదుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే జాతీయ రహదారిని ఆపుటకు కృషి చేయాలని ఉమ్మడి జిల్లా బాధిత రైతులు రామచంద్రరావు, రాజిరెడ్డిలు అన్నారు. మాజీ మంత్రి కడియ శ్రీహరికి, వరంగల్ ఎంపి కడియం కావ్యలకు వినతపత్రాలను బాధిత రైతులు ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వఅధికారులు జాతీయ రహదారి నిర్మాణం రైతుల పంట పొలాల్లో సర్వేలు చేసి హద్దులు ఏర్పాటుచేస్తుండగా అడ్డుకున్నామని అయినప్పటికి బలవంతంగా భూసేకరణ చేపడుతున్నారన్నారు. తరతరాలుగా వ్యవసాయాన్ని వృత్తిగా జీవనం సాగిస్తున్న రైతు కుటుంబాలకు ఈ భూములు పోతే బతికే దిక్కేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవేను రద్దుచేసి బ్రౌన్ ఫీల్డ్ రోడ్డుగా మార్చాలని కోరారు. రైతులకు ఎకరానికి రూ.10కోట్ల నష్టపరిహారం ఇవ్వాలని, టోల్‌గేట్‌ద్వారా వచ్చే ఆదాయంలో నష్టపోయిన రైతులకు 70శాతం వాటా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు నల్లపు దేవేందర్, మంద సంధ్య, అయిలి సాంబయ్య, దమ్మిశెట్టి నర్సింగం, అబ్బాడి రవీందర్ రెడ్డి, పాపిరెడ్డి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మయ్య సేవలు చిరస్మరణీయం

సిపిఐ జనగాం జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి




**ప్రజాపక్షం/జనగామ టౌన్ :** సిపిఐ జిల్లా కార్యాలయంలో కొత్తూరి లక్ష్మయ్య వర్థంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి, జిల్లా సహాయ క్యాదర్శి ఆది సాయన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ కొత్తూరి లక్ష్మయ్య సిపిఐకి సేవలు చిరస్మరణీయమన్నారు. కొత్తూరి లక్ష్మయ్య నిరాడంబరంగా జీవించారని, సిద్ధాంతాలను నమ్మి, వాటిని ఆయరించి సిపిఐలో తుదిశ్వాస విడిచే వరకు నిస్వార్థంగా పనిచేశారన్నారు. పార్టీ కార్యాలయానికి తన సొంత ఆస్తులను ఇచ్చి లక్ష్మయ్య దాతృత్వాన్ని చాటుకున్నారని వారి సేవలను కొనియాడారు. లక్ష్మయ్య ఆదర్శం నేటితరానికి స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు మంగళంపల్లి జనార్థన్, ఎం.సుదర్శన్, పి.ఐలయ్య, హనుమంతు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ్మా

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కామ్రేడ్ లక్ష్మణాచారి భవనంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో తెలంగాణ మధ్యాహ్న బోజన వర్కర్స్ యూనియన్, ఎఐటియూసి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశానికి హాజరై బాల్‌నర్సింహ్మా మాట్లాడుతూ రాష్ట్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు, పెండింగ్ బిల్లులు మూడు నెలల నుంచి బిల్లులు ఇవ్వడం లేదని, దీంతో మధ్యాహ్న భోజన కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. మూడునెలల నుంచి బిల్లులు రాకపోవడంతో కిరాణ కొట్టు దగ్గర, కూరగాయల షాపు దగ్గర అప్పులు తెచ్చి నెట్టుకొస్తున్నారని అన్నారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు వెంటనే నెలసరి వేతనం చెల్లించే విధంగా జిఓ తీసుకురావాలని, కనీస వేతనం నెలకు 26వేల రూపాయలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, శ్రీనివాసులు, ఎఐటియూసి జిల్లా సహాయ కార్యదర్శి, తెలంగాణ మధ్యాహ్న బోజన కార్మికవర్కర్స్ నాయకులు నాగమ్మ, వరమ్మ, గౌసియాబేగం, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వెంకటయ్య, కార్యవర్గసభ్యులు చంద్రమౌళి, సిపిఐ టౌన్ కార్యదర్శి కపిలవాయి గోపిచారి తదితరులు పాల్గొన్నారు.




## సింగరేణిలో కలర్‌కార్డుల విధానాన్ని ఖండిస్తున్నాం





### ఎల్లో, రెడ్ కార్డుల జారీ పేరుతో కార్మికులకు ఇబ్బంది

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సింగరేణిలో ఫ్రంట్‌లైన్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఎల్లో, రెడ్ కార్డులు జారీ చేస్తూ కార్మికులను ఇబ్బంది పెడుతున్న నూతన కార్డుల విధానాన్ని బేషరతుగా ఉపసంహరించుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని ఇబ్బందుల గురిచేసే ఒక నల్ల చట్టంగా దీన్ని భావిస్తున్నామన్నారు. ఎలాంటి పొరపాట్లు చేయకున్నా సింగరేణి యాజమాన్యం ఎల్లో, రెడ్ కార్డులను జారీ చేస్తూ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఎలాంటి సమాచారం లేకుండా కార్మిక సంఘాలతో చర్చించకుండా నూతన కార్డుల విధానాన్ని సింగరేణి యాజమాన్యం ప్రవేశపెట్టడం దుర్మార్గమైన చర్య అని ఈ విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సింగరేణిలో అమలు చేస్తున్న ఎల్లో, రెడ్ కార్డులను తక్షణమే యాజమాన్యం రద్దు చేయాలని, లేదంటే ఈనెల 19న జరిగే సింగరేణి ఉన్నత స్థాయి త్రైపాక్షిక సమావేశంలో చర్చించి, పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎఐటియుసి వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, గురుజేపల్లి సుధాకర్‌రెడ్డి, మధుగాని విజేందర్, తాళ్ల పోషం, ఎస్ఆర్, ఎంఎస్ జె మురళి, అఖిల్, ప్రసన్నకుమార్, సాదిక్, కుమార్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

### బేషరతుగా రద్దు చేయాలి

**పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణిలో ఎల్లో, రెడ్ కార్డులు జారీచేస్తూ కార్మికులను ఇబ్బంది పెడుతున్న యాజమాన్యం వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని, నూతన కార్డుల విధానాన్ని బేషరతుగా రద్దు చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటీయుసి ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్రకార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఎల్లో, రెడ్ కార్డులను జారీచేస్తూ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఒకసారి ప్రమాదానికి కారకులైన వారికి ఎల్లో కార్డు, మూడుసార్లు కారకులైన వారికి రెడ్ కార్డు జారీ చేస్తారని, దీని వల్ల కార్మికులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతారన్నారు. యాజమాన్యం స్పందించి ఎల్లో, రెడ్‌కార్డులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఉన్న నూతన బొగ్గు గనులను వేలం వేయకుండా సింగరేణికి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8 నుండి 12 వరకు సింగరేణివ్యాప్తంగా అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల వద్ద రిలే నిరాహారదీక్షలు నిర్వహిస్తున్నామని, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలనికోరారు. సమావేశంలో సంకె అశోక్, రంగు శ్రీనివాస్, ఎస్.వెంకట్‌రెడ్డి, గండి ప్రసాద్, మిట్ట శంకర్, దొంత సాయన్న, ఎంఎగౌస్, సిద్దమల్ల రాజు, మానాల శ్రీనివాస్, పర్లపెల్లి రామస్వామి, ఎం.సంపత్, తాని రాజబాబు, రవి, ఎల్ రాజకిశోర్, బండారి శ్రీనివాస్, అటికేటి రాజు, దాసరి శ్రీనివాస్, డి.సారయ్య, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

## వాటర్ సప్లయ్ కార్మికులకు కనీస సౌకర్యాలు





సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా డిమాండ్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కిన్నెరసాని నీటిపథకం విభాగంలో పనిచేస్తున్న వాటర్ సప్లయ్ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు చట్టబద్ధమైన హక్కులు అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎఐటియూసి జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్‌కె సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. ఎఐటియూసి జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో కిన్నెరసాని వాటర్ సప్లయ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియూసి ప్రథమ మహాసభ ఆదివారం కంచర్ల జమలయ్య, గిద్దాడు నగేష్ అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరై సాబీర్‌పాషా మాట్లాడుతూ వాటర్ సప్లయ్ కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. శ్రమకు తగిన వేతనాలు అమలు చేయాలని, యూనిఫాం ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్, హెల్త్‌కార్డులు, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సభలో కౌన్సిలర్లు ధర్మరాజు, యూసఫ్, కార్మికులు గోపి, సురేష్ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులు ఎర్రబెల్లి శంకర్, ఉపాధ్యక్షులుగా శివకుమార్, చాట్ల శైలు, ప్రధానకార్యదర్శిగా రఫీ, సహాయకార్యదర్శిగా నాగభూషణం, కోశాధికారిగా ముధకర్‌రెడ్డితో పాటు 11మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

### సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

సేవలతోనే ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని, ప్రభుత్వశాఖల్లో ప్రజలకు సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులు, కార్మికుల శేషజీవితం సుఖమయం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ఆకాంక్షించారు. కొత్తగూడెం మున్సిపల్ శాఖలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన మర్రి లక్ష్మిని ఆదివారం ఉర్దూఘర్ నందు ఎఐటియుసి, సిపిఐ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య, జిల్లా కార్యదర్శి గెద్దాడి నగేష్, సిపిఐ నాయకులు అల్లి హనుమంతు, అల్లి రాఘవులు, అల్లి శేఖర్, ముత్యయ్య, రాందాసు, గోపి తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ అందుబాటులో ప్రభుత్వ వైద్యసేవలు

ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల జిల్లా :** ప్రజలందరికీ అందుబాటులో వైద్యసేవలు అందించేందుకు పక్కా ప్రణాళికతో వెళ్తున్నామని ప్రభుత్వవిప్ ఎంఎల్ఏ ఆది శ్రీనివాస్ తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు143 లక్షల నిధులతో రాజన్నజిల్లాలోని రుద్రంగి మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవన నిర్మాణానికి ఆదివారం ఆది శ్రీనివాస్‌తో కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం విప్ మాట్లాడారు.మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని, అర్హులైనవారు ప్రభుత్వ వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## భీకర ఎన్‌కౌంటర్లు

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ప్రతికూల వాతావరణం కారణంగా అమర్‌నాథ్ యాత్ర వాయిదా పడిన సంగతి తెలిసిందే. యాత్ర వాయిదా అనంతరం ఉగ్రవాదులపై ఈ ఆపరేషన్ ప్రారంభించాయి భద్రతా దళాలు. మొదట జరిగిన ఎన్ కౌంటర్ లో పారా కమాండో లాన్స్ నాయక్ ప్రదీప్ నైన్ వీర మరణం పొందారు. దీంతో ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా భద్రతా దళాలు ఆపరేషన్ ప్రారంభించాయి. రెండో ఎన్‌కౌంటర్ చినిగామ్ గ్రామంలో జరిగింది. ఈ ప్రాంతంలో లష్కరే తోయిబా ఉగ్రవాదులు ఉండవచ్చని భద్రతా దళాలకు సమాచారం అందింది. ఈ ఆపరేషన్‌లో 1వ రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన హవల్దార్ రాజ్ కుమార్ వీరమరణం పొందారు. గ్రామానికి చేరుకోగానే.. ఓ ఇంట్లో దాక్కున్న ఉగ్రవాదులు అకస్మాత్తుగా భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు. ఇంకా రెండు చోట్ల భీకర కాల్పులు కొనసాగుతున్నాయి. కశ్మీర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వీకే బిర్ధి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశాలను సందర్శించారు. యాంటీ టెర్రరిస్ట్ ఆపరేషన్ కొనసాగుతుందని చెప్పారు.

**దాడుల వెనుక లష్కరే తోయిబా**

జమ్మూకశ్మీర్‌లో ఇటీవల కాలంలో జరుగుతున్న ఉగ్రదాడుల వెనక లష్కరే తోయిబా, ది రిసిస్టెన్స్ ఫ్రంట్‌కి చెందిన ఉగ్రవాదుల హస్తం ఉన్నట్లుగా భద్రతా వర్గాలు తెల్పాయి. పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్సులోని కసూర్ జిల్లాలోని శంగమంగ గ్రామానికి చెందిన సైఫుల్లా సాజిద్ జట్ ఈ దాడుల వెనక ఉన్న మాస్టర్ మైండ్‌గా ఎన్ఐఏ తెలిపింది. ఈ కరుడు గట్టిన ఉగ్రవాది తలపై రూ.10 లక్షల బహుమతి ఉంది. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని బేస్ క్యాంప్‌లో జాట్ పనిచేస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. అతని భార్య భారతీయ మూలాలకు చెందిన వ్యక్తి అని, అతనితోనే ఉంటుందని వారు తెలిపారు. ఇందకుముందు పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే) పనిచేసిన జట్, ప్రస్తుతం లష్కర్ సంస్థకు నియామకాలు నిర్వహిస్తున్నాడు. ఉగ్రవాదులు భారత్‌లోకి ప్రవేశించడానికి సాయం చేస్తున్నాడని నిఘా వర్గాలు తెలిపాయి. సాజిద్ జట్ లష్కర్‌కి ఆపరేషనల్ కమాండర్‌గా వ్యవహరిస్తూనే, దాని టెర్రర్ ఫండింగ్‌ను కూడా నిర్వహిస్తున్నాడు. ఎన్ఐఏ మోస్ట్ వాంటెడ్ లిస్ట్‌లో ఉన్నాడు. అతనికి జమ్మూ కాశ్మీర్‌లో ఖాసీం అనే వ్యక్తి ఉన్నాడని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. అతని కోసం భద్రతా సంస్థలు వేట సాగిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా కాశ్మీర్ లోయలో జరిగే అనేక ఉగ్రఘటనల వెనక జట్ హస్తం ఉందని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.

## భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, నాగర్ కర్నూల్ జిల్లా ల్లో భారీ వర్షాలు పడుతాయన్నారు. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు కొత్తగూడెం, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురుసే అవకాశం ఉందన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామని ఈ మేరకు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

## నిరుద్యోగం

(మొదటి పేజీ తరువాయి)

మారింది. జిఎస్టీ, చైనా నుంచి దిగములు పెంచుకోవడం, నోట్ల రద్దు వంటి తుగ్లక్ చర్యలతో ఎంఎస్ఎంఈలపై తీవ్ర ప్రభావం పడింది. ఉద్యోగ కల్పన అటకెక్కింది. మోదీ ప్రభుత్వఆర్థిక విధానాలతో బడా వ్యాపారులే లబ్ధి పొందాయి. ఈ నాన్ బయోలాజికల్ ప్రధాని... భారత్‌లో నిరుద్యోగాన్ని 45ఏళ్ల గరిష్ఠానికి తీసుకెళ్లారు. గ్రాడ్యుయేట్ యువతలో నిరుద్యోగ రేటు 42శాతానికి చేర్చారు' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. వచ్చే పదేళ్లలో యువతకు సరిపడ ఉద్యోగాలు ఉండాలంటే ఏడాదికి 1.2కోట్ల ఉద్యోగాలు సృష్టించాలని సిటీగ్రూపు నివేదిక పేర్కొన్నదన్నారు. ఏడు శాతం జీఎస్టీ వృద్ధి సాధించినా సరిపడ ఉద్యోగాలు కల్పించలేమని నివేదిక తెలిపిందని, మోదీ హయాంలో జీడీపీ వృద్ధి సగటున 5.8శాతంగా ఉందన్నారు. మోదీ ఆర్థిక విధానాల వైఫల్యంతో నిరుద్యోగ సంక్షోభం నెలకొందని తెలిపారు. 10 లక్షల కేంద్రప్రభుత్వ ఉద్యోగాల భర్తీ జరగలేదన్నారు. దీని ప్రభావం విద్యావంతులైన యువతపైనే కాకుండా ప్రభుత్వ పనితీరుపైనా ఉందని చెప్పారు. కార్మికశక్తిలో 21శాతంగా వేతనాలు పొందుతున్నారని, కోవిడ్‌కు ముందు ఇది 24శాతంగా ఉన్నాట్లు జైరాం రమేశ్ తెలిపారు. కోవిడ్ తర్వాత సంపన్నులు మాత్రమే లబ్ధి పొందారని, వేతనజీవుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. గ్రామీణ ప్రజలను మరింత పేదరికంలోకి మోదీ నెడుతున్నారని ఆరోపించారు. 'స్కిల్ ఇండియా' పూర్తిగా విఫలమైందని, 4.4శాతం మంది మాత్రమే శిక్షణ పొందారని జైరాం రమేశ్ తెలిపారు. కాంగ్రెస్ న్యాయ పత్రంలో ఇచ్చిన అప్రెంటైస్‌షిప్ హామీ అమలు తక్షణావసరమన్నారు. చిన్న వ్యాపారాలకు మద్దతివ్వడంలో ముద్రా, స్వానిధి జుమ్లాలుగా పరిణమించాయని వ్యాఖ్యానించారు. చిరు ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని 'లివింగ్ వేజెస్' (జీవనానికి సరిపడే వేతనాల) చట్టం అవసరమన్నారు. కాంగ్రెస్ హామీనిచ్చినట్లు రూ.400 దినసరి వేతనాన్ని ఇవ్వడం సముచితమని తెలిపారు. నిర్మాణ రంగంలో మరిన్ని ఉద్యోగాలను సృష్టించుకోవాలని, సామాజిక గృహనిర్మాణ కార్యక్రమానికి కేంద్రం పూనుకోవాలని జైరాం రమేశ్ సూచనలు చేశారు. నిరుద్యోగ సమస్యను మోదీ, ఆయన అనుకూల ఆర్థికవేత్తలు తోసిపుచ్చుతూ వచ్చారు కానీ వాస్తవమేమిటో 2014నుంచి మనం చూస్తున్నామని వ్యా ఖ్యానించారు. తమకు సరైన వసతులుగానీ విశ్రాంతిగానీ లభించడంలేదని రాహుల్ వద్ద లోకో పైలెట్లు మొరపెట్టుకున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com